thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 88 | కరీంనగర్ శనివారం, 7 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## త్వరలో మీడియా కౌన్సిల్ ఏర్పాటు

న్యూఢిల్లీ : దేశంలో డిజిటల్ వేదికలు, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా యాప్‌లు భారీ సంఖ్యలో పుట్టుకొస్తున్నాయి. వీటి నియంత్రణ ప్రభుత్వాలకు సంక్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో మీడియా కౌన్సిల్ అనివార్యమని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కేంద్రానికి ఇటీవలే నివేదించింది. ముద్రణ, ప్రసార, డిజిటల్ మీడియాలు అన్నింటినీ ఒకే గొడుగు కిందకు చేర్చేందుకు కొత్తగా మీడియా కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ప్రస్తుతం డిజిటల్ వేదికలు ఐటీ చట్టం, 2021 కింద ఉన్నాయి. ప్రింట్ మీడియాను ప్రెస్ కౌన్సిల్ నియంత్రిస్తున్నది. టీవీ చానళ్లు కేబుల్ టీవీ నెట్‌వర్క్ చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటన్నింటినీ మీడియా కౌన్సిల్ ఏర్పాటు ద్వారా ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసింది.

# కశ్మీర్‌లో కొత్త చరిత్ర

## నెరవేరిన వందేళ్ల కల - మోదీ ఖాతాలో మరో మైలురాయి.!!

ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కశ్మీర్ శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. తాజాగా జమ్మూ కశ్మీర్ లో కట్రా నుంచి కశ్మీర్‌కు వందేభారత్ రైలుకు జెండా ఊపడం ద్వారా ప్రపంచంలోని అత్యంత ఎత్తైన వంతెన దేశ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. దీంతో శివాలిక్, పీర్ పంజాల్ పర్వత శ్రేణులను కలుపుతూ కశ్మీర్ లోయకు రైలు ప్రారంభమయ్యింది.


దీంతో పాటు కట్రా లో రూ. 46వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోడీ ఆవిష్కరించారు. కట్రా -శ్రీనగర్ మధ్య రైలుకు ఆయన జెండా ఊపారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా తీగలతో అనుసంధానించిన అంజీ కేబుల్ బ్రిడ్జిను కూడా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ప్రధాని జమ్మూకశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఉధంపుర్‌లోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దిగిన మోదీ.. వంతెన ప్రారంభానికి ముందు దానిని పరిశీలించారు. అలాగే జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మాట్లాడారు. ఉగ్రదాడి నేపథ్యంలో భారీ స్థాయిలో భద్రతా బలగాలను మోహరించారు. జమ్ముకశ్మీర్‌ను భారతదేశ రైల్వే నెట్‌వర్క్‌తో లింక్ చేయడం అనేది శతాబ్దం కిందటి కల. బ్రిటీష్ కాలంలో పునాదిరాళ్లు పడినా అది పట్టాలు ఎక్కలేదు. ఇప్పుడు నరేంద్ర మోడీ సర్కార్ హయాంలో వందేళ్ల కల నిజం అయింది. దీంతో చీనాబ్ వంతెన ద్వారా భారత రైల్వే నెట్‌వర్క్‌తో జమ్ముకశ్మీర్? అనుసంధానం అయింది. మరికొద్ది రోజుల్లో కాత్రా- శ్రీనగర్ వందే భారత్ రైలు మొదలవ్వనుండగా, భారత్‌కు ఎంతో కీలకమైన చీనాబ్ వంతెనను కేంద్రం జాతికి అంకితమిచ్చింది. జమ్మూ-శ్రీనగర్ రైలు లింక్ ప్రాజెక్టుకు తొలిసారిగా 1892 మార్చి 1న మహారాజా ప్రతాప్ సింగ్ పునాదిరాయి వేశారు. ఆ తర్వాత 1898లో మహారాజా రణ్‌బీర్ సింగ్ మరోసారి పునాదిరాయి వేశారు. పంజాబ్‌ను శ్రీనగర్, కశ్మీర్ లోయతో అనుసంధానించడానికి నాలుగు మార్గాలను అప్పట్లో ఎంపిక చేశారు. జమ్ము- బనిహాల్ మార్గం, జీలం లోయ - పూంచ్ మార్గం, రావల్పిండి - జీలం లోయ మీదుగా పంజార్ మార్గం, ఎగువ జీలం లోయలోని కలకో సెరాయ్ నుంచి హజారా మీదుగా అబోటాబాద్ మార్గంలను ఆనాడు ప్రతిపాదించారు. మీటర్, బ్రాడ్ గేజ్ ట్రాక్‌ల నిర్మాణానికి ఆనాడు సర్వేలు చేశారు. అయితే ఆ ప్రణాళికలన్నీ కార్యరూపు దాల్చలేదు. 1905లో అప్పటి బ్రిటీష్ పాలకులు కూడా ఈ ప్రాజెక్టు ప్రతిపాదనను పరిశీలించారు.




రియాసీ మీదుగా జమ్ము- శ్రీనగర్ మధ్య రైల్వే లైన్ నిర్మాణానికి ఆనాడు మహారాజా ప్రతాప్ సింగ్ అంగీకారం తెలిపారు. పీర్ పంజాల్ పర్వతశ్రేణిని దాటేందుకు నారో గేజ్ ట్రాక్‌ను నిర్మించాలని భావించారు. ఈ ప్రతిపాదనలు కూడా అటకెక్కాయి. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చాక కూడా చాలా సార్లు ఈ రైల్వే ప్రాజెక్టులపై చర్చ జరిగింది.కాగా 1981లో జమ్ము- ఉధంపుర్ రైల్వే లింక్ ప్రాజెక్టుకు కేంద్ర సర్కారు ఆమోదం తెలిపింది. 1994-95లో ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా మధ్య తుది రైలు లింక్ ప్రాజెక్టును మంజూరు చేశారు.

2002 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఈ రైల్వే లైన్‌ను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. ఇప్పుడు ఆ ప్రాజెక్ట్ పూర్తైంది. కాత్రా - శ్రీనగర్ వందే భారత్ రైలును ఈ ఏడాది ఏప్రిల్ 19నే ప్రారంభించాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఆ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రదాడి తర్వాత కొన్ని వారాల పాటు భారత్, పాక్ మధ్య తీవ్రస్థాయిలో సైనిక ఘర్షణ జరిగింది. ఉధంపుర్- శ్రీనగర్- బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్టులో భాగంగా కాత్రా - శ్రీనగర్ రైల్వే లైన్‌ను నిర్మించారు. తొలి దశలో కాత్రా - బారాముల్లా మధ్య రైళ్లు నడుస్తాయి. జమ్ము తావి రైల్వే స్టేషన్ విస్తరణ పనులు పూర్తయ్యాక రైలు సర్వీసులు జమ్ముకు కూడా అనుసంధానం అవుతాయి.

దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు కాత్రాలో దిగి కశ్మీర్‌కు మరో రైలును ఎక్కాల్సి ఉంటుంది. అదే విధంగా కశ్మీర్ నుంచి తిరిగి వచ్చేటప్పుడు, ప్రయాణికులు కాత్రా నుంచి తమ తదుపరి ప్రయాణానికి మరొక రైలును ఎక్కాలి. కాత్రా- శ్రీనగర్ వందేభారత్ వల్ల ఏటా అమర్‌నాథ్ యాత్ర సీజన్‌లో యాత్రికులకు ప్రయాణంలో ఎంతో సౌకర్యం కలుగనుంది.




చర్ల: చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్‌జిల్లాలో నేషనల్ పార్క్ సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భీకర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి.

ఈ ఎదురుకాల్పుల్లో మావోయిస్టు నేత, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు ఆదెల్లు అలియాస్ భాస్కర్ మృతి చెందారు. అతడి స్వస్థలం తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచరా. భాస్కర్‌పై రూ. 25లక్షల రివార్డు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఘటనాస్థలిలో ఏకే-47ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి.

## మావోయిస్ట్ నాయకులను కోర్టు లో హాజరు పరిచండి

చురకలు విలేఖరి హైదరాబాద్, జూన్, 06 : చత్తీస్గఢ్ పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్ట్ నాయకులు బండి ప్రకాష్,ఎస్ జడ్ సి నాయకుడు పాపారావు, నేషనల్ పార్క్ కార్యదర్శి దిలీప్ ,మద్దెడు ఏరియా కార్యదర్శి సీటు, రామన్న డిసి మెంబర్, మున్నా, సునీత, మహేష్ లతో పాటు పది మంది మావోయిస్ట్ నాయకుల కు పోలీసులు ప్రాణ హాని తలపెట్టకుండా వెంటనే కోర్ట్ లో హాజరు పరచాలని పౌర హక్కుల సంఘం తెలంగాణ ఒక ప్రకటన లో కోరింది. ఛత్తీస్గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవి ప్రాంతంలోని ఒక గ్రామంలో నిన్న మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ మెంబర్ సుధాకర్,తెలంగాణ రాష్ట్ర కమిటీ మెంబెర్ మైలారపు ఆడేళ్ళు ఏ భాస్కర్, బండి ప్రకాష్,ఎస్ జడ్ సి నాయకుడు పాపారావు, నేషనల్ పార్క్ కార్యదర్శి దిలీప్ ,మద్దెడు ఏరియా కార్యదర్శి సీతు, రామన్న డిసి మెంబర్, మున్నా, సునీత, మహేష్ లతో పాటు పది మంది మావోయిస్ట్ నాయకుల ను పోలీసులు ప్రాణాలతో పట్టు కొన్నారు. నిన్న సుధాకర్ ను ఎన్కౌంటర్ పేరున హత్య చేశారని, అలాగే ఈరోజు సాయంత్రం భాస్కర్ ను కూడా ఎన్కౌంటర్ పేర్న హత్య చేశారని,. ఇంకా వారి అదుపులోని బండి ప్రకాష్, మిగతా మావోయిస్టు నాయకులను ఎన్కౌంటర్ పేరున హత్య చేసే ప్రమాదముందని, వారికి ఎలాంటి హాని తల పెట్టకుండా వెంటనే కోర్టులో హాజరు పరచాలని తెలంగాణ పౌరహక్కుల సంఘం నాయకులు గడ్డం లక్ష్మన్,నారాయణ రావు డిమాండ్ చేశారు. . ప్రాణాలతో దొరికిన దొరికిన మావోయిస్టు నాయకులను ఎన్కౌంటర్ పేరా హతమార్చడం రాజ్యాంగ విరుద్ధం చట్ట వ్యతిరేకం అని,దేశవ్యాప్తంగా ప్రజాస్వామికవాదులు, ,ప్రతిపక్ష పార్టీలు దీన్ని ముక్త కంఠం తో ఖండించాలని కోరారు. మావోయిస్ట్ పార్టీ ప్రకటించినట్లు గా కేంద్ర ప్రభుత్వం కూడా కాల్పుల విరమణ ప్రకటించి,మావోయిస్ట్ పార్టీ తో శాంతి చర్చలు జరపాలని పౌర హక్కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు.




## అసంతృప్తులను తృప్తి పరిచేందుకు...

# దిద్దుబాటు చర్యలు!

## సీఎం రేవంత్ రెడ్డితో మీనాక్షి నటరాజన్ కీలక భేటీ

హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో రాష్ట్ర కాంగ్రెస్ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో వారు సమావేశమయ్యారు. గత పది రోజులుగా పార్టీ నేతలతో మీనాక్షి వరుస సమీక్షలు నిర్వహించారు. పార్టీ నేతల అభిప్రాయాలను సీఎం రేవంత్ రెడ్డితో మీనాక్షి నటరాజన్ చర్చించారు. పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి.. అలాగే అసెంబ్లీకి సంబంధించి నేతలతో ఉమ్మడి జిల్లాలకు కొంతమంది అబ్జర్వర్స్‌ను నియమించారు. వారందరితో వరుసగా పది రోజులపాటు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ విషయాలన్నీ రేవంత్ రెడ్డికి మీనాక్షి వివరించారు. అసంతృప్తితో ఉన్న కొందరు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులను తృప్తి పరిచే విధంగా చర్యలు చేపట్టే దిశగా వారీ చర్చలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలియవచ్చింది. రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీకి అన్ని విధాలుగా అనుకూలంగా ఉండే పరిస్థితులను తీసుకు వచ్చే దిశగా చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

**సమస్యలు చెక్ పెట్టే దిశగా చర్యాలు..**ఇంకా మీనాక్షి నటరాజన్ సమీక్షల్లో చాలా మంది నేతలు జిల్లాలు, నియోజకవర్గాల్లో ఒక నేతపై మరొక నేత ఫిర్యాదులు చేసుకున్నారు. దాంతో పాటు ఆధిపత్యపోరుకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి జిల్లాలు, నియోజకవర్గాల్లో నేతలు సోషల్ మీడియాలో చాలా వీక్‌గా ఉన్నారని, చాలా మందికి సోషల్ మీడియాపై అవగాహన లేదని, ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సంబంధించి వివరాలు తెలియవని, వాటిపై వారికి అవగాహన లేకపోవవడంతో జనాలకు వివరించలేకపోతున్నారని మీనాక్షికి ఫిర్యాదులు అందాయి.

అన్ని విషయాలను ఆమె సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. ఈ సమస్యలన్నింటికి పరిష్కార మార్గాలు చూపవలసిందిగా ఆమె సీఎంను కోరారు. అలాగే కొత్తగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నేతల వల్ల పాత నేతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని దీనికి చెక్ పెట్టాలని మీనాక్షి నటరాజన్ భావిస్తున్నారు. వీటన్నింటికి సంబంధించిన విషయాలను సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

**సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం..** కాగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతినెలా రెండుసార్లు కేబినెట్ సమావేశాలు నిర్వహించనుంది. 15 రోజులకోసారి మంత్రివర్గ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. విధానపరమైన నిర్ణయాల విషయంలో ఆలస్యం లేకుండా వేగం పెంచాలని.. అందుకే రెండు మూడు నెలలకోసారి కాకుండా క్షేత్రస్థాయిలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై క్రమం తప్పకుండా కేబినేట్?లో సమీక్ష చేయాలని నిర్ణయించారు. మంత్రులతో ఎప్పటికప్పుడు చర్చించేందుకు వీలుగా రెండు వారాలకోసారి మంత్రి వర్గ సమావేశం ఉండేలా ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి నెలలో మొదటి, మూడవ శనివారం రోజున మంత్రివర్గ సమావేశం నిర్వహించేందుకు ఆలోచన చేస్తున్నారు. కాగా ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటి వరకు 17 సార్లు కేబినేట్ భేటీలు జరిగాయి.




యాదాద్రి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి ఇవాళ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆలేరు నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం తిరుమలాపూర్ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న రేవంత్ కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు తెలియచెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మీద రేవంత్ విమర్శలు, సెటైర్లు సంధించారు. సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన అంశాల విషయానికొస్తే.. 'తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. యాదాద్రి పేరుని యాదగిరిగుట్టగా మార్చాం. తిరుమల మాదిరిగా యాదగిరిగుట్ట అభివృద్ధి. టీటీడీ మాదిరిగా వైటీడీ ఏర్పాటు చేశాం. 60 కిలోల బంగారంతో ఆలయ గోపుర నిర్మాణం. కొండపై భక్తులు నిద్రించేలా, ఆటోలు నడిచేలా చేశాం. త్వరలో యాదగిరిగుట్ట ఆలయ కమిటీ ఏర్పాటు. స్థానిక విద్యాసంస్థలను వర్సిటీ స్థాయికి తీసుకెళ్తాం.' అని సీఎం చెప్పారు. గంధమల్ల ప్రాజెక్టును గతంలో ఎందుకు పూర్తిచేయలేదని ఈ సందర్భంగా సీఎం రేవంత్, గత బీఆర్ఎస్ సర్కారుని నిలదీశారు. ఇంకా సభలో సీఎం ఏం మాట్లాడారంటే.. 'నల్లగొండ రైతుల కష్టాలు తీర్చుతాం. కమీషన్ల కోసమే గత ప్రభుత్వం కాళేశ్వరం కట్టింది. మూసీ ప్రక్షాళన చేసి చూపిస్తాం. గోదావరి జలాలతో మూసీ నదిని నింపుతాం. పేదల ఇళ్లు కూలగొడుతున్నామంటూ విష ప్రచారం చేశారు. మూసీ నది ప్రక్షాళనను అడ్డుకుంటున్నారు. మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం. సబర్మతి, గంగ నదులు ప్రక్షాళన చేస్తున్నప్పుడు.. మూసీ ప్రక్షాళన ఎందుకు చేయకూడదు?. మూసీ ప్రాంతంలో ప్రజల కష్టాలు ప్రతిపక్షాలకు కనిపించడం లేదా?. నల్గొండ జిల్లా రైతులు బాగుపడకూడదనే BRS కుట్ర. SLBCని గత BRS ప్రభుత్వం పట్టించుకోలేదు'. అని సీఎం రేవంత్ అన్నారు. అటు ప్రతిపక్షపార్టీ BRS పైన సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. అది బీఆర్ఎస్ కాదు.. అది DRS (దెయ్యాల రాజ్య సమితి)పార్టీ అంటూ రేవంత్ విమర్శలు చేశారు. 'BRSలో దెయ్యాలు ఉన్నాయని కవితే అన్నారు. ఇంటి ఆడబిడ్డే దెయ్యాలు ఉన్నాయి అంటే నోరు విప్పని పరిస్థితి..కొరివి దెయ్యాలను తెలంగాణ పొలిమేర దాటేవరకు తరిమికొట్టాలి.. పదేళ్లపాటు తెలంగాణను దోచుకుతిన్నారు. బంగారు తెలంగాణ ముసుగులో బొందలగడ్డ చేశారు. తెలంగాణను బొందలగడ్డ చేసిన ప్రతి వెధవ మాట్లాడుతున్నాడు. తెలంగాణను రూ.8 లక్షల కోట్ల అప్పుల ఊబిలో పడేశారు. పదేళ్లు దోచుకుతిన్న మీరా.. నన్ను ప్రశ్నించేది?. యాదగిరిగుట్టలో అపచారం వల్లే గత ప్రభుత్వం మూల్యం చెల్లించుకుంది. గతంలో చేసిన పాపాల వల్లే కిందపడి మక్కెలు ఇరగ్గొట్టుకున్నారు. వాసాలమర్రిని ఆదర్శ గ్రామం చేస్తామని చెప్పి ఇళ్లు కూల్చేశారు. ఎర్రవల్లికి రోడ్డు వేసుకునేందుకే వాసాలమర్రిని కూల్చేశారు' అని రేవంత్ విపక్ష బీఆర్ఎస్‌పై ధ్వజమెత్తారు.




ఆయుర్వేద వైద్య విద్యనభ్యసిస్తూ మావోయిజం పట్ల ఆకర్షితుడైన తెంటు లక్ష్మీనరసింహచలం అలియాస్ సుధాకర్ అడవి బాట పట్టారు. సుదీర్ఘ కాలంగా సాయుధ పోరాటంలో పాల్గొన్న ఆయన.. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు స్థాయికి ఎదిగారు. 40 ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉన్న ఆయన.. 2004లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చలకు హాజరయ్యారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్‌జిల్లాలో నేషనల్ పార్క్ సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భీకర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో మావోయిస్టు నేత, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు ఆదెల్లు అలియాస్ భాస్కర్ మృతి చెందారు. అతడి స్వస్థలం తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచరా. భాస్కర్‌పై రూ. 25లక్షల రివార్డు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఘటనాస్థలిలో ఏకే-47ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. డీఆర్జీ, ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై నెలకు రెండు సార్లు క్యాబినెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. 15 రోజులకోసారి భేటీ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. విధాన నిర్ణయాల్లో జాప్యాన్ని నివారించేందుకు ఈమేరకు చర్యలు తీసుకున్నారు. ప్రతి నెల మొదటి, మూడో శనివారం క్యాబినెట్ భేటీ జరగనుంది.




## నా కణతపై తుపాకీ పెట్టినా నిజమే చెప్తా.. కాళేశ్వరం సమాచారమంతా వాళ్లిద్దరి వద్దే: ఈటల

హైదరాబాద్: కాళేశ్వరం కమిషన్ ఎదుట భాజపా ఎంపీ ఈటల రాజేందర్ విచారణ ముగిసింది. భారాస హయాంలో ఆర్థిక మంత్రిగా ఈటల పనిచేసిన నేపథ్యంలో ఆయన్ను కమిషన్ విచారించింది. అనంతరం ఈటల మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు సమాచారమంతా కేసీఆర్, హరీశ్‌రావు వద్దే ఉందన్నారు. ఇందులో ఆర్థిక శాఖ పాత్ర పెద్దగా లేదని చెప్పారు. ఆ శాఖకు అన్ని విషయాలూ తెలియవని పేర్కొన్నారు. "కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో నా పాత్రేమీ లేదు. ప్రాజెక్టు రీ డిజైనింగ్ కోసం క్యాబినెట్ సబ్ కమిటీని కేసీఆర్ ఏర్పాటు చేశారు. దీనికి అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ఛైర్మన్‌గా ఉన్నారు. నీటి లభ్యత అంశాన్ని దృష్టిలో పెట్టుకొని మేడిగడ్డ వద్ద ఆనకట్ట నిర్మాణం చేపట్టారు. ఆనకట్టల నిర్మాణం సాంకేతిక నిపుణులకు సంబంధించిన అంశం. ఆ నిర్మాణంపై రాజకీయ నాయకులకు ఏం తెలియదు. రూ.63 వేల కోట్లతో మొదట కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రతిపాదన చేశారు. తర్వాత అనేక కారణాలతో ప్రాజెక్టు వ్యయం రూ.82 వేల కోట్లకు పెరిగింది. ఇవాళ కమిషన్ ఆర్థికపరమైన అంశాలపై ప్రశ్నలు అడిగింది. కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలపై ఆర్థిక శాఖ ప్రమేయం ఉందా అని అడిగారు. దీనిపై ఆర్థిక శాఖకు ఏమాత్రం సంబంధం లేదు. ఇది పూర్తిగా ఇరిగేషన్ శాఖకు సంబంధించినది. నా కణతపై తుపాకీ పెట్టినా సరే.. నిజమే మాట్లాడతా. తప్పుఒప్పులు ఎవరివో తెలంగాణ ప్రజలు తేలుస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రిపోర్టులు బయటపెట్టాలి. కాళేశ్వరం అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దు. ప్రాజెక్టు నష్టాలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి.. కఠినంగా శిక్షించాలి. ఈ ప్రాజెక్టు తన మానస పుత్రిక అని కేసీఆర్ వందల సార్లు చెప్పారు. ఏ పార్టీలో ఉన్నా, ఏ పదవిలో ఉన్నా నైతిక విలువలు పాటించా" అని ఈటల రాజేందర్ అన్నారు.

**కమిషన్ ఎదుట ఈటల తెలిపిన అంశాలివే..!** క్యాబినెట్ నిర్ణయం మేరకే ఆనకట్టల నిర్మాణం జరిగిందని ఆయన కాళేశ్వరం కమిషన్‌కు ఈటల చెప్పినట్లు సమాచారం. సాంకేతిక కమిటీ, క్యాబినెట్ కమిటీ సిఫార్సు మేరకు క్యాబినెట్ నిర్ణయం జరిగిందని చెప్పారు. సీడబ్ల్యూసీ, మహారాష్ట్ర అభ్యంతరాల దృష్ట్యా ప్రాజెక్టు లొకేషన్‌ను తమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చినట్లు చెప్పారు. నిధుల కొరత దృష్ట్యా కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పారిశ్రామిక, తాగునీటి వినియోగంపై డబ్బు వసూలు చేయాలని డీపీఆర్‌లో ఉందని చెప్పారు. బ్యారేజీల నిర్మాణంలో ఆర్థిక క్రమశిక్షణ లోపించిందా అని ఈటలను కమిషన్ ప్రశ్నించింది. నిర్మాణ అంశాలన్నీ నీటిపారుదల శాఖ కిందకే వస్తాయని ఈటల బదులిచ్చారు.

## తెలంగాణ నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తాం: మంత్రి ఉత్తమ్




హైదరాబాద్: బనకచర్లతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంతర్రాష్ట్ర జలవిధానాలకు, జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టు ఉందని ఆక్షేపించారు. ఈ ప్రాజెక్టను తెలంగాణ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరం తెలుపుతూ కేంద్రమంత్రులు సీఆర్‌పాటిల్, నిర్మలా సీతారామన్‌కు లేఖలు రాశామని చెప్పారు. "ఏపీ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని.. వస్తే అన్ని నిబంధనలు పరిశీలిస్తామని పాటిల్ చెప్పారు. చట్టం ప్రకారం ముందుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏపీ ఉల్లంఘనలను పూర్తిగా లేఖల్లో వివరించాం. చట్టవిరుద్ధంగా ఏపీకి కేంద్రం సహకరిస్తుందని అనుకోవట్లేదు. తెలంగాణకు అన్యాయం జరిగితే.. ఎంత వరకైనా పోరాడుతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తాం.. వెనక్కి తగ్గేదేలే. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలి. కృష్ణాలో అన్యాయం జరుగుతుంటే పదేళ్లు భారాస సహకరించింది. ఉమ్మడి ఏపీలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 724 టీఎంసీలు ఏపీకి వెళితే భారాస హయాంలో 1,254 టీఎంసీలు తరలించారు. కాళేశ్వరానికి వృథా ఖర్చు చేయకుంటే కృష్ణా ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యేవి. తుమ్మిడిహట్టి దగ్గర కాకుండా.. మేడిగడ్డ వద్ద కట్టడం వల్ల రూ.68వేల కోట్లు కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనపు ఖర్చు అయింది. ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకం చేసింది భారాస ప్రభుత్వం కాదా? కృష్ణా నీళ్లలో అప్పుడు మోసం చేసి ఇప్పుడు భారాస నేతలు నాటకాలు ఆడుతున్నారు"అని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు.

## తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే స్పందించరేం?: హరీశ్‌రావు

దుబ్బాక: తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే బనకచర్ల అంశంపై రాష్ట్ర భాజపా నేతలు ఎందుకు స్పందించడం లేదని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలు ఆ పార్టీకి పట్టవా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుబ్బాకలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నీతి ఆయోగ్ సమావేశంలో బనకచర్ల అంశంపై ప్రధాని మోదీని ఎందుకు ప్రశ్నించలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. అపెక్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని ఎందుకు కోరడం లేదో చెప్పాలన్నారు. "సుప్రీంకోర్టుకు వెళ్లయినా సరే బనకచర్లను ఆపుతాం.


ఎలాంటి అనుమతులు లేకున్నా ఏపీకి కేంద్రం నిధులిస్తోంది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖలు రాసి చేతులు దులిపేస్తున్నారు. శ్రీశైలం కుడి కాల్వ లైనింగ్ పనులు జరుగుతున్నా.. అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లమన్నా స్పందించడం లేదు. శ్రీశైలం కుడి కాల్వ లైనింగ్ పనులను వెంటనే నిలిపివేయించాలి. బనకచర్లపై రాష్ట్ర భాజపా నేతలు ఎందుకు నోరు మెదపడం లేదు? గోదావరి జలాలపై



తెలంగాణ శాశ్వతంగా హక్కు కోల్పోయే ప్రమాదముంది. శ్రీశైలం కుడి కాల్వ లైనింగ్ పనులు పూర్తయితే రోజుకు 90 వేల క్యూసెక్కుల నీటిని ఏపీకి తీసుకెళ్తారు. అదే జరిగితే హైదరాబాద్‌కు తాగునీరు కూడా దక్కదు. కేఆర్ఎంబీ కళ్లు మూసుకుని ఏపీకి దాసోహమైంది" అని హరీశ్‌రావు ఆరోపించారు.

## కాంగ్రెస్ నేత పిటిషన్.. కేటీఆర్‌కు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ, జూన్ 6: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ చేసిన రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసులో సుప్రీం నోటీసులిచ్చింది. కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ దాఖలు చేసిన పిటిషన్‌పై నేడు (శుక్రవారం) సుప్రీంలో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందంటూ కేటీఆర్ గతంలో ఆరోపణలు చేశారు. దీంతో కేటీఆర్ చేసిన ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ.. ఉట్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేత ఫిర్యాదుతో కేటీఆర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని గతంలోనే కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న హైకోర్టు.. కేటీఆర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టి



వేస్తూ తీర్పు ఇచ్చింది. అయితే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుగుణ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈరోజు విచారణ జరుగగా.. పిటిషన్‌పై సమాధానం చెప్పాలంటూ కేటీఆర్‌కు సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ



హైదరాబాద్: గుండెపోటుతో గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పరామర్శించారు. మధ్యాహ్నం ఆసుపత్రికి చేరుకున్న మంత్రి.. మాగంటి గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితి నిన్నటి కంటే మెరుగ్గా ఉందని పేర్కొన్నారు. ఆయన తనకు సన్నిహితుడని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.




## ఈ ఏడాది ఖైరతాబాద్‌లో శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి.. ఘనంగా తొలిపూజ

హైదరాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి ఈ ఏడాది శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఖైరతాబాద్‌లో జరిగే మహాగణపతి 71వ వేడుకలకు శుక్రవారం నిర్జల ఏకాదశి సందర్భంగా కర్ర పూజ (తొలిపూజ) జరిగింది. ఈ సందర్భంగా ఈ ఏడాది రూపుదిద్దుకోనున్న విగ్రహ నమూనా చిత్రాన్ని విడుదల చేశారు. ఈసారి 69 అడుగుల మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దానం నాగేందర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.






ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫైనల్లో నెగ్గి- కలల కప్‌ను సొంతం చేసుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(%=జడీ%) కోసం ఏర్పాటుచేసిన విజయోత్సవ కార్యక్రమం తీవ్ర విషాదాన్ని నింపింది. భద్రతా కారణాలతో పరేడ్ వద్దని ఆర్సీబీ యాజమాన్యానికి, ప్రభుత్వానికి పోలీసులు చెప్పినట్లు సమాచారం. ఒకవేళ క్రీడాకారులను సత్కరించాలనుకుంటే ఆదివారం ఓ చోట ఆ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. "బుధవారం విజయోత్సవాలు వద్దని ఆర్సీబీ, ప్రభుత్వానికి మంగళవారం రాత్రి నుంచే సూచించాం. ప్రస్తుతం అభిమానులు ఉద్వేగంతో ఉన్నారని, అదికాస్త చల్లబడిన తర్వాత ఆదివారం కార్యక్రమం పెట్టుకోవాలని సిఫారసు చేశాం. ఎటువంటి ర్యాలీ వద్దని ఒక ప్రాంతానికే పరిమితమై వేడుక నిర్వహించాలని చెప్పాం" అని ఓ పోలీసు అధికారిని ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనం పేర్కొంది. కానీ ఆటగాళ్లు ముఖ్యంగా విదేశీ క్రికెటర్లు అప్పటివరకు ఉండరని నిర్వాహకులు వెల్లడించినట్లు ఆ అధికారి తెలిపారు.

**ఆర్సీబీ, క్రికెట్ సంఘం కోరిక మేరకే: ప్రభుత్వం...** ఆర్సీబీ, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ ఈ విజయోత్సవాలు నిర్వహించాలని కోరాయని, దానికి తగ్గట్టుగానే సన్మాన కార్యక్రమం నిర్వహించామని రాష్ట్ర హోంమంత్రి జి.పరమేశ్వర వెల్లడించారు. ఈ ఘటనపై మెజిస్ట్రీరియల్ విచారణ ఉంటుందని ఇప్పటికే ముఖ్యమంత్రి చెప్పారన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పందించిన సంగతి తెలిసిందే. ఈ సన్మాన కార్యక్రమాన్ని ఆర్సీబీ, క్రికెట్ సంఘం నిర్వహించాయని చెప్పారు. బెంగళూరు జట్టు కావడంతో తాము కూడా వేడుకలో భాగం కావాలని భావించామన్నారు. వేడుకల కోసం వారే జట్టును బెంగళూరుకు తీసుకువచ్చారన్నారు. విజయోత్సవాలకు ఇంత పెద్దసంఖ్యలో అభిమానులు వస్తారని తాము ఊహించలేదన్నారు. స్టేడియంలో కూర్చొనేంతమంది లేదా ఇంకాస్త ఎక్కువమంది మాత్రమే వస్తారని అనుకున్నామని తెలిపారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం ప్రకటించారు. అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ గెలిచిన ఆర్సీబీ జట్టు బుధవారం మధ్యాహ్నం బెంగళూరు విమానాశ్రయంలో దిగగా.. అక్కడ ఆటగాళ్లకు ఘన స్వాగతం లభించింది. కర్ణాటక ప్రభుత్వం విధానసౌధ ప్రాంగణంలో క్రికెటర్లను సన్మానించాలని నిర్ణయించడంతో జట్టు సభ్యులు బస్సుల్లో సాయంత్రం 4.30 గంటలకు విధానసౌధకు అడుగుపెట్టారు. ఆ తర్వాత చిన్నస్వామి స్టేడియంలో సాయంత్రం ఆరు గంటలకు జట్టును సన్మానించడానికి కర్ణాటక క్రికెట్ సమాఖ్య ఏర్పాటుచేసింది. స్టేడియం సామర్థ్యం 35 వేల మంది మాత్రమే.

కానీ మూడు లక్షల మందికి పైగా అభిమానులు తోసుకొచ్చారు. అదే సమయంలో వర్షం కురవడంతో సాయంత్రం 4 గంటల సమయంలో వెనక గేటు వద్ద తొక్కిసలాట మొదలై పలువురు మృత్యువాత పడ్డారు. ఇలాంటి గందరగోళ పరిస్థితుల్లోనే సాయంత్రం 6.10 గంటల సమయంలో క్రికెట్ జట్టు స్టేడియంలోకి ప్రవేశించగా, 6.30 గంటలకల్లా విజయోత్సవ కార్యక్రమం ముగిసింది.




## ఇది పేదల ప్రభుత్వం.. ఆత్మనిర్భర్‌కు కట్టుబడ్డాం: ప్రధాని మోదీ

పేద ప్రజల సంక్షేమానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించారు. ఎన్‌డీఏ దశాబ్ద కాలంగా సాగిన పాలనలో ప్రజలను పేదరికం నుంచి బయటపడేయటానికి, వారు స్వయంసమృద్ధి సాధించేందుకు పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొన్నట్లు ఆయన అభివర్ణించారు. ప్రతిఒక్కరూ గౌరవంగా జీవించడానికి వీలుగా.. సమ్మిళిత, స్వయంసమృద్ధి భారత్‌ను తయారుచేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తాము ప్రవేశపెట్టిన అన్ని పథకాలు పేదల జీవితాలను మార్చాయన్నారు. "పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, జన్‌ధన్, ఆయుష్మాన్ భారత్ వంటివి ప్రజలకు ఇళ్లు, స్వచ్ఛమైన ఇంధనం, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించాయి. 25 కోట్ల మందికి పైగా పేదరికం నుంచి బయట పడ్డారు" అని పేర్కొన్నారు. మోదీ సర్కార్ 3.0 ఏర్పడి జూన్ 9 నాటికి ఏడాది పూర్తికానుంది. దీంతో ఆయన 11 ఏళ్లపాటు నిరంతరాయంగా ప్రధాని పదవిలో కొనసాగినట్లవుతుంది. ఈసందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకొని.. వాటిని సాధించేందుకు ఉత్సాహంగా పనిచేయాలని సహచరులకు సూచించారు. ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.




సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఐపీఎల్ కప్పును ముద్దాడిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సాహం కొన్ని గంటలకే ఆవిరైంది. తమ ఆరాధ్య క్రికెటర్లను చూసేందుకు అభిమానులు పోటెత్తడంతో జరిగిన తొక్కిసలాట పెను విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటన వెనక పలు కారణాలు కన్పిస్తున్నాయి. ఉచిత పాస్‌లంటూ వదంతులు.. స్టేడియం వద్ద గేట్ల మూసివేతతో నెలకొన్న గందరగోళం.. అధిక రద్దీతో తోపులాట వంటి వాటివల్ల ఈ విషాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

**ఫ్రీ టికెట్ల ప్రచారంతో..** వాస్తవానికి చిన్నస్వామి స్టేడియం సామర్థ్యం 35వేల మంది మాత్రమే. కానీ, నిన్న సాయంత్రం అక్కడికి దాదాపు మూడు లక్షల మంది అభిమానులు చేరుకున్నారు. ఈ స్టేడియంలో మొత్తం 21 స్టాండ్‌లు, 13 గేట్లు ఉన్నాయి. ఇందులో 9, 10వ నంబరు గేట్లను రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులకు రిజర్వ్ చేశారు. 5, 6, 7 గేట్ల నుంచి అభిమానులకు ప్రవేశం కల్పించారు. ఇందులో 7వ నంబర్ గేట్ నుంచి చూస్తే చిన్నస్వామి స్టేడియం ప్రధాన ప్రవేశం నుంచి లోపలికి వచ్చే వ్యూ కన్పిస్తుంది. మెయిన్ ఎంట్రెన్స్ నుంచే ఆర్సీబీ జట్టు మైదానంలోకి ప్రవేశిస్తుంది కాబట్టి ఏడో నంబరు గేట్ వద్దకు అభిమానులు పోటెత్తారు.

**క్రికెట్ విజయోత్సవాల్లో పెను విషాదం...** పాస్‌లు ఉన్నవారు మాత్రమే స్టేడియం లోపలికి వెళ్లేందుకు అనుమతి ఉంది. కానీ, చాలామంది పాస్‌లు లేకుండానే అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో ఏడో నంబరు గేట్ వద్ద ఉచిత టికెట్లు పంచుతున్నారన్న ప్రచారం మొదలైంది. దీంతో వాటిని తీసుకునేందుకు అభిమానులు పరుగులు తీశారు. టికెట్ల కోసం ఒకరినొకరు తోసుకోవడంతో తొక్కిసలాట జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ గేట్ వద్దే అత్యధిక నష్టం సంభవించింది.

**గేట్లు విరిగి..** స్టేడియం వద్ద రద్దీని నియంత్రించేందుకు 5వేల మంది పోలీసులను మోహరించారు. కానీ, అంచనాలకు మించి అభిమానులు రావడంతో వారిని నియంత్రించడం కష్టతరమైంది. గేట్లు కూడా చిన్నవిగా ఉండటంతో వారు లోపలికి వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. "స్టేడియం గేట్లు చిన్నగా ఉన్నాయి. అభిమానులు కిక్కిరిసిపోవడంతో కొన్నిచోట్ల గేట్లు విరిగిపోయాయి. రద్దీ ఎక్కువగా ఉండటం వల్లే ఈ ఘటన సంభవించిందని అనుకుంటున్నాం" సీఎం సిద్ధరామయ్య వెల్లడించారు. అయితే, పాస్‌లు ఉన్నప్పటికీ.. తమను లోపలికి రానియ్యకుండా గేట్లు మూసివేశారంటూ కొంతమంది అభిమానులు ఆరోపిస్తున్నారు.

**ప్రకటనలో గందరగోళం..** బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు విధానసౌధ నుంచి చిన్నస్వామి స్టేడియం వరకు పరేడ్ ఉంటుందని ఆర్సీబీ జట్టు నిన్న ఉదయం ప్రకటించింది. అయితే, అభిమానుల రాకను ముందే అంచనా వేసిన పోలీసులు ర్యాలీకి అనుమతినివ్వలేదు. ఆర్సీబీ జట్టు పరేడ్ ఉండదని, కేవలం స్టేడియంలో సన్మాన కార్యక్రమానికి మాత్రమే అనుమతి ఉందని బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు ఉదయం 11.56 గంటలకు ప్రకటించారు.

కానీ, మధ్యాహ్నం ఆర్సీబీ మేనేజ్‌మెంట్ మరో ప్రకటన చేసింది. పరేడ్ నిర్వహిస్తామని, అభిమానులు మార్గదర్శకాలు పాటించాలని కోరింది. ఈ ప్రకటనతో అభిమానుల్లో గందరగోళం నెలకొంది.

పరేడ్ ఉంటుందో, లేదో తెలియక ఎక్కువమంది నేరుగా మైదానం లోపలికి వెళ్లేందుకే ఉత్సాహం చూపించారు. కొంతమంది టికెట్లు లేకుండానే గేట్లు దూకి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని అడ్డుకుని పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

# నటనకు జీవితాన్ని అంకితం చేసిన భాను ప్రకాష్

## - జూన్ 7...భాను ప్రకాష్ వర్ధంతి

బాల్యం నుండే నటనపై ఆసక్తి కలిగి, చివరి శ్వాస వరకు నాటకం కోసమే జీవించిన కృషీవలుడు భానుప్రకాష్. నటనలో, దర్శకత్వం వహించడంలో, నటులను తీర్చి దిద్దడంలో భాను ప్రకాశ్ అందెవేసిన చేయిగా పేరొందాడు. భాను ప్రకాష్ (బొల్లంపల్లి భాను ప్రకాష్ రావు) (ఏప్రిల్ 21, 1939 – జూన్ 7, 2009) తెలంగాణ రాష్ట్ర ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు. భాను ప్రకాష్ 1939, ఏప్రిల్ 21న వెంకటహరి, అండాలమ్మ దంపతులకు నల్లగొండలో జన్మించాడు. హెచ్.ఎ.ఎల్.లో ఉద్యోగం చేసేవాడు. ఆయన మేనమామ ధరణి శ్రీనివాసరావు నాటక రచయిత అవ్వడంవల్ల భాను ప్రకాష్ కేశవ్ మెమోరియల్ స్కూల్లో చదువుతున్న సమయంలో 11 ఏళ్ల వయస్సులోనే తొలిసారిగా వార్షికోత్సవాల సందర్భంగా స్టేజీపై తార్‌మార్ నాటకంలో నటించాడు. ప్రిన్సిపాల్ మొమెంటోతో ప్రశంసించడంతో నటనపట్ల తనలోని ఆసక్తిని పెంచుకున్న భాను ప్రకాష్ తమ కాలనీలోని మిత్రులతో కలిసి నాటకాలు రూపొందించి వినాయకచవితి మండపాల్లో ప్రదర్శించేవాడు. హైదరాబాదులో ఎస్.కె. ఆంజనేయులుకు చెందిన నాటక సంస్థ నిర్వహించే 'విస్మృతి' నాట్యమండలి నాటకాలు, రిహార్సల్స్‌ని చూసి తాను కూడా నాటక దర్శకత్వం చేయాలనుకున్నాడు. ఇంటర్ కాలేజీస్థాయి నాటక పోటీల్లో సైఫాబాద్ సైన్స్ కళాశాల నుండి స్వీయ దర్శకత్వంలో 'డాక్టర్ యజ్ఞం' నాటికలో డా. యజ్ఞం పాత్రలో నటించాడు. ఆ పోటీలో బహుమతులు రావడంతో దర్శకుడిగా తొలి ప్రయత్నంలోనే విజయం సాధించాడు. ఆ తరువాత 'గాలివాన', 'గుడిగంటలు', 'గాలిపటం', 'శ్రీమాన్ శ్రీమతి' వంటి నాటకాలలో నటిస్తూ, దర్శకత్వం వహించాడు. 1964లో 'యాచకులు'లో భాను ప్రకాష్ నటనకు మంచి గుర్తింపు వచ్చింది. 'కళారాధన' సంస్థను స్థాపించి 'వలయం', ' గాలివాన', ' కెరటాలు' వంటి నాటకాలు ప్రదర్శించాడు. ఈ సంస్థను 'గ్రేట్ ఈస్ట్రన్ సర్కస్8 కంపెని' అని పిలిచేవారు. ఈ సంస్థ ద్వారా నటుడు నూతన్ ప్రసాద్ నాటకరంగానికి పరిచయ మయ్యాడు. 'చీకటి కోణాలు' నాటకంలో భాను ప్రకాష్ నటనను స్థానం నరసింహారావు అభినందించాడు. 'ఆకాశవాణి'లో కూడా ఆయన 'ఏ గ్రేడ్' ఆర్టిస్టుగా చాలా నాటకాల్లో పాల్గొన్నాడు. ఢిల్లీ, మద్రాస్, కలకత్తా, కాన్పూర్‌లలో నాటకాలను ప్రదర్శించాడు. 'చంద్రగుప్త', 'కన్యాశుల్కం', 'విశ్వశాంతి', 'సుడిగాలి', 'ఆపద్భాందవులు', 'న్యాయం', 'పత్తర్ కె ఆంసూ', 'తాజ్ కీ ఛాయామే', 'గాలివాన ', 'జీవన్నాటకం', 'ఒంటి కాలి పురుగు', 'గాలి గోపురం', 'బాపూ బాటలో' వంటి నాటకాలు మంచి పేరు తెచ్చాయి. 'ప్రతిధ్వనులు', 'ప్రతిబింబాలు', 'వాన వెలిసింది', 'గాలిపటం', 'కాలం వెనక్కు వెళ్లింది' వంటి నాటికల్లో తన నటన ద్వారాను మంచిపేరు పొందాడు. ప్రధానంగా హైదరాబాదు రాష్ట్రంలో సాంఘిక నాటకానికి నాంది పలికాడు. భాను ప్రకాష్ నాటకాన్ని చూసిన నిర్మాత దుక్కిపాటి మధు సూదనరావు 1964లో డాక్టర్ చక్రవర్తి సినిమాలో చిన్న పాత్రను ఇచ్చాడు. ఆ తర్వాత పూలరంగడులో ఎలాంటి టెస్టు లేకుండానే పూర్తి నిడివిగల విలనీ పాత్రను ఇచ్చాడు. డాక్టర్ చక్రవర్తి (1964), పూల రంగడు (1967), చదువుకున్న అమ్మాయిలు (1963),




బుద్ధిమంతుడు, ఆత్మీయులు (1969), అమాయకురాలు (1971), విచిత్ర బంధం (1972), భక్త తుకారాం (1973), అన్నదమ్ముల అనుబంధం (1975), కల్పన (1977), అన్నదమ్ముల సవాల్ (1978), ముద్దుల కొడుకు, సీతే రాముడైతే (1979), పారిజాతం, శుభోదయం, అగ్ని సంస్కారం (1980), నా గురుశిష్యులు (1981), పెళ్లీడు పిల్లలు (1982), యుగ కర్తలు(1987), పల్లె పిలిచింది, రాధాకృష్ణ, చిల్లర దేవుళ్లు, దయామయుడు, శంకర్‌దాదా జిందాబాద్ (చివరి సినిమా) తదితర చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించాడు. 50 ఏళ్లకు పైగా రంగస్థల, సినీ రంగాలకు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులు, పురస్కారాలు లభించాయి. 'సుడిగాలి', 'గాలివాన', 'కెరటాలు' నాటకాలకు ఉత్తమ దర్శకుడిగా వరుసగా మూడుసార్లు ఎంపికై 'రోలింగ్ షీల్డ్' అందుకున్నాడు. 1972లో మరో రెండు బంగారు పతకాలను, 1974లో 'బళ్లారి రాఘవ' అవార్డుతో వెండి కిరీటం పొందాడు.'యువ కళావాహిని' సంస్థ కె. వెంకటేశ్వరరావు అవార్డు, అవార్డు, తెలుగు విశ్వ విద్యాలయం ఉత్తమ నటుడి అవార్డు, 1992లో ఎ.ఆర్.కృష్ణ స్మారక పురస్కారం, 1998లో ఉగాది పురస్కారం, జూలూరు వీరేశలింగం అవార్డు, కిన్నెర ఉగాది పురస్కారం, నాటక కృషీవలుడు పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక నందమూరి తారక రామారావు రంగస్థల పురస్కారం (2017) ఆయనకు లభించాయి. చివరి శ్వాస వరకు నాటకం కోసమే జీవించిన భాను ప్రకాష్ 2009, జూన్ 7 న తన 70వ యేట తనువు చాలించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఇది కదా కావాల్సింది.. త్వరలోనే రూ.55వేలకు దిగిరానున్న బంగారం

గత కొన్నాళ్లుగా ఆకాశాన్నంటుతున్న బంగారం ధరలతో సతమతమవుతున్న సామాన్యులకు ఊరటనిచ్చే వార్త ఇది. త్వరలోనే పసిడి ధరలు భారీగా దిగిరానున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.55 వేల స్థాయికి పడిపోయే అవకాశం ఉందని మార్నింగ్ స్టార్ నిపుణుడు జాన్ మిల్స్ జోస్యం చెప్పారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు బంగారం ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ట్రంప్ టారిఫ్‌ల భయాలు, కేంద్ర బ్యాంకుల భారీ కొనుగోళ్లు పసిడికి డిమాండ్‌ను పెంచాయి. అయితే, ఈ పరిస్థితి



తాత్కాలికమని, దీర్ఘకాలంలో ధరలు తగ్గుతాయని మిల్స్ విశ్లేషించారు. ప్రస్తుతం ఔన్స్ బంగారం ధర $3,000 – $3,150 మధ్య ఉండగా, రాబోయే ఐదేళ్లలో ఇది 38% వరకు పతనమయ్యే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. ధరలు తగ్గడానికి ఆయన మూడు ప్రధాన కారణాలు వివరించారు. మొదటిది, అధిక ధరల కారణంగా బంగారం తవ్వకాలు (మైనింగ్) పెరగనున్నాయి. ఇది మార్కెట్‌లోకి సరఫరాను పెంచి ధరలను తగ్గిస్తుంది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ కూడా ఇదే విషయాన్ని ధృవీకరించింది. రెండోది, ప్రస్తుతం భారీగా బంగారం కొంటున్న కేంద్ర బ్యాంకులు, ఆర్థిక పరిస్థితులు కుదుటపడ్డాక అమ్మకాలు చేపట్టే అవకాశం ఉంది. అంతేకాకుండా, డిజిటల్ బంగారం, గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెరుగుతుండటంతో భౌతిక బంగారానికి డిమాండ్ తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక చివరిగా, బంగారం ధరల చారిత్రక ధోరణులను పరిశీలిస్తే ప్రస్తుత ధరలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయని మిల్స్ అభిప్రాయపడ్డారు. అయితే, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి ఇతర నిపుణులు మాత్రం రాబోయే రెండేళ్లలో బంగారం ధర ఔన్సుకు $3,500కు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. గోల్డ్‌మన్ శాక్స్ కూడా ఈ ఏడాది చివరి నాటికి $3,300కు చేరుకోవచ్చని అంచనా వేసింది. ఇలా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, జాన్ మిల్స్ అంచనా మాత్రం బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఆశాకిరణంలాంటిది.

# ప్రపంచంలోనే ఫస్ట్ ఎయిర్ లైన్స్ సంస్థ ఏదో తెలుసా ? అది ఏ దేశంలో ఉందంటే ?

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ప్రజలు తమ విలువైన సమయాన్ని ఆదా చేసుకోవడానికి విమాన ప్రయాణాన్ని ఎంచుకుంటున్నారు. ఎందుకంటే విమానంలో ప్రయాణించడం వల్ల ఎక్కడికైనా త్వరగా, వేగంగా, సులభంగా చేరుకోవచ్చు. మీరు కూడా చాలాసార్లు విమాన ప్రయాణం చేసి ఉంటారు. అయితే, ప్రపంచంలో మొట్టమొదటి ఎయిర్‌లైన్స్ ఎలా ప్రారంభమయ్యాయో ఎప్పుడైనా ఆలోచించారా? ప్రపంచంలో మొట్టమొదటి విమానయాన సంస్థ ఏమిటి, దానిని ఎలా ప్రారంభించారు అనే వివరాలను తెలుసుకుందాం. ప్రపంచంలో మొట్టమొదటి విమానయాన సంస్థ పేరు సెయింట్ పీటర్స్‌బర్గ్–టాంపా ఎయిర్‌బోట్ లైన్. ఈ ఎయిర్‌లైన్ జనవరి 1, 1914న ప్రారంభమైంది. ఈ ఎయిర్‌లైన్ సెయింట్



పీటర్స్‌బర్గ్ నుంచి టాంపాకు తన మొదటి విమానాన్ని నడిపింది. ఈ మొదటి విమానంలో సెయింట్ పీటర్స్‌బర్గ్ మేయర్ అబ్రహం సి. ముఖ్యంగా ప్రయాణించారు. ఆయన సుమారు 400 డాలర్లు బిడ్ వేసి టిక్కెట్‌ను వేలంలో గెలుచుకున్నారు. అయితే, ఈ ఎయిర్‌లైన్ కేవలం మూడు నుంచి నాలుగు నెలలు మాత్రమే నడిచింది. ఈ ఎయిర్‌లైన్ బెనోయిస్ట్ ఎయిర్‌బోట్ అనే విమానాన్ని ఉపయోగించింది. ఇది నీటిపై ఎగరడానికి, ల్యాండ్ అవ్వడానికి కూడా వీలుగా ఉండేది. సెయింట్ పీటర్స్‌బర్గ్–టాంపా ఎయిర్‌బోట్ లైన్‌ను పెర్సివల్ ఇలియట్ ఫాన్స్‌లర్, థామస్ బెనోయిస్ట్, ఆంథోనీ జానస్ కలిసి స్థాపించారు. సెయింట్ పీటర్స్‌బర్గ్–టాంపా ఎయిర్‌బోట్ లైన్ ప్రపంచంలోనే మొట్టమొదటి ఫిక్స్‌డ్–వింగ్ ఎయిర్‌లైన్, కానీ 1914లో ఈ ఎయిర్‌లైన్‌ను మూసివేశారు. ఈ ఎయిర్‌లైన్ సెయింట్ పీటర్స్‌బర్గ్, టాంపా బే తర్వాత సుమారు 37 కిలోమీటర్ల దూరం ఎగిరింది. సెయింట్ పీటర్స్‌బర్గ్ , టాంపా మధ్య ప్రయాణాన్ని వేగవంతం చేయడం, సులభతరం చేయడం సెయింట్ పీటర్స్‌బర్గ్–టాంపా ఎయిర్‌బోట్ లైన్ ముఖ్య ఉద్దేశం. ఈ ఎయిర్‌లైన్ రవాణా రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది. అంతేకాకుండా, ఈ ఎయిర్‌లైన్ గ్లోబల్ ఏవియేషన్ పరిశ్రమకు పునాది వేసింది.

చురకలు

## సంపాదకీయం

### వైసీపీలో మారాల్సింది ఎవరు.. మార్చేది ఎవరు ?

అవును వైసీపీ ఇపుడు విపక్షంలో ఉంది. ఎన్నడూ లేని సంక్షోభంలో ఉంది. కేవలం 11 సీట్లు మాత్రమే వైసీపీకి ఈ దఫా దక్కాయి అంటే దారుణమైన ఫలితమే కదా అని అంటున్నారు. అంతే కాదు అసెంబ్లీకి వైసీపీ కనీసం వెళ్ళలేని ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడ్డాయని అంటున్నారు. ప్రతిపక్ష హోదా లేకపోవడం వల్ల జగన్ ని పులివెందుల ఎమ్మెల్యే అని ప్రత్యర్థి పార్టీలు పొలిటికల్ ర్యాగింగ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ ఓటమి చెంది పది నెలలు పై దాటుతోంది. మరి పార్టీ పరమైన రిపేర్లు ఉన్నాయా దిద్దుబాట్లు చేసుకుంటున్నారా అన్న చర్చ అయితే ఉంది. జగన్ విషయానికి వస్తే ఆయన ఎక్కువగా బెంగళూరులోనే ఉంటున్నారు అని అంటున్నారు. పార్టీకి అందుబాటులో ఉండాల్సిన వేళ ఆయన ఈ విధంగా చేయడం పట్ల కూడా చర్చ సాగుతోంది. జగన్ మారాలి అని అంటున్న వారూ ఉన్నారు. అయితే ఎట్టకేలకు జగన్ లో కొంత మార్పు అయితే కనిపిస్తోంది అని అంటున్నారు. లోక్ బాడీ ఎన్నికలో అధికార కూటమిని ఎదిరించి ప్రాణాలు ఒడ్డి మరీ పార్టీని గెలిపించిన వారితో జగన్ భేటీ కావడమే ఈ మార్పు అని అంటున్నారు నిజానికి చూస్తే ఇటువంటి సమావేశాలు వైసీపీలో జరిగిన సందర్భాలు అయితే లేవు ఇవన్నీ టీడీపీ లాంటి పార్టీలలో జరుగుతాయి. వైసీపీలో క్యాడర్ లీడర్ ల మధ్య అనుసంధాన ప్రక్రియ కొంచెం కష్టంగానే ఉంటుంది అయితే ఇపుడిపుడే వైసీపీ అధినాయకత్వం వాస్తవాలను తెలుసుకుంటోంది అని అంటున్నారు. అందుకే పార్టీ కోసం కొమ్ము కాసిన వారిని జగన్ తన వద్దకు పిలిపించుకుని అభినందించడం జరుగుతోంది అని అంటున్నారు. అంతే కాదు ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడులో హత్యకు గురి అయిన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు కూడా తాను వస్తాను అని జగన్ చెప్పడం ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిలో ధైర్యం నింపడం వంటివి నిజంగా ఆహ్వానించతగిన పరిణామాలే అని అంటున్నారు. వైసీపీలో జగనే కీలకం. ఆయనతోనే పార్టీ ఉంది. ఆయన చుట్టూనే పార్టీ అల్లుకుంది. అధికారంలో ఉన్నపుడు కూడా వైసీపీ పెద్దలు అదే చెప్పేవారు. తాము ఎవరిని నిలబెడితే వారే గెలుస్తారు అని కూడా గట్టిగా మాట్లాడేవారు. అంతకు ముందు 2014 నుంచి 2019 మధ్యలో కూడా జగన్ ఒక్కరే జనంలోకి వెళ్ళారు. ఆయనే పోరాటాలు చేశారు. ఆయనే పాదయాత్ర చేశారు. అన్ని నిరసన కార్యక్రమాలలో ఆయనే పాలు పంచుకున్నారు. అలా నిత్యం జనంలో జగన్ ఉండడం వల్లనే పార్టీ కూడా బలంగా మారింది. క్యాడర్ కి లీడర్ కి ఉత్తేజం కలిగింది. కానీ ఇపుడు చూస్తే అధినేత కాకుండా పార్టీ నేతలను జనంలోకి వెళ్ళమంటే ఎలా అన్న చర్చ వస్తోంది. ఒకవేళ వెళ్ళినా వారి వల్ల వచ్చేది పెద్దగా ఏమి ఉంటుంది అని కూడా అంటున్నారు. జగన్ కి ప్రజాదరణ ఉంది. ఆయన మాస్ లీడర్. ఆయనే కూటమి ప్రభుత్వానికి ఎదురొడ్డి జనంలో నిలిస్తేనే ఆయన వెంట క్యాడర్ కూడా పరుగులు తీస్తుంది అని అంటున్నారు. వైసీపీ అధినాయకత్వంలో ఈ మార్పు రావాలని అంటున్నారు అయితే జగన్ కూడా జనంలోకి వెళ్ళాలనే అనుకుంటున్నారు అంటున్నారు. ఒక ఏడాది పాటు అయినా ఈ ప్రభుత్వానికి గడువు ఇచ్చి ఆ మీదట జనంలోకి వెళ్తే ఆ ఇంపాక్ట్ వేరేగా ఉంటుందని ఆయన ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. ఆ ఆలోచన బాగానే ఉన్నా ఈలోగా అయినా క్యాడర్ వద్దకు వెళ్తూ పార్టీ కోసం ఇబ్బందులు పడుతున్న వారిని పరామర్శిస్తూ ఉంటే కనుక కొంత ఊపు వస్తుందని అంటున్నారు. మరి వైసీపీ హైకమాండ్ ఈ విషయంలో ఏమి ఆలోచిస్తుందో చూడాల్సి ఉంది అని అంటున్నారు.

# పోషకాహార లోపం...వ్యాధులకు మూలం - జూన్ 7... ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం




ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం ను మొట్టమొదటి సారిగా 2019లో ఈ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. "ది ఫుచర్ ఆఫ్ ఫుడ్ సేఫ్టి" అనే నినాదంతో జెనీవాలోని అడిస్ అబాబా కాన్ఫరెన్స్‌లో ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలంటూ పిలుపునిచ్చారు. ప్రజల్లో ఆహారభద్రత పై మరింత అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ ఏడాది కూడా ఈ దినోత్సవాన్ని సరకొత్త థీమ్‌తో ఘనంగా నిర్వహించనున్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ సహకారంతో ఈ దినోత్సవాన్ని నిర్వహి స్తుంది ఆహార భద్రత అనేది ప్రభుత్వాలు, ఉత్పత్తిదారులు, వినియోగదారులు మధ్య భాగస్వామ్య బాధ్యత. అంతేకాదు మనం తీసుకునే ఆహారం సురక్షితమైనదేనా అని నిర్ధారించడంలో రైతు నుంచి కూలి వరకు ప్రతి ఒక్కరి పాత్ర ఉంది. ఆహార భద్రత కోసం తగు చర్యలు తీసుకునేలా ప్రపంచ దేశాలను ప్రోత్సహించడం, ఆహార కొరత సమస్య ఉత్పన్నం కాకుండా చూడడం, ప్రజలు రకరకాల వ్యాధులను ఎదుర్కొనేలా వారికి పౌష్టికరమైన ఆహారం అందుబాటులో ఉండేలా చేయడం వంటివి తమ ప్రధాన ఎజెండాగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ పేర్కొంది. ఈరోజుల్లో అన్నం విలువ కొంత మందికే తెలుస్తుంది. ఎందుకంటే అన్నం తినేవాడి కన్నా దానిని పండించే వారికే దాని యొక్క విలువ తెలుస్తుంది. ఆహారం పారేయడానికి ఒక్క నిమిషం చాలు, కాని ఆ ఆహారాన్ని పండించ డానికి కనీసం మూడు నెలలు పడుతుంది. ఆ విషయం తెలియక చాలా మంది దానిని వృధా చేస్తారు. దీనికి సంబందించే అంటే ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈరోజున ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం జరుపు కుంటారు. ఒకరు రోజంతా కష్టపడి కూలి పనులు చేసి డబ్బు సంపాదిస్తారు. ఇంకొకరు రోజంతా ఏసీ గదుల్లో కంప్యూటర్ల ముందు కూర్చొని కుస్తీ పడతారు. ఎవరు ఎలా కష్టపడినా... కడుపు నింపు కోవడానికే. కోటి విద్యలు కూటి కోరకే... అని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. ముందు కడుపు నిండాకే మనిషి మరో దాని గురించి ఆలోచిస్తున్నాడు. ప్రస్తుతం కనీస అవసరాల కిందకి చాలా వచ్చాయి. ఎన్ని ఆ జాబితాలో చేరినా మొదటి స్థానంలో ఆహారమే ఉంటుంది. ఎందుకుంటే... ఆహారం లేకుండా సృష్టిలో ఏ ప్రాణి జీవించలేదు కాబట్టి. కానీ ప్రస్తుత రోజుల్లో మనుషులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నా కూడా కడుపు నిండా భోజనం చేయడం లేదు. బరువు పెరుగు తామనో, లావు అయి పోతామనో ఇలా కారణాలు చెబుతున్నారు. కొందరేమో తినడానికి తిండి లేక అవస్తలు పడుతున్నారు. ఈ రెండు కారణాల వల్ల పోషకాహార లోపాన్ని ఎదురు కుంటున్న వారు చాలా మంది ఉన్నారు. అలాగే వ్యాధుల బారిన పడకుండా ఎలాంటి ఆహారం తినాలనే విషయాలపై అవగాహన అవసరం. ఆహారం కలుషితమయ్యేందుకు, తద్వారా అనారోగ్యం కలిగేందుకు బ్యాక్టీరియా, వైరస్, పరాన్న జీవులు కారణం. అధిక మోతాదులో వాడే రసాయనిక ఎరువులు, నిల్వ చేసేందుకు, రుచి కల్పించేందుకు ఉపయోగించే రసాయనాలు కూడా చేటు చేసేవే. ఎలాంటి జబ్బుల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలతో పాటు గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలవలు, బొబ్బర్లు, జీడిపప్పు, బాదం పప్పు, వాల్ నట్స్ వంటిని ప్రతి రోజూ తీసుకోవాలి. భారతీయులు రోజూ కనీసం 400గ్రాముల కూరగాయలు, పండ్లు తీసుకోవాలని భారత పోషకాహార సంస్థ చెబుతోంది. రాగులు, జొన్నలు, వరి, గోధుమ వంటి ధాన్యాన్ని కూడా ఎక్కువగా తీసుకోవాలి. మరీ ప్రత్యేకంగా కొవ్వులు, చెక్కర, ఉప్పు వాడకాన్ని చాలా తక్కువగా వాడటం ఉత్తమం. 50శాతం కేలరీలు అందిస్తున్న పంటలు 8 రకాలు ఉన్నాయి. బార్లీ, బీన్స్, వేరుశెనగ, మొక్కజొన్న, వరి, జొన్న, గోధుమలు వీలైనంత ఎక్కువగా ఆహారంలో భాగం చేసుకోవాలి. బయట లభించే ఆహారాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్ అసలు తినకపోవడం చాలా మంచిది. చిన్నారులకు కనీసం 9నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి. పుట్టగానే డబ్బా పాలను అలవాటు చేస్తే.. అప్పటి నుంచే వారిలో పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు తగినంత వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం. మన భూమి మీద మనిషి తినగలిగే మొక్కల జాతుల సంఖ్య దాదాపు 30వేలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 852 మిలియన్ల మంది దీర్ఘకాలంగా అతి పేదరికం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణాలు అనేకం. విపరీతమైన జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు, ఆహార ధాన్యాలను జీవ ఇంధనాల కోసం ఉపయోగించడం, మౌలిక ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గించి లాభదాయకమైన వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపడం... ఇలా ఎన్నో కారణాలు. వీటి పర్యవసానంగా ఆహార ధాన్యాల ధరలు అందుబాటు లోకి లేనంతగా పెరగడం మరో సమస్య. ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలు, నగరాలలో జీవిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాలవల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలో కొన్ని దేశాలలో కరువు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60 శాతం జనాభా పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. దాదాపు 22 దేశాలలో (వాటిలో 16 ఆఫ్రికాలోవే) పోషకాహార లోపం 35 శాతం దాటిందని తేలింది. భారతావనిలో విస్తారమైన కోట్లాది ఎకరాల భూములుండి, లక్షలాది ఎకరాల పంట భూములలో పప్పు ధాన్యాలు, తదితర ఆహార ధాన్యాలతో విలసిల్లింది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన మనదేశం స్వాత్రంత్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, పాలకుల పేదరిక నిర్మూలనా పథకాలు, లక్షల, కోట్ల పంచ వర్ష ప్రణాళికలు ఈ ఏడు దశాబ్దాల్లో పేదరికం ఆకలి తీర్చలేదు. పేదలు దరిద్రులుగా, ధనికులు బిలియనీర్లు, ట్రిలియనీర్లు కావటానికి ఉపయోగపడ్డాయి తప్ప, సగటు మనిషి ఆకలి తీర్చటంలో విఫలమయ్యాయి. దేశ స్థూల జాతీయాదాయం చూపి చంకలు గుద్దుకుంటున్న పాలకులు జాతీయాదాయంతో పాటు, జాతులకు ఆహార భద్రత కల్పించటంలో విఫలమయ్యారు. దీనికి ఉదాహరణ పనికి ఆహార పథకంలో అవినీతి, పేదలకిచ్చే సబ్సిడి ఆహార భద్రత కార్డుల్లో అవినీతి, ఆహార అవసరాలు తీర్చుట గురించి అవకాశం కల్పించినా రైస్‌మిల్లర్ల మాయాజాలం వెరసి అవినీతి ఎందెందు వెతికినా అందందు కలదన్నట్టు అవినీతి బీజాలు మహా వృక్షాలై పాలకుల ప్రజాస్వామ్య వ్యవస్థను వెక్కిరిస్తున్నాయి. వ్యవసాయ రంగానికి ఒక సమగ్ర విధానమంటూ లేకపోవటంతో వ్యవసాయాన్ని సమాధిచేసి, ఉన్న వ్యవసాయంలో వాణిజ్య పంటలను ప్రోత్సహించింది. ప్రపంచ వేదికల్లో గొప్పలకు పోయే మన పాలకుల ఏలికలు వాస్తవ పునాదులపై నిలబడి, మాటల్లో కాకుండా ఆచరణతో కూడిన ఆహార భద్రత పరిష్కారానికి పూనుకోవాలి. అదే జాతీయ ప్రయోజనాలకు, జాతి ప్రయోజనాలకు శ్రేయస్కారం. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అగ్రశ్రేణి అభ్యుదయ రచయిత బొల్లిముంత - జూన్ 7...బొల్లిముంత శివరామకృష్ణ వర్ధంతి



బొల్లిముంత శివరామకృష్ణ (నవంబరు 27, 1920 – జూన్ 7, 2005) అగ్రశ్రేణి అభ్యుదయ రచయిత, ఉపాధ్యాయుడు, హార్మోనిస్టు, నటుడు, గాయకుడు, కవి, కథారచయిత, నవలాకారుడు, బుర్రకథా, హరికథా రచయిత, జర్నలిస్టు, సినిమా రచయిత, అభ్యుదయ రచయితల సంఘం నాయకుడు, రాజకీయ కార్యకర్త, నిబద్దత గల కమ్యూనిస్టు నేత. తెలుగు సాహితీ లోకంలో ఆయన నిశ్శబ్ద విప్లవం, మార్క్సిస్టు గాంధీ అని గుర్తింపు పొందారు. 1920 నవంబరు 27వ తేదీన గుంటూరు జిల్లా వేమూరు మండలం, చదలవాడలో మంగమ్మ, అక్కయ్య దంపతులకు జన్మించిన శివ రామకృష్ణ ప్రాథమిక, మాధ్యమిక విద్య తమ స్వగ్రామంలో కొనసాగించి, గుంటూరులో హయ్యర్‌గ్రేడ్ శిక్షణ పూర్తి చేశారు. అక్కడ విద్యార్థి ఉద్యమంతో, ఆ తర్వాత చదలవాడలో ఉద్యోగంలో చేరిన పుడు కమ్యూనిస్టు ఉద్యమంతో ప్రత్యక్ష సంబంధం ఏర్పడింది. ఆ రోజుల్లోనే ఆయన 'దేశం ఏమయ్యేట్టు?', 'వ్యక్తి స్వాతంత్ర్యం' వంటి కథలు రాసి ప్రచురించారు. సంస్కృతాన్ని, సంగీతాన్ని స్వయం కృషితో నేర్చుకున్నారు. రైతులు, వ్యవసాయ కార్మికుల పిల్లలకు విద్యాబోధన చేశారు. బొల్లిముంత 16వ ఏట రచించిన ఏటొడ్డు కథ చిత్రాంగి పత్రికలో అచ్చయ్యింది. అది ఆయన తొలిరచన. 1936లో మద్రాసు నుండి వెలువడే 'చిత్రాంగి' పత్రికలో తన తొలి కథ 'ఏటొడ్డు' ప్రచురించారు. 1945లో తన ఉపాధ్యాయ వృత్తిని వదలి వ్యవసాయ కార్మిక సంఘం లో చేరి చల్లపల్లి రాజాకి వ్యతిరేకంగా సాగిన భూపోరాటంలో పాల్గొ న్నారు. ఆ పోరాట అనుభవాల తోనే తొలి రాజకీయ నవల మృత్యుంజయులు రాశారు. నగారా అనే పత్రిక నడిపారు. బెంగాల్ కరవుపై బుర్రకథ రాశారు. 'రైతుబిడ్డ' హరికథ రాశారు. పార్టీ పనులమీద తిరుగుతూ మునగాల పరగణాలోని జగ్గయ్య పేటకు వెళ్ళి రావడం జరుగుతూ ఉండేది. అక్కడే తెలంగాణ పోరాటం గూర్చి వినడం ద్వారా ఉత్తేజితుడైన యువకుడు బొల్లిముంత ఇరవై ఏడేళ్ళ వయసులో 'మృత్యుంజయులు' నవల రాశారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన 1946–51 మధ్య అర్ధ దశాబ్ద కాలం పాటు తెలంగాణ రైతులు సాయుధులై దోపిడీ వర్గాల మీద తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటులో కవులు, రచయి తలు, కళాకారులు ఎంతోమంది భాగస్వాములయ్యారు. 1946లో తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం ప్రారంభమైతే, సదరు పోరాటానికి తొలి అక్షర రూపంగా, ఆ పోరాటం వస్తువుగా 1947లో 'మృత్యుంజయులు' నవల అచ్చయింది. 1947 అక్టోబరు 25న విడుదల చేశారు. తెలంగాణ ప్రాంత స్థితిగతులను సహజంగా, యథాతథంగా చిత్రించిన ఆ నవల విశేష ఆదరణ పొందింది. నైజాం రాజ్యంలో నాటి పరిస్థితుల్ని, దేశముఖులు, పటేళ్ళ ఆగడాల్నీ: సామాన్య ప్రజలు ముఖ్యంగా గ్రామీణ రైతాంగ ప్రజానీకం అనుభవిస్తున్న కష్టాల్నీ, యువకుల్లో తలెత్తుతున్న తిరుగుబాటు ధోరణుల్నీ అక్షరీకరించిబీ ఇక్కడి ప్రజల్లో చైతన్యాన్నీ, బైటివారిలో సంఘీభావాన్ని రేకెత్తించి. ఉద్యమ దిశగా జనాన్ని సమాయత్తం చేయడం ఆ నవల రచనా నేపథ్యం. దేశంలో ఇతర ప్రాంతాల్లో రైతులు పంటలు పండించు కున్నందుకు శిస్తులు చెల్లిస్తే, తెలంగాణలో నాడు శిస్తులు కట్టడానికి మాత్రమే పంటలు పడించాల్సిన దుర్భర స్థితిని సహజంగా చిత్రించింది మృత్యుంజయులు నవల. పాలకుల నిరంకుశ పాలనను సహించ లేక, అనుదినం చస్తూ బతకడం కన్నా, భావి తరాల భవిష్యత్తు కోసం చావడానికి సైతం సిద్ధమై, పోరాటంలో నేలకొరిగిన వీరులే మృత్యుంజయులు. నవలలోని ముఖ్య పాత్రలన్నీ పోరాటంలో వీరమరణం పొందడం జరుగుతుంది. తెలంగాణ పోరాట కాలంలో వెలువడిన తొలి నవలగా, ఒక చారిత్రక అవసర నేపథ్యంలో , ప్రజా పోరాటాన్ని కళ్ళకు కట్టినట్లు వివరించే నవలగా తెలుగు సాహిత్యంలో మృత్యుంజయులు నవల సుస్థిర స్థానం పొందింది. ఆ తర్వాత గంగినేని 'ఎర్రజెండాలు', వట్టికోట 'ప్రజల మనిషి', 'గంగు', మహీధర రామ్మోహనరావు 'ఓనమాలు', మృత్యు నీడల్లో', తిరునగరి 'సంగం' వంటి నవలలు వెలువడ్డాయి. బొల్లిముంత క్రమంగా ప్రజారంగాన్ని వదిలి 1960లో మద్రాసు సినిమా రంగంలోకి ప్రవేశించారు. ఆచార్య ఆత్రేయకు ఘోస్ట్ రైటర్‌గా కలిసి ఉంటే కలదు సుఖం, కలిమి లేములు మొదలైన అనేక చిత్రాలకు సంభాషణలు రాశారు. ఆత్రేయ దర్శకత్వంలో రూపొందిన వాగ్దానం చిత్రానికి సహరచయితగా తెరపైకెక్కారు. నాటి నుంచి బి.ఎస్.నారాయణ దర్శకత్వం వహించిన చిత్రాలన్నింటికీ బొల్లిముంత సంభాషణలు రచించారు. 1968లో విశాలాంధ్ర ప్రారంభించిన ప్రతిభ వారపత్రికకు సంపాదకుడయ్యారు. దర్శకుడు వి.మధుసూదనరావు చిత్రాలకు ఎన్నిటికో సంభాషణలు రాశారు. ఆయన రాసిన దాదాపు యాభై సినిమాల్లో మనుషులు మారాలి, ప్రజా నాయకుడు వంటి సీరియస్ సినిమాలేకాక శారద, కళ్యాణ మంటపం, మూగకు మాటొస్తే, విచిత్రబంధం వంటి సెంటిమెంట్ ప్రధానమైన చిత్రాలు కూడా ఉన్నాయి. నాటకాల్లో హార్మోనియం వాయించారు. స్త్రీ పాత్రలు ధరించారు. బొల్లిముంత 'ప్రజాపక్షం' మాసపత్రికకు సంపాదకత్వ బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్‌లో అరసం నిర్మాణంలో ఒకరు. నమ్మిన సిద్ధాంతాల పట్ల జీవిత పర్యంతం నిబద్ధత కలిగిన అభ్యుదయ మానవతావాది బొల్లిముంత జీవితం, వ్యక్తిత్వం, సాహిత్యం తర తరాలకూ స్ఫూర్తిదాయకం. 2005 జూన్ 7న బొల్లిముంత ఈ లోకం వీడి వెళ్ళారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# కళాప్రపూర్ణుడు నటరాజ రామకృష్ణ - జూన్ 7 నటరాజ రామకృష్ణ వర్ధంతి



నాట్యాన్నే జీవిత సర్వస్వంగా చేసుకొని కళకే అంకితమై, బ్రహ్మచారిగానే ఉండిపోయి, ఆరు దశాబ్దాలుగా కళామతల్లికి విశేష సేవలందించి, ప్రాచీన సాంప్రదాయ నాట్య కళా రీతులను దశదిశలా వ్యాపింప జేసిన కళాదిగ్గజం రామకృష్ణ. కాకతీయుల కాలంలో కనుమరు గయిన తెలంగాణ నృత్య విశేషం 'పేరిణి' శివతాండవ నృత్యాన్ని పునరుజ్జీవింప చేసి, అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిన నాట్యగురువు ఆయన. తెలుగు వారి ప్రాచీన నాట్యకళా రీతులకు తిరిగి జీవంపోసి... ఆరు దశాబ్దాలుగా నాట్య కళా రీతులను దేశ విదేశాలలో ప్రదర్శింప చేసిన మహా నాట్యాచార్యుడు, భరత కళాప్రపూర్ణ, పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ . నటరాజ రామకృష్ణ ఇండోనేషియా లోని బాలి ద్వీపంలో భారత్ నుంచి వెళ్ళిన కుటుంబంలో మార్చి 21, 1923న జన్మించారు. చిన్న వయస్సు లోనే తల్లి మరణించగా, ఆ తర్వాత కుటుంబం భారతదేశానికి తిరిగి వచ్చింది. చిన్నవయస్సు నుంచే రామకృష్ణ సాంప్రదాయ నృత్యాలపై మక్కువ చూపించారు. ఆయన తనలోని కళాతృష్ణ అన్వేషణలో మీనాక్షి సుందరం పిళ్ళై, వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి, శ్రీమతి నాయుడుపేట రాజమ్మ, పెండెల సత్యభామ లాంటి మహామహులైన ఉద్దండ కళా గురువులను కలుసుకొని వారి నుండి ఎన్నో నాట్యరీతుల్ని నేర్చుకున్నారు. కాకతీయుల కాలం నాటి నృత్యం పేరిణి శివ తాండవంను రామకృష్ణ వెలుగు లోకి తెచ్చారు. నవ జనార్ధన పారిజాతం అనే నాట్య ప్రక్రియను సృష్టించారు. ఆంధ్రనాట్యం, పేరిణి నృత్యాల పురోగతికై 'నటరాజ రామకృష్ణ ఆంధ్రనాట్యం' సంస్థను నెలకొల్పారు. హైదరాబాదు లోని తారామతి, ప్రేమావతి మందిరాలను బాగు చేయించారు. భరతనాట్యం, కూచిపూడి లాంటి భారతీయ నృత్య సంప్రదాయాలను ఆకళింపు చేసుకొని తెలుగువారి సంస్కృతికి దర్పణమైన ఆంధ్ర నాట్యాన్ని పునరుద్ధరించి ప్రపంచ వ్యాప్తంగా బహుళ ప్రచారం చేసిన కళాకారుడిగా రామకృష్ణ పేరుపొందారు. దేవదాసీల నృత్య రీతులను నటరాజ రామకృష్ణ ఆంధ్రనాట్యం పేరుతో సుస్థితం చేశారు. 15 సం.ల వయస్సులోనే నాట్యగ్రంథాలు వ్రాయడం మొదలుపెట్టి మొత్తం 41 గ్రంథాలు పూర్తిచేశారు. ప్రధానంగా 10వ శతాబ్దంలోని కాకతీయ సామ్రాజ్య కాలంలో, మగవారు నాట్యం చేసే పేరిణి శివతాండవ నృత్యాన్ని పునర్జీవింప చేసి, ఎందరికో శిక్షణ ఇచ్చి, ప్రాచీన నాట్య కళను తిరిగి వందలాది ప్రదర్శనలు ఇప్పించి నాట్య కళకు ఎనలేని సేవలు అందించిన కళాతపస్వి రామకృష్ణ. వేంకటేశ్వర కల్యాణం, కుమార సంభవం, మేఘ సందేశం వంటి నాట్య ప్రదర్శనలు ఆయనకు ఎంతో పేరు తెచ్చాయి. ఉజ్జయినిలో ప్రదర్శింప బడిన కుమార సంభవానికి స్వర్ణకలశం లభించింది. నటరాజ రామకృష్ణ వ్రాసిన 40కి పైగా పుస్తకాలలో ఆరింటికి భారత ప్రభుత్వ పురస్కారం లభించింది. వాటిలో దాక్షిణాత్యుల నాట్యకళాచరిత్ర, ఆంధ్రులు %–% నాట్యకళారీతులు వంటివి ప్రసిద్ధ గ్రంథాలు. దక్షిణ భారత నృత్య రీతుల, నర్తన బాల, డ్యాన్సింగ్ బెల్స్ పుస్తకాలకు కేంద్ర, రాష్ట్ర పురస్కారాలు కూడా లభించాయి. డ్యాన్సింగ్ బెల్స్ ఇంగ్లీష్ రచన స్వర్గీయ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆయన సమ్మతితో అంకితమివ్వటం మధురమైన స్మృతిగా రామకృష్ణ భావించేవారు. 1979లో భారతకళా సవ్యసాచి బిరుదు పశ్చిమ గోదావరి జిల్లా కళాకారుల సంఘం ద్వారా పొందారు. కళాప్రపూర్ణ బిరుదు 1981లో ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి, కళాసరస్వతి బిరుదు 1982లో హైదరాబాదులోని కళావేదిక ద్వారా ఇవ్వబడ్డాయి. దక్షిణ భారతపు ఉత్తమ నాట్యాచార్యుడుగా 1984లో కేంద్ర సంగీత నాటక అకాడమీ ద్వారా ఇవ్వబడింది. 1986 లో ఎల్.వి.ఆర్. ట్రస్ట్, మద్రాసు నుండి %–% పేరిణీ శివతాండవంపై పరిశోధనకుగాను ఉత్తమ పరిశోధకునిగా పురస్కారం అందుకున్నారు. 1980 శ్రీశైలం దేవస్థానం తరపున ఆస్థాన నాట్యాచార్యునిగా ఉన్నారు. అలాగే 1980 సంవత్సరం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన ఆస్థాన నాట్యాచార్యునిగా వ్యవహరించారు. 1985 లో ఆంధ్రప్రదేశ్ కళాప్రేమికులు ఆయనకు స్వర్ణకిరీటాన్ని బహూకరించారు. 1991లో శ్రీ రాజాలక్ష్మీ పురస్కారం,95లో రాజీవ్‌గాంధీ ఫౌండేషన్ అవార్డ్ మరియు భారత ప్రభుత్వంచే పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. 1999లో కళాసాగర్ అవార్డ్ అందుకున్నారు. 2000 సంవత్సరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం తరపున విశిష్ట పురస్కారం అందుకున్నారు. నాట్య కళకు అంతర్జాతీయఖ్యాతి తెచ్చిపెట్టిన రామకృష్ణ. జూన్ 7, 2011న హైదరాబాదులో మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నిల్వ చేయలేం.. విపణిలో అమ్మలేం!

పరిగి: రైతులు రెక్కలు ముక్కలు చేసుకుని పండిస్తున్న పంటలకు ధరలు ఉండటం లేదు. కనీసం పెట్టుబడి చేతికందక పోవడంతో ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. ఇటీవల టమాట రైతుల పరిస్థితి ఇది.. ఎకరాకు రూ.50వేల పెట్టుబడితో పంటను సాగు చేస్తే కనీసం రవాణా ఛార్జీలు కూడా అందక సతమతమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పంటను దాచుకునేందుకు ఎంతో అవసరమైన శీతలీకరణ గిడ్డంగులు అందుబాటులో లేకుండా లేవు. ఇంట్లో నిల్వ చేసుకోలేక, అమ్ముకోలేక పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. రైతుకు కిలోకు రూ.10 అందుతుండగా, దళారీకి రూ.20కి పైగా లాభం చేకూరుతోంది. ఒకవైపు విక్రయాలకు అవకాశాలు లేకపోవడంతో నష్టపోవాల్సి వస్తోందని ఉత్పత్తిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**దళారులకే మేలు**

పూడూరు, పరిగి, దోమ, కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో ఉద్యాన పంటల సాగు పెరుగుతోంది. టమాటతో పాటు వంగ, బీర, కాకర, క్యారెట్, మిరప, గోరుచిక్కుళ్లను సుమారు 450 ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. వేసవి పంటగా టమాటను సాగు చేసినా.. దళారులకే మేలు జరుగుతోందని రైతులు చెబుతున్నారు. కూరగాయలకు వారాంతపు సంతలే దిక్కవుతున్నాయి. పరిగి నియోజకవర్గ కేంద్రంగా రైతుబజార్ ఏర్పాటు చేస్తామన్న నేతల హామీలు కార్యరూపం



దాల్చలేదు. పరిగిలో శుక్ర, శనివారం, దోమలో మంగళవారం, కుల్కచర్లలో బుధవారం, పూడూరు మండలం మన్నెగూడలో మంగళవారం వారాంతపు సంతలు నిర్వహిస్తున్నారు. స్థానిక పంట ఉత్పత్తులను ఆయా ప్రాంతాల్లో విక్రయించాల్సి వస్తోంది. అమ్ముడు పోని పక్షంలో దారి పక్కన పారబోసి ఇంటికి వస్తున్నారు.

**రవాణా ఛార్జీలు.. రావడం లేదు**

కష్టపడి టమాటను కోసి మార్కెట్‌కు తరలిస్తే.. రవాణా ఛార్జీలు కూడా రావడం లేదు. విధిలేని పరిస్థితుల్లో పంట సాగు చేస్తున్నామని వాపోతున్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో టమాట జామ్‌తో పాటు పచ్చళ్లు, సాస్‌లను తయారు చేసే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తే కర్షకులకు, పొదుపు సంఘాలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు..

# భర్తీ చేస్తేనే.. వైద్యం మెరుగు!

మెదక్: 44వ జాతీయ రహదారిపై ఉన్న రామాయంపేట సామాజిక ఆసుపత్రిని 2022లో వైద్య విధాన పరిషత్ పరిధిలోకి చేర్చారు. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించలేదు. కౌడిపల్లి పీహెచ్‌సీని సామాజిక ఆసుపత్రిగా మార్చారు. ఇతర ఆసుపత్రుల నుంచి సిబ్బందిని డిప్యుటేషన్‌పై నియమించారు. వర్షాకాలం సమీపించింది. వ్యాధులు వ్యాపించే సమయం కావడంతో వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తం కావాలి.ప్రస్తుతం జిల్లాలో వైద్యులు, సిబ్బంది ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. వైద్యారోగ్య శాఖ పరిధిలో కంటే.. వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఖాళీలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం చొరవ చూపి వాటిని భర్తీచేస్తేనే ప్రయోజనంగా ఉంటుంది.బోధన ఆసుపత్రిలో..

జిల్లాలో 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక పట్టణ ఆరోగ్య కేంద్రం,



ఒక బోధన, ఒక ప్రాంతీయ, మూడు సామాజిక ఆసుపత్రులు ఉన్నాయి. మెదక్‌లోని బోధన ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు పూర్తిస్థాయిలో జరగడం లేదు. అతిసారం, టైఫాయిడ్, డెంగీ కేసులు గతేడాది ఎక్కువ నమోదు కాగా.. ఈసారి కాస్త తగ్గాయి. డెంగీ ఒక్క కేసు నమోదుకాలేదు.

**రాత్రి వేళ అవస్థలే..**

నర్సాపూర్ ప్రాంతీయ ఆసుపత్రిలో ఎక్కువగా కాన్పులు జరుగుతున్నాయి. ఇక్కడ రేడియాలజిస్ట్ లేరు. రాత్రి వేళ ప్రసవానికి వచ్చే వారిని, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని హైదరాబాద్, సంగారెడ్డికి పంపిస్తున్నారు. మూడేళ్ల కిందట ఏర్పాటైన ఆక్సిజన్ ప్లాంట్ ఇప్పటికీ వినియోగంలోకి రాలేదు. ఈఎన్‌టీ సేవలు అవసరం.

**ప్రైవేటే దిక్కు..**

తూప్రాన్ సామాజిక ఆసుపత్రిలో గతంలో నెలకు 100 ప్రసవాలు జరగ్గా.. ఇప్పుడు 30కి తగ్గాయి. స్కానింగ్ లేక గర్భిణులు ప్రైవేట్ బాటపట్టారు.

**పలు చోట్ల..**

రామాయంపేట సామాజిక ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ లేక ప్రసవాలు జరగడం లేదు. అత్యవసర సేవలు కరవయ్యాయి.

పాపన్నపేట పీహెచ్‌సీలో మహిళా సూపర్‌వైజర్, రెండు స్టాఫ్‌నర్సు, రెండు ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పొడ్చన్‌పల్లిలో స్టాఫ్‌నర్సు, ఫార్మాసిస్ట్, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యురాలు డిప్యుటేషన్‌పై వెళ్లడంతో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**ఎప్పటికప్పుడు సమీక్షించి..:**శ్రీరాం, జిల్లా వైద్యాధికారి

వర్షాలు కురుస్తుండటంతో అన్ని రకాలుగా సన్నద్ధమయ్యాం. ర్యాపిడ్ యాక్షన్ బృందాలను ఏర్పాటుచేశాం. జిల్లాలోని వైద్యులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేశాం. జ్వరాలు నమోదైన చోట శిబిరాలు ఏర్పాటు చేస్తాం. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి చర్యలు తీసుకుంటాం. వైద్యుల హాజరుపై దృష్టిసారించాం.

**వైద్య సేవల్లో లోపం తలెత్తకుండా చర్యలు..**శివదయాళ్, ప్రభుత్వ ఆసుపత్రుల జిల్లా సమన్వయకర్త

వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఖాళీల గురించి ప్రభుత్వానికి నివేదించాం. రామాయంపేట, కౌడిపల్లిలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. ఆయా ఆసుపత్రులకు.. ఇతర చోట్ల నుంచి సిబ్బందిని నియమించి, రోగులకు వైద్య సేవలు లోపించకుండా దృష్టిసారించాం.

# ఆశల గూటికి తాళం



తాండూరు : పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు సర్కారు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కొన్నింటిని నిర్మించింది. మరికొన్నింటి పనులు స్లాబ్ దశలో నిలిచాయి. పనులు పూర్తైన ఇళ్ల పంపిణీకి ప్రక్రియ ప్రారంభించింది. అర్హులను తేల్చేందుకు విచారణ జరిపింది. తీరా ఇళ్ల మంజూరు సమయానికి నేడు, రేపు అంటూ వాయిదాలతో సరిపెట్టింది. వేలాది మంది సొంతింటి కలలు ఆవిరయ్యేలా చేసింది. ఇళ్లులేని పేదలకు ప్రభుత్వమే ఇల్లు నిర్మించి కేటాయించేందుకు సంకల్పించింది. అందుకు హైదరాబాద్ రహదారి మార్గంలో ఖాంజాపూర్ గేటు వద్ద నిర్మాణాలకు నడుం బిగించింది. వెయ్యికిపైగా నిర్మాణాలు ప్రారంభించగా.. వాటిలో 596 నిర్మాణాల్ని పూర్తి చేయించింది. పెద్దపెద్ద భవంతుల్లోని ఇళ్లకు రంగులు వేసి ముస్తాబు చేశారు. తాగునీటి పైపులు, తలుపులు, కిటికీలు, అన్ని గదుల్లో విద్యుత్తు తీగలతో సదుపాయాల్ని కల్పించింది. శౌచాలయాలను నిర్మించి గొట్టాలను అమర్చారు. భవనాల్లోని ఇళ్లను పేదలకు అప్పగించేందుకు ఖరారు చేశారు.

**అర్జీల స్వీకరణ..**

రెండు పడక గదుల ఇళ్లను కేటాయించేందుకు ఆర్భాటంగా దరఖాస్తులు స్వీకరించారు. 9వేల మందికిపైగా దరఖాస్తులు సమర్పించగా అధికార బృందాలు ఇంటింటికీ వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ జరిపాయి. దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆరా తీసింది. చివరకు వడపోత ప్రక్రియ నిర్వహించి అర్హులను గుర్తించారు. లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. రెండు సంవత్సరాలు దాటినా అధికారులు, ప్రజాప్రతినిధులు ఊసెత్తడం లేదు. వందలాది ఇళ్లు నిరుపయోగంగా తాళం వేసి ఉంచాల్సిన పరిస్థితి. ఇళ్ల మధ్యన, రహదారిపై పిచ్చిమొక్కలు, పొదలతో అపరిశుభ్రంగా మారాయి. చెత్తాచెదారంతో నిండిపోయాయి. ఇప్పటికీ పేదలు ఇరుకైన అద్దెగదుల్లో ఉంటూ.. అవస్థలు పడుతున్నారు. నెలనెలా అద్దె భారంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను వెంటనే అర్హులైన వారికి కేటాయించాలని కోరుతున్నారు.


**అసంపూర్తి నిర్మాణాలు..**

నిర్మాణాలు పూర్తైన ఇళ్ల పక్కనే మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. ఇక్కడ 4 వేలకుపైగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. పనులు నిలిచిపోయి సంవత్సరాలు గడిచినప్పటికీ పట్టించుకోవడం లేదు. స్లాబ్ దశలో నిర్మాణాలు ఆగిపోయాయి. గోడలు, గచ్చు పనులు పూర్తి చేసి సదుపాయాల్ని కల్పిస్తే పేదలకు అందించేందుకు వీలుంటుంది. పంచాయతీరాజ్ శాఖ అధికారులు దృష్టిసారించి నిర్మాణాల్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**త్వరలో అప్పగించేందుకు చర్యలు**

రెండు పడక గదుల ఇళ్లకు నీటి సదుపాయం కల్పించాల్సి ఉంది. త్వరలో పూర్తి చేసి అర్హులైన పేదలకు అప్పగించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. అసంపూర్తి నిర్మాణాలకు సంబంధించి బిల్లు బకాయి ఉంది. అది చెల్లించి మిగిలిన పనులు పూర్తి చేయిస్తాం.నాగభూషణం, డీఈ, పంచాయతీరాజ్ శాఖ, తాండూరు

# మారిన డివిజన్ల సరిహద్దులు



కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో డివిజన్ల పునర్విభజన ప్రకటనకు అడుగు పడింది. ముసాయిదా జారీకి ప్రభుత్వం షెడ్యూలు ప్రకటించడంతో ప్రక్రియ పూర్తి చేశారు. నగరంలో 60 డివిజన్ల నుంచి 66 డివిజన్లకు సరిహద్దులు మారాయి. మొత్తం 3,35,592 మంది ఓటర్లు ఉన్నారు. నగర స్వరూపం పూర్తిగా మారినట్లే. పాత డివిజన్ల పరిధిలోని ఇళ్ల సంఖ్య, ఓటర్లు అటూఇటుగా మారగా డివిజన్ సంఖ్యలు మాత్రం పూర్తిగా మారిపోయాయి.

గతంలో ఒకటో డివిజన్ తీగలగుట్టపల్లిలో ప్రారంభం కాగా ఈసారి కూడా అక్కడి నుంచే మొదలైంది. అప్పటి చివరి డివిజన్ జ్యోతినగర్ కాగా, ప్రస్తుతం చివరి డివిజన్ డాక్టర్ స్ట్రీట్, అజ్మత్‌పుర, ఆదర్శనగర్, సుభాష్‌నగర్, కారా?నగడ్డ, గాంధీరోడ్డు ప్రాంతాలు ఉన్నాయి. భౌగోళికంగా, ఓటర్ల సంఖ్య, ఇళ్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఓటర్లు అధికంగా ఉన్న చోట ఆ ప్రాంతాలను విభజించి రెండ్న డివిజన్లుగా మార్చారు. ఎక్కువ శాతం ప్రధాన రహదారులను సరిహద్దులుగా నిర్ణయించారు.

**రేపటి నుంచి అభ్యంతరాల స్వీకరణ**

డివిజన్ల విభజన, సరిహద్దులు, ఓటర్లు, ఇళ్ల సంఖ్యలపై నగరవాసులు అభ్యంతరాలు తెలియజేసే వీలుంది. ఈనెల 5 నుంచి 11 వరకు డివిజన్లపై వచ్చిన అభ్యంతరాలను స్వీకరిస్తారు.

**విలీన గ్రామాలు.. ప్రత్యేక డివిజన్లు**

ఇటీవల అయిదు గ్రామాలు, కొత్తపల్లి మున్సిపాలిటీని కరీంనగర్ నగరపాలికలో విలీనం చేయగా అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాటికి ప్రత్యేకంగా డివిజన్లు ఏర్పాట్లు చేశారు. 3వ డివిజన్‌గా గోపాల్‌పూర్, దుర్శేడ్, 4వ డివిజన్‌లో పాత బొమ్మకల్, ఆటోనగర్, గుంటూరుపల్లి, 12వ డివిజన్‌లో గాంధీనగర్, చింతకుంట, పద్మనగర్, 13వ డివిజన్‌లో చింతకుంట పూర్తిగా, 14వ డివిజన్‌గా మల్కాపూర్, లక్ష్మీపూర్, 15వ డివిజన్‌లో కొత్తపల్లి కొంతభాగం, 16 డివిజన్‌లోకి కొత్తపల్లి మరికొంత భాగం ఉంది. మరోవైపు హౌసింగ్‌బోర్డు కాలనీలో కలిసి ఉన్న సదాశివపల్లిని తొలగించి ప్రత్యేకంగా 5వ డివిజన్‌గా చేశారు. 6వ డివిజన్‌లో పూర్తిగా అలుగునూర్ ఉంది.

**6వ డివిజన్‌లో అత్యధికంగా 5,697 మంది ఓటర్లు**

డివిజన్ల పునర్విభజనలో భాగంగా అత్యధికంగా 6వ డివిజన్ అలుగునూర్‌లో 5,697 ఓటర్లు ఉండగా అతి తక్కువగా 44వ డివిజన్ సీతారాంపూర్‌లో 4,584 ఓట్లు ఉన్నాయి. అన్ని డివిజన్లలో వీటి మధ్యనే ఓటర్లు ఉండగా అభ్యంతరాల సమయాల్లో ఓటర్లు, ఇళ్ల సంఖ్య మారే అవకాశముంది.

**చక్కర్లు కొట్టిన జాబితానే?** డివిజన్ల ముసాయిదా ప్రకటన రావడంతోనే ఆశావహులు, మాజీ కార్పొరేటర్లు డివిజన్ సరిహద్దుపై ఆరా తీయడం కనిపించింది. మూడు నెలల కిందట సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టిన జాబితానే ముసాయిదాలో దాదాపు ఉంది. డివిజన్ నంబర్లు అవే ఉండగా, ఓటర్ల లెక్క కోసం ఇంటినంబర్లు అటు ఇటుగా మారినట్లుగా కనిపిస్తోంది.

# వనమహోత్సవానికి సన్నద్ధం

పెద్దశంకరంపేట: పచ్చదనం పరిఢవిల్లేలా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు అధికారులు వనమహోత్సవ నిర్వహణకు సన్నద్ధమయ్యారు. ఇందుకు గుంతలు తీసే కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. గత ప్రభుత్వం హరితహారం పేరిట తొమ్మిది విడతల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిన విషయం విదితమే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పదో విడతలో 'వన మహోత్సవం' పేరిట దీన్ని చేపట్టింది. డీఆర్డీఏ, అటవీశాఖల అధికారులు మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.లక్ష్యం మేర..: జిల్లాలోని 469 గ్రామాల పరిధిలోని నర్సరీలలో మొక్కలు సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 28,24,000 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరేందుకు సంబంధిత శాఖ అధికారులు బాధ్యత తీసుకోనున్నారు.గతేడాదికి సంబంధించి 19 లక్షల మొక్కలు నర్సరీల్లో అందుబాటులో ఉన్నాయి.

**పంపిణీ ఇలా..**ప్రతి ఇంటికి ఆరు చొప్పున (పూలు, పండ్ల మొక్కలు మూడు చొప్పున) ఇవ్వనున్నారు. పండ్లకు సంబంధించి జామ, నిమ్మ, మామిడి పూలల్లో గులాబీ, మల్లె, మందారం వంటి రకాలను ఇచ్చేలా కార్యాచరణ రూపొందించారు. కమ్యూనిటీ, ప్రభుత్వ, అటవీ స్థలాల్లో వేప, మర్రి, రావి, కానుగ, సీతాఫలం, అల్లనేరేడు, సుబాబుల్, కానుగ, చింత వంటి రకాలను వనమహోత్సవంలో నాటనున్నారు. ఇంటి ఆవరణలో ఎక్కువగా మునగ



మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

**వచ్చే ఏడాదికి ఇప్పటినుంచే..**

వచ్చే ఏడాది చేపట్టే వనమహోత్సవానికి మండలానికి 55 వేలు, జిల్లాకు 11 లక్షల మొక్కలు పెంచేలా లక్ష్యం నిర్దేశించారు. ఇందుకు ఇప్పటినుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. విత్తనాలతో కాకుండా చిన్న సైజు మొక్కలను పెంచుతున్నారు.

**ఆదేశాలు రాగానే..:**

శ్రావణ్‌కుమార్, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్

ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం ప్రకారం అన్ని గ్రామాల్లోని నర్సరీలలో మొక్కలు సిద్ధం చేశాం. పలు రకాలు అందుబాటులో ఉన్నాయి. అన్ని గ్రామాల్లో గుంతలు తీసే ప్రక్రియ చేపట్టాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కార్యక్రమం ప్రారంభం అవుతుంది.

# కోడెల పంపిణీ.. పాఠాలు నేర్వరేమి?

సిరిసిల్ల: దక్షిణ కాశీ.. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ గోశాలలోని కోడెలను రైతులకు పంపిణీ చేయడంలో పాత నిబంధనలే పాటిస్తున్నారు. 2024 జూన్, అక్టోబరు, నవంబరు నెలల్లో కలిపి 1922 కోడెల పంపిణీ జరిగింది. వీటిలో ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల రైతులే ఎక్కువగా ఉన్నారు. ఆదివారం వేములవాడ పట్టణం తిప్పాపూర్ గోశాలలో 300 కోడెల పంపిణీని లక్ష్యం కాగా 150 మంది రైతులు మాత్రమే వచ్చారు. అందులోనూ సరైన ధ్రువపత్రాలు లేని కారణంగా 32 మంది రైతులకు 64 కోడెలు పంపిణీ చేశారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, వ్యవసాయాధికారి ఇచ్చిన ధ్రువపత్రం, రైతు ఫోటోతో దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు పరిశీలించాక ఒక్కరికి రెండు కోడెల చొప్పున ఇచ్చారు. రైతులు తీసుకొచ్చిన ధ్రువపత్రాలు పరిశీలించి, అర్హులైన వారికే పంపిణీ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా.. అవి రైతుల చేతుల్లోకి వెళ్లాక అక్కడ ఎలా ఉంటున్నాయనే పర్యవేక్షణ మాత్రం లేదు. ఒక వేళ అనారోగ్యం.. ఇతర కారణాలతో చనిపోతే మాత్రం.. వారి పరిధిలోని ప్రభుత్వ పశువైద్యాధికారితో పంచనామా ధ్రువపత్రం, మృతిచెందిన కోడె ఫోటోను తీసుకొచ్చి గోశాలలో సమర్పించాలి.



**వ్యవసాయానికే రాజన్న కోడెలు**

పంపిణీలో లోపాలు.. తర్వాత వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతోనే గతంలో పక్కదారి పట్టాయి. జిల్లా యంత్రాంగం, ఆలయ అధికారులు ఈ సారి దీనికోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించాలని తొలుత భావించినా అది సాధ్యం కాలేదు. దీంతో పాత విధానాన్నే అవలంబించినట్లు తెలుస్తోంది. కోడెలకు 12 అంకెల బార్‌కోడ్‌తో ఉన్న ట్యాగ్‌ను వేశారు.

2024లో కోడెల పంపిణీ పలు వివాదాలకు దారితీసింది. వరంగల్ జిల్లా గీసుకొండకు మండలం మనుగొండకు చెందిన రాంబాబు అనే వ్యక్తి రైతుల పేరుతో తీసుకెళ్లి.. వాటిని విక్రయించడం వంటి అంశాలు వివాదాస్పదంగా మారాయి. గీసుకొండలో అధికారులు విచారణ జరపడంతో మిగతా ప్రాంతాల్లోనివి ఎలా ఉన్నాయి? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గోశాల నుంచి తీసుకెళ్తున్న కోడెలు వ్యవసాయానికి కాకుండా ఇతర పనులకు వినియోగించినట్లు తేలితే 'పశువులపై క్రూరత్వ నివారణ చట్టం 1960, 1977 భారతీయ న్యాయ సంహిత చట్టం' కింద విచారణకు బాధ్యత వహిస్తారు.కోడెలు పక్కదారి పట్టకుండా ఉండేందుకు తొలుత జీపీఎస్ పరికరం అమర్చాలని నిర్ణయించాం. ఒక్కో పరికరానికి రూ.5 వేల నుంచి రూ.7 వేల ఖర్చవుతుంది. అది బ్యాటరీతో బెల్టు మాదిరిగా ఉంటుంది. దాన్ని కోడె మెడకు వేయాలి. రైతులు తీసుకెళ్లాక ఈ పరికరాన్ని తీసి పక్కకు పెట్టే అవకాశం ఉంది. అది పూర్తి భద్రత కాదని భావించాం. ప్రస్తుతానికి 12 అంకెల బార్‌కోడ్‌తోనే కోడెలను పంపిణీ చేస్తున్నాం. కోడెల సంరక్షణకు ఉపయోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన పరికరాలపై పశుసంవర్ధకశాఖ అధికారులతో కలిసి ఆరా తీస్తున్నాం. అన్ని విధాలా పరిశీలించాక కోడెలకు వేసేలా ప్రణాళికలు చేస్తున్నాం. – వినోద్‌రెడ్డి, ఈవో, వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం

# పునఃప్రారంభానికి సిద్ధం!

వెల్గటూరు : సర్కారు బడుల బలోపేతానికి విద్యాశాఖ పక్కా కార్యాచరణతో ముందుకు సాగుతోంది. 2025–26 విద్యా సంవత్సరంలో బడులు తెరిచే నాటికే విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు అయిదు రోజుల వృత్యంతర శిక్షణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా జూన్ 6 నుంచి బడిబాట కార్యక్రమం చేపట్టనున్నారు. జూన్ 12న పునఃప్రారంభం రోజున పాఠ్య, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు విద్యార్థులకు అందించేలా విద్యాశాఖ పటిష్ట పర్యవేక్షణ చేపట్టింది.

**ముందే చేరిన పుస్తకాలు**

ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం కంటే ముందుగానే దాదాపు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు సరఫరా చేశారు. యూడైస్ ప్లస్‌లో విద్యార్థుల సంఖ్య ప్రామాణికంగా కేటాయింపు జరిగింది. ఈ మేరకు ఇప్పటికే జిల్లాల నుంచి మండలాలకు, అక్కడి నుంచి పాఠశాలలకు పంపిణీ పూర్తయింది. ఈ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకు



విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా రాత పుస్తకాలు సైతం అందిస్తోంది. గతంలో ఎమ్మార్సీల ద్వారా పాఠశాలలకు అందించారు. దీనివల్ల ఎమ్మార్సీలకు, పాఠశాలలకు అదనంగా రవాణా భారం పడేది. ఈ నేపథ్యంలో ఈసారి ఆర్టీసీ కార్గో సేవల ద్వారా నేరుగా పాఠశాలలకే సరఫరా చేశారు. సుమారు 70శాతానికి పైగా పాఠశాలలకు ఇప్పటికే రాత పుస్తకాలు చేరాయి. 6–8 తరగతులకు సబ్జెక్టుకు ఒకటి చొప్పున ఏడు, 9, 10 తరగతులకు రెండు చొప్పున 14 రాత పుస్తకాలు, కేజీబీవీలలో ఎంపీసీ/బైపీసీ విద్యార్థులకు 12 చొప్పున, ఎంపీహెచ్‌డబ్ల్యూ విద్యార్థినులకు 10 చొప్పున రాత పుస్తకాలు అందించనున్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు వర్క్‌బుక్‌లు ఇవ్వనున్నారు.

**బాలురకు ప్యాంటులు**

ఏటా విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్నారు. ఈసారి బడులు తెరిచే నాటికి ఒక జత అందించేలా ఏర్పాట్లు చేశారు. డీఆర్డీఏ, మెప్మాల ఆధ్వర్యంలో స్వశక్తి మహిళలు దుస్తులు కుడుతూ ఉపాధి పొందుతున్నారు. ఎక్కడి పాఠశాలలకు సంబంధించి అక్కడే క్లస్టర్ల వారీగా విభజించి కచ్చితమైన కొలతలతో ఏకరూప దుస్తులు రూపుదిద్దుకుంటున్నాయి. ఈ ఏడాది ఆరు, ఏడు, ఎనిమిది తరగతి బాలురకు నిక్కర్ల స్థానంలో ప్యాంటులు అందిస్తున్నారు.

చురకలు



# డీజీపీఎస్ సర్వే.. ఆక్రమణలు ఆగేనా?

హైదరాబాద్: ఆలయ భూముల ఆక్రమణలకు చెక్ పెట్టేందుకు దేవాదాయశాఖ డీజీపీఎస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) సర్వే చేపట్టింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో చేపట్టిన పైలట్ ప్రాజెక్టులో భాగంగా హైడ్రా బృందంతో కలిసి నెక్నాంపూర్‌లోని గణేశ్ ఆలయ భూములను సర్వేచేశారు. రాజధాని పరిధిలో 19,482.3 ఎకరాల దేవాదాయశాఖ భూములుండగా.. అందులో 6,410.58 ఎకరాలు ఆక్రమణకు గురైంది. తాజాగా చేపట్టిన సర్వే ద్వారా అన్నీ ఆలయాల భూములను డిజిటలీకరించి, నక్షా హద్దులను నిర్ధారించనున్నారు.క్యాడ్ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించి భూసర్వే నిర్వహించి కచ్చితమైన మ్యాప్‌లు రూపొందించనున్నట్టు అధికారులు స్పష్టం చేశారు.

**ఆక్రమణల్లో రెండు, మూడు స్థానాల్లో..**

రాష్ట్రవ్యాప్తంగా ఆలయ భూములు ఆక్రమణకు గురైన జిల్లాల్లో మహబూబ్‌నగర్ మొదటి స్థానంలో ఉండగా.. మేడ్చల్ జిల్లా



రెండోస్థానంలో ఉంది. ఇక్కడ 4,125.03 ఎకరాల భూములు ఉండగా 2,888.18 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. మూడో స్థానంలో హైదరాబాద్ జిల్లా ఉంది. ఇక్కడ 5,718.01 ఎకరాల భూమికి 2,374.25 ఎకరాలు కబ్జాకు గురైంది. సికింద్రాబాద్‌లో 279.25 ఎకరాల భూమికి 7.12 ఎకరాలు కబ్జా చెరలో ఉంది. రంగారెడ్డి జిల్లాలో 9,360.01 ఎకరాలు ఉండగా 1,148.15 ఎకరాలు కబ్జాదారులు ఆక్రమించుకున్నారు. భూముల రక్షణ, నిర్వహణ బాధ్యతలను దేవాదాయశాఖ పర్యవేక్షిస్తోంది.సిబ్బంది కొరతతో ఒక్కో ఈవోకు రెండు నుంచి మూడు ఆలయాల బాధ్యతలు అప్పగించారు. సరైన పర్యవేక్షణ లేక భూములు ఆక్రమణలకు గురవుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

**స్పష్టత కరవు :** సర్వేలు చేయడం, ఆక్రమణలు గుర్తించడం ఆ తర్వాత విస్మరించడం పరిపాటిగా మారిందంటూ ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు విమర్శిస్తున్నారు. చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చి కూల్చివేతలు చేపడతారో లేదో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఇందిరమ్మ ఇల్లు.. మాకొద్దు వెళ్లు

హైదరాబాద్: నగరంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి మరో సవాలు ఎదురైంది. బస్తీల్లోని గుడిసెలు కూల్చి అక్కడే గృహ సముదాయాలు నిర్మిస్తామంటూ సర్కారు ప్రత్యామ్నాయ ఆలోచనతో ముందుకొచ్చింది. అయితే.. పేదలు దానిపై ఆసక్తి చూపడం లేదు. మొత్తం 8 మండలాల్లోని 13 బస్తీలను ఇళ్ల నిర్మాణానికి ఎంపిక చేయగా.. వాటిలోని ఏడు బస్తీల్లో అధికారులు పర్యటించారు. ఎక్కడా స్థానికులు సుముఖత వ్యక్తం చేయలేదని అధికారులు చెబుతున్నారు.

**400చ.అడుగుల విస్తీర్ణంలో 1బీహెచ్‌కే.. :** ఎంపిక చేసిన బస్తీల్లో గుడిసెలను తొలగించి.. అక్కడే జీ౦3 సముదాయాలను నిర్మించాలని




సర్కారు నిర్ణయించింది. ఒక్కో లబ్ధిదారునికి 400చదరపు అడుగుల విస్తీర్ణంలో ఓ పడక గది ఉండే ఫ్లాటును ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. మెహిదీపట్నంలోని మాంగార్‌బస్తీలో ఉన్న 350 వాంబే ఇళ్లను మూడు రోజుల్లో కూల్చాలని అధికారులు నిర్ణయించారు.ఇక్కడ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని అధికారులు చెబుతున్నారు.

**ఏడు చోట్ల తనిఖీలు పూర్తి..**

ఆసిఫ్‌నగర్ మండలంలోని నాలుగు బస్తీలు, సైదాబాద్‌లో రెండు బస్తీలను, మారేడుపల్లిలోని ఓ బస్తీని జీహెచ్ఎంసీ అధికారులు తనిఖీ చేశారు. మాంగార్ బస్తీలోని శిథిల ఇళ్లను కూల్చి ఇందిరమ్మ ఇళ్లను కట్టాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు. మిగిలిన చోట్ల మాత్రం.. అధికారుల ప్రతిపాదనను వ్యతిరేకించారు.

**పలు కారణాలతో నిరాసక్తత..**

కొందరికి తక్కువ విస్తీర్ణంలో ఇల్లు ఉండటం, మరికొందరి ఇల్లు పెద్దగా ఉండటం, ఇటీవలే ఇళ్లను ఆధునికీకరించుకోవడం, నిర్మించుకోవడం, వ్యక్తిగత గృహాల్లో నివసించేందుకే ప్రాధాన్యమివ్వడం, రకరకాల కారణాలతో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై బస్తీల్లోని గుడిసెవాసులు నిరాసక్తత చూపుతున్నారు.

# జీహెచ్ఎంసీలో డీజిల్ దొంగలు

హైదరాబాద్: దోమల నివారణ కార్యక్రమాల పేరిట పలువురు జీహెచ్ఎంసీ అధికారులు రోజూ వేలాది లీటర్ల డీజిల్ దోపిడీ చేస్తున్నారు. ఏటా రూ.20 కోట్ల ప్రజాధనాన్ని దోచేస్తున్నారు. అవినీతిని అరికడతామంటూ తాజాగా జీహెచ్ఎంసీ 'వన్ డే.. వన్ డివిజన్' పేరిటకార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంతో డీజిల్ చోరీ తగ్గకపోగా, మరింత పెరిగింది. గతంలో సంబంధిత డివిజన్ల సూపర్‌వైజర్లు, సిబ్బంది మాత్రమే వాటాలు తీసుకునేవారు. ప్రస్తుతం సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్ల సూపర్‌వైజర్లు, సిబ్బంది.. రోజువారీ ఇంధన కొనుగోళ్లలో వాటాల కోసం పోటీ పడుతున్నారు. పది శాతం డీజిల్‌తో తూతూమంత్రంగా ఫాగింగ్ చేపట్టి, 90 శాతం ఇంధనం అమ్ముతున్నారు. దోమల నివారణ చర్యలకు జీహెచ్ఎంసీ ఏటా రూ.20 కోట్లు వెచ్చిస్తుంది. అయితే యాంటీ లార్వా ఆపరేషన్ సజావుగా సాగుతుండగా, ఫాగింగ్ గొడవలు సృష్టిస్తోంది.

**10లీటర్లే..:** మూసాపేట వై జంక్షన్ సమీపంలోని భారత్ పెట్రోలు బంక్‌లో జరిగిన ఎంటమాలజీ సిబ్బంది వ్యవహారాన్ని పరిశీలిస్తే.. డీజిల్ దోపిడీ ఏ మేర జరుగుతుందో తెలుస్తుంది. 72 లీటర్లకుగాను సిబ్బంది 10 లీటర్ల డీజిల్ తీసుకెళ్లారు. ఆ పది లీటర్లతోనే సర్కిల్ మొత్తం ఫాగింగ్ చేయాలి. ఈ రకంగా రోజూ 80 శాతం నుంచి 90 శాతం ఇంధనాన్ని అమ్ముకుంటున్నారు. కొందరు అధికారులు డీజిల్ పేరుతో రోజూ లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారు.

# దవాఖానా.. ప్రాణాలు నిలిచేనా?



హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు వడ్డించే భోజనం విషయంలో శుభ్రత కరవవుతోంది. ముఖ్యంగా వంట గదుల్లో సరైన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. మురుగు పారుతున్న ప్రాంతంలోనే వంటలు చేస్తుండటం.. సరైన జాగ్రత్తలు పాటించకుండా రోగులకు ఆహారం పంపిణీ చేస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇటీవలి వైద్య ఆరోగ్యశాఖ తనిఖీల్లో రోగులకు ఆహార పంపిణీలో పలు లోపాలు బయట పడ్డాయి. తాజాగా ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో ఆహారం కలుషితమై ఒక రోగి చనిపోవడం, మరో 35 మంది అస్వస్థతకు గురి కావడంతో మరోసారి చర్చనీయాంశమైంది. కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రిలో వంటగది ముందు డ్రైనేజీ ఉండటంతో పంది కొక్కులు, ఎలుకలు వస్తున్నాయి.నాంపల్లి, గోల్కొండ, మలక్‌పేట ఏరియా ఆసుపత్రుల్లో వంట గదుల్లో ఎలుకలు, బొద్దింకలు తిరుగుతున్నట్లు విజిలెన్సు అధికారులు గుర్తించారు. సరోజినీదేవి నేత్ర వైద్య శాల వంట గది పక్కనే మురుగు పారుతోంది. ఉస్మానియా ఆసుపత్రిలో కిచెన్ పరిసరాల్లో ఎలుకలు, బొద్దింకలు స్వైర విహారం చేస్తున్నాయి. చేతులు పెట్టి రోగులకు భోజనం వడ్డిస్తున్నారు. దీంతో ఆహారం కలుషితమై మరింత అస్వస్థతకు గురవుతున్నారు.

**తోచిన మెనూ.. తింటే తిను..**

ఆసుపత్రిలో చేరిన వారికి ఆహారం అందించేందుకు ఒక్కో రోగికి ప్రభుత్వం రూ.80వంతున కేటాయిస్తోంది. అయితే పలు దవాఖానాల్లో మెనూ పాటించడం లేదని ఇప్పటికే అధికారులు తనిఖీల్లో గుర్తించారు. ప్రభుత్వం వద్ద డైట్ బకాయిలు పేరుకుపోయాయని చెబుతూ కొందరు గుత్తేదారులు తోచిన మెను వడ్డిస్తున్నారు. సుల్తాన్‌బజార్ మెటర్నిటీ ఆసుపత్రిలో నిత్యం ఒకే తరహా మెనుతో రోగులు సక్రమంగా తినడం లేదు. రాత్రి సమయంలో చాలామంది రోగులు ఉండటం లేదు. వారి పేరుతో మాత్రం భోజనం వడ్డిస్తున్నట్లు రాస్తున్నారు. గతంలో ఎర్రగడ్డ ఆయుర్వేద ఆసుపత్రిలో ఈ తరహా ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టారు.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి..**

వంట చేసే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

వంట చేసే ప్రాంతం పరిశుభ్రంగా ఉండాలి. పాత్రలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి

వంట గదిలో బొద్దింకలు, ఎలుకలు లాంటివి లేకుండా ఎప్పటికప్పుడు పెస్ట్ కంట్రోల్ చేయాలి


వంట చేసే ప్రాంతంలో మురుగు కాల్వలు, పైపులైన్ల లీకేజీలు ఉండకూడదు

వేడిగా ఉన్నప్పుడే రోగులకు ఆహారం అందించాలి..రోగుల ప్లేట్లు వేడి నీటితో కడుక్కునేలా ఏర్పాట్లు చేయాలి.

వడ్డించే సిబ్బంది చేతికి గ్లౌజులు ఉండాలి. తలకు టోపీ, నోటికి, ముక్కుకు మాస్క్ ఉండాలి.

వంట చేసేవాళ్లు, వడ్డించే వాళ్లు మరుగుదొడ్డికి వెళ్లినప్పుడు తప్పక చేతులు, కాళ్లు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.

# తరువు తరలే.. తనువు మురిసే



హైదరాబాద్: సాధారణంగా ఏదైనా అభివృద్ధి ప్రాజెక్టు చేపడితే పనులకు ఆటంకంగా మారే చెట్లను నరికేస్తుంటారు. ఇది పర్యావరణానికి నష్టమే. రానురాను పచ్చదనం కనుమరగయ్యే పరిస్థితి. కొత్తగా మొక్కను నాటి అది చెట్టుగా ఎదగాలంటే కొన్నేళ్ల సమయం పడుతుంది. అందుకే చెట్లను నరికేయకుండా వృక్ష సంపదను మరోచోటుకు తరలించి తిరిగి నాటే విధానం (ట్రాన్స్‌లొకేట్) అమలు చేస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాజెక్టు పనుల్లో భాగంగా వృక్షాలకు ప్రాణం పోస్తున్నారు.

**కొత్త ప్రాంతాల్లో పచ్చదనం...**

చాలావరకు చెట్లను హైదరాబాద్‌లోని జూ పార్కులో ట్రాన్స్‌లొకేట్ చేయనున్నారు. మరికొన్నింటిని కొత్తగా నిర్మించనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీలో పాతనున్నారు. ఇందులో అశోక, నేరేడు, రెయిన్‌ట్రీ, మునగ, మామిడి, సర్కారు తుమ్మ, వేప, బాదం, చింత, చిన్నబాదం, కొబ్బరి, కానుగ, మేడి, మర్రి, రావి, సీమచింత తదితర రకాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. భారీ నిర్మాణాలతో కాంక్రీట్ జంగిల్‌గా మారుతోంది. పచ్చదనం తగ్గిపోయి కాలుష్యం పెరుగుతోంది. ఈ తరుణంలో చెట్లను కాపాడుకోవాల్సి అవసరం చాలా ఉందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు.

**కమిటీకి బాధ్యతలు**

హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ చేపడుతున్న రెండు భారీ ప్రాజెక్టు పనుల్లో భాగంగా చెట్లను ట్రాన్స్‌లొకేట్ చేయడానికి ప్రణాళిక సిద్ధమైంది. సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫాం, ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట అవుటర్ రింగ్ రోడ్డువరకు చేపడుతున్న రెండు ఎలివేటెడ్ కారిడార్లలో దాదాపు 10 వేల పెద్ద, చిన్న చెట్లను గుర్తించారు. సుమారు 4,230 చెట్లను మరోచోటుకు తరలించడానికి ప్రణాళిక సిద్ధంచేశారు. హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ ఆధ్వర్యంలో ఒక కమిటీ ఈ పనులు చేపడుతోంది. తొలుత విలువైన చెట్లను గుర్తించి వాటికి మార్కింగ్ చేసి నష్టం లేకుండా తరలించనున్నారు. ఎలివేటెడ్ కారిడార్లలో చాలా చెట్లు పోతుండటంతో తొలుత పర్యావరణవేత్తల నుంచి విమర్శలు వచ్చాయి. దీనిపై కోర్టులో పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ పిటిషన్లు కూడా దాఖలైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసి ప్రతి చెట్టును పరిశీలించి నంబర్లు వేశారు. ట్రాన్స్‌లొకేట్‌కు వీలైనవాటిని గుర్తించి మార్కింగ్ వేశారు. ఇప్పటికే ప్యారడైజ్ నుంచి డెయిరీఫాం కారిడార్‌కు టెండర్లు కూడా పూర్తిచేశారు. గుత్తేదారు ఎంపిక పూర్తయ్యింది. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ముందు అవసరమైన ప్రాంతాల నుంచి చెట్లను ట్రాన్స్‌లొకేట్ చేసేందుకు హెచ్ఎండీఏ కార్యాచరణ రూపొందిస్తోంది.

రెండు కారిడార్లలో పచ్చదనం పరిస్థితి


రెండు కారిడార్లలో గుర్తించిన చెట్లు 10,623

తొలగించేందుకు గుర్తించినవి 3,298

ట్రాన్స్‌లొకేట్‌కు సిద్ధమైనవి 4,230

యథావిధిగా అక్కడేఉండేవి 3095

# అందని పరిహారం.. ఆగిన పనులు!



తాండూరు : వాహన రద్దీ నియంత్రించేందుకు.. ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు వీలుగా ప్రభుత్వం బాహ్యవలయ రహదారిని మంజూరు చేసింది. ఎనిమిదేళ్లు గడిచినా పనులు అసంపూర్తిగా మిగిలాయి. భూములు కోల్పోయిన రైతుల్లో కొందరికి ఇంకా పరిహారం చెల్లించలేదు. తాండూరు, యాలాల మండలాల్లోని గ్రామాల మీదుగా తొలిసారిగా బాహ్యవలయ రహదారి నిర్మించాలని ఖరారు చేశారు. 2016-17 నిధులు మంజూరయ్యాయి. 167వ జాతీయ రహదారి నుంచి చెంగోల్, అంతారం తండా, అంతారం, రాజీవ్ గృహకల్ప, ఖాంజాపూర్, బషీర్‌మియా తండా, రాశులపురం వద్ద జాతీయ రహదారి వరకు పనులు చేపట్టారు. అయితే జాతీయ రహదారి నుంచి చెంగోల్, అంతారం తండా, అంతారం మీదుగా ఖాంజాపూర్ గేటు వరకు 7.5 కిలోమీటర్ల రహదారి నిర్మాణం పూర్తైంది.

**రైతులు అడ్డుకోవడంతో..**అంతారం, అంతారంతండా వద్ద రైతులు తమకు పరిహారం చెల్లించలేదంటూ అడ్డుకోవడంతో కంకరపరిచి పనులు నిలిపివేశారు. వారికి నగదు చెల్లించి పనులు పూర్తి చేస్తే రాకపోకలు సాగించే వీలుంటుంది. దీంతో వాహన రద్దీ తగ్గడంతో పాటు ప్రమాదాలు అరికట్టేందుకు తోడ్పడనుంది. దుమ్ము కాలుష్యం నుంచి లక్షన్నర మందికిపైగా ప్రజలకు ఉపశమనం లభించనుంది. ప్రస్తుతం రహదారిని రైతులు ధాన్యం ఆరబెట్టేందుకు, మక్కలు ఎండబెట్టేందుకు వినియోగిస్తున్నారు.

**దృష్టిసారించిన సబ్‌కలెక్టర్..**

పనుల ప్రారంభానికి సంబంధించి సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ దృష్టి సారించారు. మూడు నెలల కిందట రహదారిని పరిశీలించారు. ఎక్కడెక్కడ అసంపూర్తి ఉందో ఆరా తీశారు. ఆయా ప్రదేశంలోని రైతుల వివరాలు, సేకరించిన భూవిస్తీర్ణం, చెల్లించాల్సిన పరిహారంపై విచారణ జరిపారు. పరిహారం అందని రైతులతో చర్చించారు.

**నవంబరులో అందుబాటులోకి: శ్రావణ్‌కుమార్, ఏఈ**

బాహ్యవలయ రహదారిలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించే ప్రక్రియ కొనసాగుతోంది. త్వరలో సమావేశం నిర్వహించి చెల్లింపులు పూర్తి చేస్తాం. జాతీయ రహదారి నుంచి ఖాంజాపూర్ వరకు అసంపూర్తి పనులు పూర్తి చేయిస్తాం. వర్షాకాలం పూర్తయ్యాక వాహనాల రాకపోకలకు అనుమతిస్తాం.

బాహ్యవలయ రహదారి: 12కిలోమీటర్లు

మంజూరైన నిధులు: రూ.78 కోట్లు

భూసేకరణ పెండింగు: 17.5ఎకరాలు

రైతులు: 21 మంది

చెల్లించాల్సిన సొమ్ము: రూ.5కోట్లు

రహదారి నిర్మించింది: 7.5 కి.మీ.

# పంచాయతీలకు కొత్త భవనాలు

వికారాబాద్ : జిల్లాలో సొంత భవనాలు లేని పంచాయతీలకు ప్రభుత్వం కొత్త వాటిని మంజూరు చేసింది. మొత్తం 36 గ్రామాల్లో నిర్మాణాల చేపట్టేందుకు ఉపాధి హామీ నిధులు మంజూరు చేశారు. ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున రూ.7.20 కోట్లు కేటాయించింది. అద్దె భవనాలు, ప్రభుత్వ సంస్థల కార్యాలయాల్లో కొనసాగుతున్న వాటికి ప్రాధాన్యమిచ్చారు. వీటి నిర్మాణాలు పూర్తయితే పరిపాలన సొంత భవనాల్లో కొనసాగుతుంది.

**స్థలాలున్న గ్రామాలే ఎంపిక..**

భవనాల నిర్మాణానికి స్థలాలున్న గ్రామాలనే ఎంపిక చేశారు. స్థలం లేకుండా భవనాలు మంజూరు చేస్తే ఇబ్బందులు పడతారన్న ఉద్దేశంతోనే ఈ విధంగా చేశామని అధికారులు పేర్కొన్నారు. సొంతగా ప్రైవేట్ స్థలాలు కొనుగోలు చేసే స్థోమత పంచాయతీలకు లేదు. ప్రస్తుతం మంజూరైన వాటిని నామినేషన్‌పై కేటాయిస్తారు. అయితే బిల్లులు సకాలంలో వస్తాయో రావోననే అనుమానంతో గుత్తేదారులు పనులు చేసేందుకు విముఖత చూపుతున్నారు. పనుల నిర్వహణ బాధ్యతను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు.

**ఇబ్బందులు తీర్చేలా..:**

జిల్లాలో కొత్త పంచాయతీలు ఏర్పాటయ్యాక సొంత భవనాలు లేక పరిపాలనలో ఇబ్బందులు ఎదురయ్యాయి. చాలా పంచాయతీలు అద్దె భవనాలు, కమ్యూనిటీ భవనాల్లో కొనసాగిస్తున్నారు. జిల్లాలో 566 పంచాయతీలు ఉండగా, కొత్తవాటితోపాటు మహబూబ్‌నగర్ జిల్లా



నుంచి 12, నారాయణపేట జిల్లా నుంచి 2 వికారాబాద్ జిల్లాలో విలీనం చేశారు. దీంతో జిల్లాలో 594 పంచాయతీలు ఏర్పడ్డాయి.

జిల్లాలో ఇలా పంచాయతీలు: 594

సొంత భవనాలు ఉన్నవి: 356

లేనివి: 238

శిథిలావస్థలో ఉన్నవి: 76

లేని వాటికే ప్రాధాన్యం..

జిల్లాలో పూర్తిగా భవనాలు లేని వాటికే కొత్త పంచాయతీ భవనాల మంజూరుకు ప్రాధాన్యమిచ్చాం. ఈ భవనాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు. ముందుగా మండలానికి రెండు చొప్పున భవన నిర్మాణాలను చేపట్టి పూర్తి చేయాలని నిర్ణయించాం.డాక్టర్ పి.జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిణి

# రబీ ధాన్యానికి అనుమతి.. ఖరీఫ్‌వి తరలింపు

భగత్‌నగర్: అనుమతులు లేకుండా ఒక మిల్లు నుంచి మరో మిల్లుకు ధాన్యం తరలించారనే ఫిర్యాదుపై రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఇటీవల కరీంనగర్‌లో తనిఖీలు నిర్వహించింది. కరీంనగర్‌లోని రాంనగర్‌లో పావని ట్రేడర్స్ కేరాఫ్ హన్మాన్ రైస్‌మిల్లులో ఖరీఫ్‌నకు చెందిన ధాన్యం తరలిస్తున్నారనే ఫిర్యాదుపై టాస్క్‌ఫోర్స్ అధికారులు అక్కడికి వచ్చి రికార్డులు పరిశీలించారు. తర్వాత నగునూర్‌లోని సరస్వతి రైస్‌మిల్లుకు వెళ్లి తనిఖీ చేశారు. అయితే వీరు ఖరీఫ్ నిల్వలు లెక్కించకుండా.. రబీ నిల్వలు లెక్కించారు.రాష్ట్ర ప్రభుత్వం మిల్లులకు తప్పనిసరిగా సార్టెక్స్‌తోపాటు పోషక విలువల ఆహారాన్ని జోడించడానికి బ్లెండెడ్ యంత్రాలు ఉండాలని నిబంధన విధించింది. చాలాచోట్ల ఈ యంత్రాలను బిగించుకోవడానికి అనువుగా లేవు. 'ఆ యంత్రాలు బిగించుకుంటాం.. సౌకర్యమున్న మిల్లులను అద్దెకు తీసుకుంటామనే నిబంధన'తో కొంతమంది మిల్లర్లకు ధాన్యం కేటాయించారు. అందులో ఒకటి హన్మాన్ రైస్‌మిల్లు. దీనికి ఖరీఫ్ 2024-25లో ధాన్యం కేటాయించారు. ఆ ధాన్యం మర ఆడించకుండా ఆరుబయట నిల్వ చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా కొన్ని మిల్లుల్లో స్థలం లేకపోయినా, ఇతర ప్రాంతాల్లో నిల్వ చేసుకోవడానికి జిల్లా అధికారులు ప్రస్తుత రబీ ధాన్యం తరలించడానికి అనుమతులు జారీ చేశారు. దీనిని ఆసరాగా చేసుకొని హన్మాన్ రైస్ మిల్లు నుంచి 2008 ఖరీఫ్ ధాన్యం బస్తాలను సరస్వతి రైస్ మిల్లుకు తరలించారు.

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రెండు మిల్లులు తనిఖీ చేశారు. లెక్క సరిపోయిందని తేల్చినట్లు తెలిసింది. ఖరీఫ్ ధాన్యం తరలింపునకు అనుమతులు లేవనే ఫిర్యాదుపై వచ్చిన వారు ఆ ధాన్యంపై ఉన్న టార్పాలిన్ కూడా తొలగించలేదు. నగునూర్‌కు వెళ్లి రబీ సీజన్ తాలుకు ధాన్యం బస్తాలు ఉజ్జాయింపుగా



లెక్కించారు.రాంపూర్ మిల్లులో ఇప్పటి వరకు ఖరీఫ్ ధాన్యమే మిల్లింగ్ చేయలేదు. అయినా జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులు రబీ సీజన్‌కు చెందిన 2790 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించారు. నిబంధనల ప్రకారం రా రైస్ మిల్లులకు రబీ ధాన్యం కేటాయించొద్దు. వాటిలో మర ఆడిస్తే నూక శాతం ఎక్కువ వస్తుంది.

**ఫిర్యాదు మేరకే..**

రబీ ధాన్యాన్ని ఇతర మిల్లులకు తరలించాలని అనుమతి ఇస్తే ఖరీఫ్ ధాన్యం తరలించారని ఫిర్యాదు వచ్చింది. దీనిపై తనిఖీ చేయడానికి టాస్క్‌ఫోర్స్ బృందం వచ్చింది. నిజానిజాలు నివేదిక తర్వాత తేలుతాయి.- నర్సింగ్‌రావు, డీఎస్‌వో

**ప్రభుత్వానికి నివేదిక**మేము ధాన్యాన్ని, రికార్డులను పరిశీలించాం. సంబంధిత నివేదికను ప్రభుత్వానికి పంపుతాం. దీనిపై ఇప్పుడే వివరాలు చెప్పం - ప్రభాకర్, ఓఎస్‌డీ

## పట్టణం.. పనులు అసంపూర్ణం

కరీంనగర్ : పట్టణాలు, నగరాల్లో పెరుగుతున్న జనాభాకు తగ్గట్లుగా సౌకర్యాలు మెరుగు పడటం లేదు. ప్రధాన రహదారులు మినహాయిస్తే అంతర్గత రహదారులు, మురుగు నీటి కాల్వలు లేక బస్తీవాసులు అవస్థలు పడుతున్నారు. నిధులు కేటాయించి ప్రారంభించిన పనులు కూడా మధ్యలో వదిలేస్తుండగా.. ఏళ్ల తరబడి ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. చేసిన పనులకు బిల్లులు రావడం లేదని గుత్తేదారులు చెబుతుండగా.. వాటిని పూర్తి చేయాలనే ఆలోచన పురపాలక అధికారులకు ఉండటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని రెండు నగరపాలికలు, 13 పురపాలికల్లో ఇదే పరిస్థితి నెలకొనగా వచ్చే వర్షాకాలంలోపు వదిలేసిన అభివృద్ధి పనులు పూర్తి చేసేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపించాల్సిన అవసరముంది.

పరిస్థితి ఇదీ.. కరీంనగర్ నగరపాలికలో సీఎం హామీ (సీఎంఎ) నిధులు రూ.132 కోట్లతో 60 డివిజన్‌లలో 60 ప్రాంతాల్లో రహదారులు, మురుగు కాల్వలు నిర్మించేందుకు తవ్వి వదిలేశారు. కంకర పోసి వదిలేయడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. కొందరు రోడ్డు ఎత్తు చూసుకొని ర్యాంపులు కట్టుకుందామని అలాగే ఉంచడంతో ఇళ్లకు వెళ్లడం భారంగా మారింది. కల్వర్టులు నిర్మించకుండా వదిలేయడంతో మురుగు నీరు అక్కడే నిలిచి దుర్వాసన వస్తోంది. హుజూరాబాద్‌లోని ఇందిరా నగర్ కాలనీ, బృందావన్ కాలనీ, జమ్మికుంట రోడ్డు, డ్రైనేజీ సమస్యలు పరిష్కారం కావడం



లేదు. జమ్మికుంటలో రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించి 20 అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వర్షాకాలంలో పలు కాలనీల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రామగుండంకు ఏటా రూ.100 కోట్లు గత ప్రభుత్వం రెండేళ్లు మంజూరు చేసి వదిలేయగా అభివృద్ధి పనులు పునాదులకే పరిమితమయ్యాయి. టీచర్స్ కాలనీలో మురుగు దుర్గంధం ప్రధాన సమస్యగా మారింది.

పెద్దపల్లిలో రోడ్లు, మురుగు నీటి కాలువల పనులు నత్తనడకన సాగుతున్నాయి. సిరిసిల్లలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధులతో టెండర్ పిలిచిన పద్మానగర్ రోడ్డు, డ్రైనేజీ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. జగిత్యాలలో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి కోసం టీయూఎఫ్ఐడీసీ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.32.72 కోట్లు మంజూరు కాగా అందులో 122 పనులకు అనుమతించారు. 56 పూర్తి చేయగా 56 పనులు అసలే ప్రారంభించలేదు. ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తెలియని గందరగోళం నెలకొంది.

పరిశీలించిన నగరాలు: 2

పట్టణాలు : 8

ప్రధాన సమస్యలు : రోడ్లు, డ్రైనేజీలు

## ధర దిగాలు.. రైతు కుదేలు

కరీంనగర్ : జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలులకు మామిడి ధర భారీగా పతనమైంది. మొన్నటి వరకు మార్కెట్‌లో సగటున కిలో ధర రూ.40 నుంచి రూ.30 పలికిన మామిడి ధర.. ప్రస్తుతం ఏకంగా గరిష్ఠంగా కిలో రూ.20 ఉండగా, మధ్య రకం రూ.10, కనిష్ఠంగా రూ.4కు పడిపోయింది. ఇందులో ఏజెంట్ కమీషన్, రవాణా ఛార్జీలు పోను మిగిలింది ఏమీ లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పొరుగు జిల్లాల నుంచి..**

కరీంనగర్ జిల్లాలో ఈ ఏడాది కాత తక్కువగానే ఉన్నప్పటికీ, మార్కెట్‌కు దిగుబడి మాత్రం పెరిగింది. జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాల పరిధిలోని ధర్మపురి, ధర్మారం, మంచిర్యాల, హుస్నాబాద్, కోహెడ తదితర ప్రాంతాల నుంచి కరీంనగర్ మార్కెట్‌కే మామిడి తీసుకువస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు.

**క్రయ విక్రయాలు ఇలా..**

మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతుల దగ్గరి నుంచి మామిడి నాణ్యతను బట్టి ట్రేడర్లు కొనుగోలు చేస్తారు. రైతులు, ట్రేడర్లకు మధ్యవర్తులుగా



కమీషన్ ఏజెంట్లు ఉంటారు. కమీషన్ ఏజెంట్లు రైతుల నుంచి నాలుగు శాతం కమీషన్ తీసుకొని, మూడు శాతం లాభం.. ఒక్క శాతం మార్కెట్ కమిటీకి ఫీజుగా చెల్లిస్తారు.

**ఇతర రాష్ట్రాలకు ఎగుమతి**

మార్కెట్‌లో కొనుగోలు చేసిన మామిడిని ట్రేడర్స్ అధిక శాతం మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, అస్సాం, బిహార్, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. సీజన్ సాగినన్ని రోజులు ఇక్కడ పనిచేయడానికి ఉత్తరాది రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో కూలీలు వస్తారు. వారంత మార్కెట్‌కు వచ్చిన మామిడిని గ్రేడింగ్, ప్యాకింగ్, లోడింగ్ చేస్తారు. ఈనెలాఖరు వరకు మార్కెట్ కొనసాగుతుందని.. ఏఎంసీ ఇన్‌ఛార్జి కార్యదర్శి సయ్యద్ హమీద్ తెలిపారు.

**మార్కెట్‌కు 2,865 మెట్రిక్ టన్నులు**

కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో గత నెల 2న మామిడి విక్రయాలు ప్రారంభమయ్యాయి. సీజన్ ప్రారంభంలో బరువు ఎక్కువగా ఉండే కాయలకు సగటున కిలోకు రూ.60 నుంచి రూ.50 వరకు ధర పలికింది. కానీ క్రమక్రమంగా ధర తగ్గుతూ వచ్చింది. ఇప్పటి వరకు మార్కెట్‌కు బంగినపల్లి రకం అధికంగా 2,784 మెట్రిక్ టన్నులురాగా, మిగిలిన రకాల్లో దశేరి 81, ఇతర రకాలు 3 టన్నులు మాత్రమే వచ్చాయి.

## దగా 'ఖానాలు'




హైదరాబాద్: కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. కొన్ని ఎలాంటి అనుమతులు లేకుండానే నడిపిస్తుండగా.. మరికొన్ని ఆసుపత్రులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జత చేసి అనుమతులు తీసుకుంటున్నాయి. తాజాగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఓ ఆసుపత్రి అక్రమాల బాగోతం బయట పడింది. భవన నిర్మాణ అనుమతులు నుంచి మౌలిక వసతులు, వైద్యులు, సిబ్బంది, ఫైర్‌సేఫ్టీ, రోగుల భద్రత ఇలా ప్రతి అంశంలోనే ఉల్లంఘనలు చోటుచేసుకున్నట్లు అధికారులు ధ్రువీకరించి నోటీసు జారీ చేశారు. విచ్చలవిడిగా ఏర్పాటు.. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాల్లో విచ్చలవిడిగా నకిలీ క్లినిక్‌లు.. నర్సింగ్‌హోంలు పుట్టుకొస్తున్నాయి. అర్హత లేని వ్యక్తులు వీటిని నడుపుతున్నారు. గతేడాది దాదాపు 187 పైగా అక్రమ క్లినిక్‌లను ఔషధ నియంత్రణ శాఖ గుర్తించి కేసులు నమోదు చేసింది.

**సీఎంఆర్ఎఫ్ నిధులకు ఎసరు**

కొన్ని ఆసుపత్రులు తప్పుడు పత్రాలతో సీఎంఆర్ఎఫ్ నిధులనే కాజేస్తున్నాయి. మాదన్నపేట, బీఎన్‌రెడ్డినగర్, ఐఎస్‌సదన్, సైదాబాద్, బైరామల్‌గూడ, కొత్తపేట, హస్తినపురంలోని ఆరు ఆసుపత్రులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఈ నిధులు పక్కదారి పట్టించినట్లు గుర్తించి చర్యలు తీసుకున్నారు. ఇటీవల సరూర్‌నగర్‌లోని అలకనంద ఆసుపత్రిలో భారీ కిడ్నీ రాకెట్ బయట పడిన సంగతి తెలిసిందే.

**ఇదీ పరిస్థితి..**

ఆసుపత్రి లేదా క్లినిక్, నర్సింగ్‌హోం నడిపించాలంటే ఎంబీబీఎస్ డిగ్రీతోపాటు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 ప్రకారం వైద్య ఆరోగ్యశాఖ వద్ద అనుమతులు తీసుకోవాలి.

డయాగ్నొస్టిక్ సెంటర్‌లో తప్పనిసరిగా పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ అమలు చేయాలి. తద్వారా లింగనిర్ధారణ లాంటి పరీక్షలు నిషేధం. వీటికి సంబంధించి బోర్డులు, రికార్డులు నిర్వహణ తప్పనిసరి.

ఇక ప్రతి గల్లీలోనూ క్లినిక్‌లు ఉన్నాయి. చాలాచోట్ల అనుమతులు లేకుండా నడిపిస్తున్నారు. కొన్నిచోట్ల రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేసుకోవడం లేదు. ఫిజియోథెరపీ కేంద్రాలు, ఆయుష్ కేంద్రాలు సైతం కూడా ఎక్కడపడితే అక్కడ కొనసాగిస్తున్నారు.

**వసూళ్లకే ప్రాధాన్యం..?**

ఎలాంటి అనుమతులు లేని క్లినిక్‌లపై నిరంతర నిఘా ఉండటం లేదు. శివార్లలో క్లినిక్‌ల తనిఖీల్లో కొందరు అధికారులు చేతివాటానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొలిసారి అనుమతి లేకుండా క్లినిక్ లేదా ఆసుపత్రిని గుర్తిస్తే వాటికి రూ.50 వేల జరిమానా విధించాలి. అప్పటికీ అనుమతులు తీసుకోకపోతే రెండోసారి రూ.2 లక్షలు, మూడోసారి పట్టుబడితే రూ.5 లక్షల జరిమానా వేయాలి. క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. నెలవారీ వసూళు చేస్తూ...తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

**నగరంలో అనుమతి పొందినవి ఇలా..**

డయాగ్నొస్టిక్ కేంద్రాలు 47

క్లినిక్‌లు 925

ఫిజియోథెరపీ 45

ఆయుష్ 89

## కనికట్టు చేసేయ్.. కాసులు మేసేయ్



హైదరాబాద్: జీహెచ్‌ఎంసీలోని కొందరు ఇంజినీర్లు బరి తెగించారు. రోడ్డు వేయకుండా బిల్లులు పెట్టేస్తున్నారు. 2021-22, 2022-23 సంవత్సరాల్లో చేపట్టిన పలు పనుల బిల్లులను.. మూడేళ్ల తర్వాత ఆమోదానికి పంపడంతో అప్పటి కమిషనర్ ఇలంబర్తి అనుమానాలు వ్యక్తం చేశారు. జనవరిలో ఆయా ఆర్థిక సంవత్సరాలకు చెందిన 10శాతం బిల్లులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. అందులోని 20 పనుల లోపాలను విజిలెన్స్ గుర్తించింది. ముఖ్య ఇంజినీరుకు నివేదిక ఇవ్వగా ఆయన ఆయా సర్కిళ్లకు పంపించి వివరణ కోరారు.

**గుర్తించిన లోపాలు..**మార్నింగ్ స్టార్ హోటల్ నుంచి రెయిన్‌బజార్ వరకు 9 భవనాలను కూల్చాల్సి ఉండగా.. ఆరింటిని కూల్చినట్టు ఇంజినీర్లు రూ.2.13 లక్షల బిల్లు పెట్టారు. క్షేత్రస్థాయిలో మూడింటినే తొలగించారు. రూ.84 లక్షలతో బేగంపేట పాంటలూన్స్ నుంచి మయూరి అపార్ట్‌మెంట్ వరకు వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులు సగ భాగం జరగలేదు. అయినప్పటికీ రూ.64.56 లక్షల బిల్లులు పెట్టారు. రూ.1.75 కోట్లతో శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డికాలనీలో మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి ఇంజినీర్లు రూ.69.27లక్షల బిల్లులను ఆమోదించగా, పనులు ఆ స్థాయిలో కాలేదు. తలుపులు, టైల్స్ ఇప్పటికే ధ్వంసమై ఉన్నాయి.

రూ.1.82 కోట్లతో పటాన్‌చెరు సర్కిల్ భారతినగర్ డివిజన్‌లోని ఆదర్శ రైతుబజార్‌లో చేపట్టిన పునరుద్ధరణ పనులకు ఇంజినీర్లు రూ.1.70 కోట్లు చెల్లించాలని బిల్లులు పెట్టారు. కానీ పనులు పూర్తికాలేదు. రైతు బజారు ప్రారంభానికి నోచుకోకపోవడం జీహెచ్‌ఎంసీకి నష్టం కలిగిస్తోంది.

కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రూ.5.95 కోట్లతో ఈత కొలను నిర్మించారు. నీటి కనెక్షన్ తీసుకోవడంలో ఇంజినీర్లు చేతులెత్తేశారు. ఈత కొలనుకు రూ.1.4 కోట్ల బిల్లు పెట్టారు. ఇంజినీర్ల నిర్లక్ష్యంతో వెచ్చించిన ప్రజాధనానికి విలువ లేకుండా పోయింది.

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రేమావతిపేట్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం 90 మీటర్ల పొడవున పూర్తయితే, అంతా జరిగినట్టు రూ.27.88 లక్షల బిల్లు పెట్టారు.

ఖైరతాబాద్ జోన్‌లోని ఎల్లారెడ్డిగూడ, కేశవ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో రూ.14.9 లక్షలతో చేపట్టిన ప్రహరీ నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఇంజినీర్లు ఈ పనికి రూ.8.33లక్షల బిల్లులు పెట్టారు.

రూ.19.85లక్షలతో శివరాంపల్లి న్యూ వీకర్ సెక్షన్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు సగం పూర్తి చేశారు. మొత్తం అయినట్లు రూ.19.85 లక్షల బిల్లులు పెట్టారు.

రూ.5.95 కోట్లతో చేపట్టిన బహదూర్‌పుర అలియాబాద్‌లో చేపట్టిన వరద నీటి నాలా నిర్మాణ పనులు ఆదిలోనే నిలిచిపోయాయి. అయినా రూ.58లక్షల బిల్లులు చెల్లించాలని ఇంజినీర్లు సిఫార్సు చేశారు.

రూ.59.6 లక్షలతో మోండామార్కెట్ డివిజన్ టీచర్స్ కాలనీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తికాలేదు.

## రసాయన వ్యర్థాల నిర్వహణ గాలికి



హైదరాబాద్: హానికర వ్యర్థాల నిర్వహణను మెటల్ పరిశ్రమల యూనిట్ల నిర్వాహకులు గాలికొదిలేశారు. లెడ్, జింక్, మాంగనీస్ వంటి లోహాలను శుద్ధి చేసే పరిశ్రమల్లో అనేక ప్రమాదకర వ్యర్థాలు వెలువడుతాయి. వాటిని దుండిగల్‌లోని వ్యర్థాల నిర్వహణ కేంద్రం(టీఎస్‌డీఎఫ్)కు తరలించాలి. 900 నుంచి 1300 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య భస్మం చేస్తారు. అయితే నిబంధనలను పట్టించుకోని పరిశ్రమల నిర్వాహకులు హానికర వ్యర్థాలను ఇష్టానుసారం సమీప అడవులు, పరిశ్రమలకు దగ్గరలోని మైదానాలు, ఖాళీ స్థలాల్లో పారబోస్తుండటంతో సమస్యలు తప్పడం లేదు.

**జితిన్ ఎంటర్‌ప్రైజెస్‌పై వేటు..**

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం నందిగామ వద్ద ఏర్పాటు చేసిన జితిన్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి విపరీతంగా కాలుష్యం నమోదవుతోందని గుర్తించిన పీసీబీ తాజాగా మూసివేత ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడ నిత్యం 672 కేజీల 'సీసం లోహ కడ్డీలు' ఉత్పత్తి అవుతుంటాయి. కాలుష్య ఉద్గారాలైన లెడ్ స్లాగ్, లెడ్ డ్రాస్ వ్యర్థాల నిర్వహణ కేంద్రానికి తరలించకుండా అక్కడే పారబోస్తుంది. చుట్టుపక్కల పొలాలు కలుషితం కావడంతోపాటు భూగర్భజలాలపై ప్రభావం పడినట్లు అధికారులు తనిఖీల్లో గుర్తించారు. 2 రోటరీ ఫర్నేస్‌లకు అనుమతి తీసుకొని.. అదనంగా మరో 2 నడుపుతున్నట్లు గుర్తించారు. పరిశ్రమల్లో కార్మికుల ఆరోగ్యంపై ప్రతి ఆరు నెలలకోసారి నివేదిక ఇవ్వాలి. కానీ కొంత కాలంగా సమర్పించలేదు. నీటి వినియోగంపై రికార్డులు కనిపించలేదు. తనిఖీ బృందం నివేదిక ప్రకారం పరిశ్రమ మూసివేతకు పీసీబీ ఆదేశించింది.

**దూలపల్లి, కీసరలో పారబోత**

మూడు జిల్లాల పరిధిలో 2 వేలకు పైగా పరిశ్రమలుండగా, 30 శాతం టీఎస్‌డీఎఫ్‌లో సభ్యత్వం తీసుకోలేదని పీసీబీ అంచనా వేసింది. రసాయన వ్యర్థాలను దూలపల్లి, కీసర అటవీప్రాంతాల్లో పారేస్తున్నారు. గతంలో ఇక్కడ పారబోసిన వ్యర్థాల శాంపిల్లను పీసీబీ సేకరించి బాధ్యులైన పరిశ్రమలపై చర్యలు తీసుకుంది. అనంతరం నిఘా కొరవడటంతో పరిస్థితి విషమించింది. వ్యర్థాల పారబోత సమాచారాన్ని పౌరులు 'జనవాణి-కాలుష్య నివారిణి' ద్వారా అందించొచ్చని పీసీబీ వెల్లడించింది.

## చేపల కొలనులలో చేతి నిండా ఉపాధి

మంథని : కూలీలకు పని కల్పించడంతో పాటు మత్స్యకారులకు ఏడాది పొడవునా ఆదాయం వచ్చేలా ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో ఏటా చేపల కొలనుల తవ్వకం చేపడుతోంది. దీంతో చెరువు శిఖం భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తోంది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, చేప పిల్లల పెంపకం, ఉత్పత్తితో మత్స్యకారులకు జీవనోపాధి మెరుగయ్యేలా ఆర్థికంగా చేయూతనిస్తోంది. జిల్లాలో చెరువులు, కుంటలు కలిపి 1076 ఉన్నాయి. మొత్తం 206 మత్స్య సహకార సంఘాల్లో 14,676 మంది సభ్యులున్నారు. ఏటా ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేస్తున్నా ఆలస్యం కావడం, నాణ్యత లోపించడంతో లక్ష్యం నెరవేరడం లేదు.

**ప్రతి రోజూ 16 వేల మంది హాజరు**

జిల్లావ్యాప్తంగా ఉపాధిహామీ పథకంలో 1,18,948 జాబ్‌కార్డుల పరిధిలో 2,43,699 మంది కూలీలు నమోదయ్యారు. ఇందులో పురుషులు 1,19,943 మంది, మహిళలు 1,23,756 మంది. ప్రతి రోజూ సగటున 16,184 మంది కూలీలు పనులు చేస్తున్నారు.

**2,200 పని దినాల కేటాయింపు**

ఉపాధిహామీలో భాగంగా చేపల కొలనులను 25 మీటర్ల పొడవు,



15 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతుతో తవ్వుతారు. ఒక్కో కొలను నిర్మాణానికి రూ.6.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ఒక్కో దాంట్లో నాలుగు గుంతలు ఏర్పాటు చేస్తున్నారు. క్యూబిక్ మీటరుకు రూ.291.45 చొప్పున కూలీ చెల్లించనున్నారు. జిల్లాలో చేపల కొలనుల నిర్మాణానికి 2,200 పని దినాలను నిర్దేశించారు. 2024-25లో రూ.5.67 కోట్లు, 2025-26లో రూ.7.63 కోట్లు కేటాయించారు.

**మంథనిలోనే అత్యధికం**

మంథని మండలంలో 2024-25 సంవత్సరానికి 28 చేపల కొలనులు మంజూరు కాగా ఇప్పటివరకు 8 చోట్ల 90 శాతం, 7 చోట్ల 50 శాతం పనులు కాగా మిగతా 13 కొలనుల పనులు ప్రగతిలో ఉన్నాయి. 35 పంచాయతీల పరిధిలో మొత్తం 12,545 జాబ్ కార్డులుండగా 29,275 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఈ సంవత్సరం కొత్తగా కొలనులు మంజూరు కాలేదు. ఉపాధిహామీ పథకంలో జిల్లాలోనే అత్యధికంగా కూలీలు మంథని మండలంలో హాజరవుతున్నారు. సగటున 2,580 మంది పాల్గొంటున్నారు.

**బహుళ ప్రయోజనాలు**

వాన నీటిని నిల్వ చేయడానికి చేపల కొలనులు ఎంతో ఉపయోగపడతాయి. వీటితో భూగర్భ జలాలు పెరుగుతాయి. వర్షాభావ పరిస్థితుల్లో వ్యవసాయానికి అండగా ఉంటాయి. చేపల పెంపకంతో స్థానికులకు ఆదనపు ఆదాయంతో పాటు, డిమాండ్‌కు తగినట్లు మార్కెట్‌లో సరఫరా పెరుగుతుంది. కొలనులోని మట్టిని పొలాల్లో వేసుకోవడం ద్వారా భూసారం పెరగనుంది.

## రక్తకణాల విభజనతో తప్పిన తిప్పలు

గోదావరిఖని : గోదావరిఖని ప్రభుత్వ రక్తనిధి కేంద్రంలో ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్స్, ప్లాస్మా విభజన సదుపాయాలు అందుబాటులోకి రావటంతో జిల్లా వాసులకు తిప్పలు తప్పాయి. గతంలో మంచిర్యాల, కరీంనగర్ వెళ్లి ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్, ప్లాస్మా సేవలు పొందేవారు. ఔషధ నియంత్రణ శాఖ సూచనల ప్రకారం అదనపు భవన నిర్మాణంతో పాటు అవసరమైన సదుపాయాలు కల్పించడంతో ఇటీవల అనుమతులు మంజూరు చేశారు. గతనెల 12 నుంచి ప్లాస్మా, ఎర్ర రక్తకణాలు, ప్లేట్లెట్స విభజనల సదుపాయం అందుబాటులోకి వచ్చాయి.

**ఏప్రిల్ 12 నుంచి అందుబాటులోకి..**

రక్తనిధి కేంద్రంలో గతనెల 12 నుంచి ఇప్పటివరకు 80 మందికి ఎర్ర రక్తకణాల విభజన జరిగింది. ఒక్కరికి మాత్రమే ప్లేట్లెట్స విభజించి అందించారు. ప్లాస్మా విభజన జరగలేదు. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని ప్రాసెస్ చేసి ఎర్ర రక్తకణాలు మాత్రమే అవసరమైన వారికి ఎక్కిస్తున్నారు. అందులోని ప్లాస్మాను విడదీసి కేంద్రంలో నిల్వ చేస్తారు. ఇలా ప్లాస్మా ప్యాకెట్లు 60కి పైగా రక్త నిధి కేంద్రంలో నిల్వ ఉన్నాయి. అవసరమైన రక్తం గ్రూపు ప్రకారం ప్లాస్మా సరఫరా చేయనున్నారు.

**రెండు యంత్రాలు.. ఒకటే వాడుకలో..**

కణాలు, ప్లేట్లెట్స, ప్లాస్మా విభజనలో రెండు రకాల యంత్రాలు



గోదావరిఖనిలోని రక్తనిధి కేంద్రంలో అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రస్తుతం ర్యాండమ్ విభజన యంత్రం మాత్రమే వినియోగిస్తున్నారు. దీంతో దాత నుంచి సేకరించిన రక్తంలోంచి ఏకకాలంలో ప్లాస్మా, ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్స విభజన చేసి అవసరమైన వారికి అందిస్తున్నారు. దీని నిర్వహణకు కూడా నామమాత్రంగా వ్యయం కానుంది. ఎన్టీపీసీ యాజమాన్యం సామాజిక బాధ్యతగా సింగిల్ డోనర్ ప్లేట్లెట్ యంత్రాన్ని కేంద్రానికి సమకూర్చగా.. దీనితో రక్తంలోని ప్లేట్లెట్స, ఎర్ర రక్తకణాలు, ప్లాస్మా ఏదేని ఒకటి మాత్రమే ఏకకాలంలో విభజించేందుకు అవకాశం ఉంది. ఖర్చు కూడా సుమారు రూ.10వేల వరకు అవుతోంది. వర్షాకాలంలో డెంగీ లాంటి విషజ్వరాలతో రోగుల్లో ప్లేట్లెట్స తగ్గిపోతుండడంతో వాటిని ఎక్కించాల్సిన అవసరం ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో సింగిల్ డోనర్ యంత్రం వినియోగంలోకి తేవాలని భావిస్తున్నారు.

చురకలు



# ఎంఎస్ఎంఈల వ్యథ.. 'చిన్న' కథకాదు..!

అక్కిరెడ్డిపాలెం : చిన్న పరిశ్రమలే కాని.. ఆర్థిక రంగం వృద్ధికి అవే కీలకం. మారిన పరిణామాలతో గత కొన్నేళ్లుగా డీలా పడ్డాయి. గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటూ చేయూత కోసం ఎదురుచూస్తున్నాయి. విశాఖ ఆటోనగర్ అంటే గుర్తొకొచ్చేవి ఎంఎస్ఎంఈలే. ప్రారంభంలో సుమారు 1140 పరిశ్రమలకు అనుమతి ఇచ్చారు. 3200 వరకు 'ఉద్యమ్'లో రిజిస్ట్రేషన్ అయ్యాయి. వీటిలో 90శాతం సూక్ష్మ, 7శాతం చిన్న, 3శాతం మధ్య తరహా పరిశ్రమలే.

**2004 వరకు ఆటోనగర్ కళకళ:** విశాఖలో పబ్లిక్ సెక్టార్ యూనిట్లు(పీఎస్‌యూ)లు అధికంగా ఉండటంతో వాటికి అవసరమైన విడి పరికరాలను ఇవి తయారు చేసి అందించేవి. ముఖ్యంగా ఫ్యాబ్రికేషన్, ఆటోమొబైల్, స్టీల్, ప్లాస్టిక్ పరిశ్రమలు ఎక్కువగా ఏర్పాటయ్యాయి. 2004 వరకు పరిశ్రమల ఉత్పత్తి, లావాదేవీలతో ఆటోనగర్ కళకళలాడేది. 2004లో వచ్చిన వాల్యూ యాడెడ్ ట్యాక్స్(వ్యాట్) వీటిని బలహీన పర్చింది. పరిశ్రమల్లో వాణిజ్యపన్నుల శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి రూ.6500 కోట్లు కట్టాలని నోటీసులు జారీ చేశారు. దీంతో దాదాపు 2వేల పరిశ్రమల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. బకాయిలు చెల్లించలేక దాదాపు 90శాతం పరిశ్రమలు మూతపడ్డాయి. ప్రస్తుతం 1200 పరిశ్రమలు దినదినగండంగా మనుగడ సాగిస్తున్నాయి.

కొవిడ్ తరువాత నాణ్యమైన కార్మికులు లేక ఉత్పత్తి కుంటు పడింది. మరోవైపు ముడిసరకుల ధరలు, విద్యుత్తు ఛార్జీలు పెరుగుదల వాటిని మరింత దెబ్బతీసింది. ప్రభుత్వం చొరవ తీసుకుని ఆయా సమస్యలకు పరిష్కారం చూపితే ఎంఎస్ఎంలకు పూర్వ వైభవం వస్తుందని పారిశ్రామికవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలు, మహిళలు, కొత్తగా పరిశ్రమలు పెట్టేవారికి రాయితీలు, సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

**జరిమానాలు, విద్యుత్తు ఛార్జీల భారం**

రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 4.0 విధానం తెచ్చింది. 2004లో విధించిన జరిమానాల్లో కొంత రాయితీ ఇస్తే ప్రభుత్వానికి ఆదాయం రావడంతోపాటు మళ్లీ పరిశ్రమలు తెరుచుకునే అవకాశం ఉంది. నైపుణ్యం గల మానవ వనరుల కోసం శిక్షణ కేంద్రాలు నెలకొల్పాలి. మిగతా రాష్ట్రాలతో సమానంగా లేదా తక్కువగా విద్యుత్తు ఛార్జీలు ఉంటే పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చే అవకాశం ఉంది. ప్రాపర్టీ టాక్స్‌లో రాయితీ, 15కేవీ విద్యుత్తు వాడకం దాటిన వారికి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి.
పాండురంగ ప్రసాద్, వాసీ అధ్యక్షులు

**ధరలు పెరిగి ఆర్డర్లు కోల్పోతున్నాం..**

విద్యుత్తు, ముడి సరకుల ధరలు మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ అధికంగా ఉన్నాయి. ప్రభుత్వం తెచ్చిన 'జెమ్' పోర్టల్ ద్వారా అన్ని రాష్ట్రాల నుంచి ఉత్పత్తులు ఎగుమతులు అవుతున్నాయి. మన కంటే ఇతర రాష్ట్రాల పరిశ్రమల నిర్వాహకులు తక్కువ ధరకు కోట్ చేస్తుండడంతో ఆర్డర్లు కోల్పోతున్నాం. ఆటోనగర్‌పై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మంది వరకు జీవనోపాధి పొందుతున్నారు. ప్రభుత్వం చొరవ చూపి సమస్యల పరిష్కారానికి ముందుకొస్తే సూది నుంచి ఇస్రోకు అవసరమైన విడి పరికరాల వరకు తయారు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. సర్వసిద్ధి సత్య, జాతీయ ఎంఎస్ఎంఈ మాజీ సభ్యులు

# కోనేరు గట్లపై ఆక్రమణల పుట్టలు

చోడవరం : చోడవరం పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు దశాబ్దాల కిందట తవ్వించిన కోనేరులను పేదల ముసుగులో పెద్దలు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. పట్టణ పరిధిలో నాలుగు కోనేరులు ఉన్నాయి. వీటి గట్లు, గర్భాలను ఆవాస ప్రాంతాలుగా మార్చేయడంతో రూపురేఖలు కోల్పోయాయి. భూగర్భ జలాలు అడుగంటి వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తుతున్నా.. కోనేరులకు రక్షణ కల్పించడంపై పాలకులు దృష్టిసారించడం లేదు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని ఎనిమిది మండలాల్లో ఏ గ్రామానికి వెళ్లినా చెరువులు కనిపిస్తాయి. వాటిలోని నీటినే స్థానికులు వినియోగించేవారు. చెరువుల అభివృద్ధిని పాలకులు విస్మరించడం, చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారంతా వ్యర్థాలను పడేస్తుండటంతో కాలుష్య



కాసారాలుగా మారాయి. చోడవరం పట్టణంలో బానేయ్య కోనేరు, ఎర్ర కోనేరు, కోమటి కోనేరు, తామర కోనేరులున్నాయి. రక్షిత తాగునీటి పథకాలు లేని రోజుల్లో ఈ నీటినే స్థానికులు వాడే వారు. 1980 వరకు తాగునీటి అవసరాలు తీర్చాయి. ప్రస్తుతం గట్లు ఆక్రమణలకు గురై తాత్కాలిక నివాసాలతోపాటు పక్కా భవనాలు నిర్మితమయ్యాయి. నాలుగు కోనేరులు ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఉండగా.. 78 శాతం ఆక్రమణకు గురయ్యాయి. ఈ ప్రాంతాలను ఓటు కేంద్రాలుగా భావించిన ప్రజాప్రతినిధులు ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టడం లేదు. అధికారులు అడపాదడపా నోటీసులు ఇస్తున్నా.. రాజకీయ జోక్యంతో వెనకడుగు వేస్తున్నారు.

**తామర చెరువు:** తామర చెరువుగా పేరున్న ఈ ప్రాంతంలో చిన్నపాటి కోనేరు ఉంది. గట్టు పూర్తిగా అక్రమ కట్టడాలతో నిండిపోయింది. మచ్చుకైనా చెరువు కనిపించదు. పాలకేంద్రం, సామాజిక భవనాలను నిర్మించారు. చెరువును అనుకుని ఉన్న పెద్ద మురుగు కాలువను అక్రమణదారులు కబ్జా చేశారు.

**కోమటి చెరువు:** అన్నవరం దరి ఉన్న కోమటి చెరువు చుట్టూ ఆక్రమణలు పెద్దగా లేకున్నా.. ఏళ్ల తరబడి నీటిని వాడకపోవడంతో నాచు పట్టి పచ్చగా కనిపిస్తోంది. గట్టుపై ఆలయంతోపాటు ఏడు ఇళ్లను నిర్మించారు.

**ఎర్ర కోనేరు:** యడ్లవీధి ప్రజల దాహార్తిని తీర్చే ఎర్ర కోనేరుకు గతంలో కాపాలాదారు ఉండేవారు. 1981లో తాగునీటి పథకం నిర్మాణంతో కోనేరు నీటిని వాడటం మానేశారు. అప్పట్నుంచి గట్టు అక్రమణలకు గురవుతూ వచ్చింది. పక్కా భవనాలతోపాటు ఆలయాన్ని నిర్మించారు. ఇళ్లలోని వాడుక నీరంతా కోనేరులోకి చేరుతుండటంతో పరిసరాలన్నీ దుర్వాసనతో నిండాయి. **బానయ్య కోనేరు:** పట్టణ నడిబొడ్డున బీఎన్ రహదారిని ఆనుకుని ఉంది. సర్వే నంబర్ 43లో 5.149 ఎకరాల్లో ఉన్నట్లు రికార్డుల్లో నమోదై ఉంది. ప్రస్తుతం కోనేరు విస్తీర్ణం 57 సెంట్లకు పడిపోయింది. మధ్యలో బావి ఉండేది. దీన్ని చుట్టూ ప్రస్తుతం 67 మంది నివాసం ఉంటున్నారు. రహదారి పక్కన దుకాణాలు ఏర్పాటు చేసి కొందరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. మూడు సామాజిక భవనాలను నిర్మించారు.

# పేరుకే సూపర్‌స్పెషాలిటీ వైద్యశాల




అనంతపురం : ప్రభుత్వ సర్వజన వైద్యశాల, ప్రభుత్వ వైద్య కళాశాల అధికారుల మధ్య సరైన సమన్వయం కొరవడింది. ఫలితంగా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించలేని దయనీయ పరిస్థితి నెలకొంది. రాష్ట్రస్థాయి క్యాడర్‌లో ఉన్న ఒక డీఎంఈ అనంతపురంలోని సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలను పరిశీలించి పలు ఆదేశాలు జారీ చేసినా వాటిని అమలు చేయటంలో సంబంధిత అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వైద్య సేవల్లో లోటు కనిపిస్తోంది.

ఈఏడాది ఫిబ్రవరి 23న, మే 20న డైరెక్టర్ ఆఫ్‌మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) నరసింహం అనంతపురంలోని సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలను పరిశీలించారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ (అత్యవసర విభాగం)ని ఏర్పాటు చేసి ప్రారంభించాలని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెనిడిక్టాలను ఆదేశించారు. రెండో సారి వచ్చినప్పుడు ఎందుకు క్యాజువాలిటీని ప్రారంభించలేదని అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వారంలోపు క్యాజువాలిటీ ఏర్పాటు చేయాలని, లేకపోతే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీటీవీఎస్(హార్ట్‌బైపాస్‌సర్జరీ) విభాగానికి సంబంధించి హార్ట్‌లంగ్ మిషన్ అందుబాటులో లేకపోవటంతో శస్త్రచికిత్సలు చేయటం లేదని డీఎంఈ గుర్తించారు. విజయవాడ ఆసుపత్రిలో రెండు హార్ట్‌లంగ్ మిషిన్‌లున్నాయని, మీరు తనకు నివేదిస్తే వెంటనే ఒక యంత్రాన్ని బదలాయింపు చేస్తామని చెప్పారు. ఆయన ఆదేశాలను ఇక్కడి అధికారులు అమలు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. క్యాజువాలిటీ ఏర్పాటు చేయాలంటే రూ.16 లక్షలు అవసరం ఉంటుందని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీనివాసులునాయుడు అంచనాలు తయారు చేసి అధికారులకు నివేదించారు. ఆ నిధులను ప్రభుత్వ వైద్యకళాశాల నుంచి కేటాయించాలని డీఎంఈ సూచించారు.

**ఒనగూరే ప్రయోజనాలు**

అత్యవసర విభాగం (క్యాజువాల్టీ) ఏర్పాటు చేస్తే ఉమ్మడి జిల్లాలోని ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. ఆసుపత్రిలో కార్డియాలజీ, న్యూరోసర్జరీ, న్యూరాలజీ, యూరాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, నెఫ్రాలజీ, పీడియాట్రిక్ శస్త్రచికిత్సల విభాగం వంటి కీలకమైనవి అందుబాటులో ఉన్నాయి. క్యాజువాల్టీ లేకపోవటంతో బాధితులను సర్వజన వైద్యశాలకు తరలించి అక్కడ వైద్యులు పరిశీలించి చికిత్సలు అందిస్తున్నారు. వైద్యుల సూచన మేరకు రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సూపర్‌స్పెషాల్టీ వైద్యశాలకు తరలించి సేవలు అందిస్తున్నారు. ఇక్కడే క్యాజువాల్టీ ఉంటే అన్ని రకాల సేవలు అందించడానికి అవకాశం ఉంటుంది.

**డీఎంఈకి నివేదించాం: వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల**సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో క్యాజువాల్టీ ఏర్పాటు చేయాలని డీఎంఈ ఆదేశించిన మాట వాస్తవమే. నిధులను వైద్యకళాశాల నుంచి కేటాయించాలని ఆదేశించారు. తాము ఏపీఎంఎస్ఐడీసీ అధికారుల అందజేసిన అంచనా ప్రతులతో పాటు నిధులు విడుదల చేయాలని ప్రిన్సిపల్‌కు లేఖ రాశాం. డీఎంఈ నుంచి వారికి ఉత్తర్వులు రాలేదని, అందుకే నిధులు విడుదల చేయటం లేదని చెప్పారు. ఈవిషయాన్ని డీఎంఈకి నివేదించాం. త్వరలోనే క్యాజువాల్టీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

# అడ్డగోలు నిర్ణయాలు.. పరిశోధనలకు అవరోధాలు



విశాఖపట్నం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని పరిశోధన అభివృద్ధి విభాగంలో నిర్ణయాలు ఇష్టారాజ్యంగా తీసుకుంటున్నారు. ఫలితంగా పరిశోధనలకు తూట్లు పొడుస్తున్నారు. నిబంధనలు ఉన్నఫళంగా మార్చేస్తున్నారు. ఆర్ఏసీ సమావేశంలో కొందరు సభ్యులు వ్యతిరేకించినా, మిలిగిన వారు ఒక వర్గంగా ఏర్పడి మెజార్టీ సభ్యుల ముసుగులో తమకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వేల రూపాయల ఫీజు చెల్లించిన పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ చేయడానికి అవకాశాలు కల్పించడం లేదు. కొందరు పరిశోధక పర్యవేక్షకులు కాసులకు కక్కుర్తి పడి అడ్డదారులు వెతుకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పీహెచ్‌డీ అభ్యర్థుల నుంచి కొందరు రూ.లక్షలు తీసుకొని పరిశోధనకు సహకరిస్తున్నారని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ చేయడానికి డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో జంతుశాస్త్ర విభాగంలోని పీహెచ్‌డీ అభ్యర్థికి ఏదైనా డిగ్రీ కళాశాలల్లోని అదే విభాగానికి చెందిన అధ్యాపకులను పర్యవేక్షకునిగా నియమించవచ్చు. కానీ వర్సిటీలోనే మరో సైన్స్ విభాగంలో పరిశోధనలు నిర్వహించాలని నిర్ణయించడం దారుణం. ఎంఫిల్ నుంచి పీహెచ్‌డీ కన్వర్షన్ కోసం నెల రోజుల్లో అనుమతికి లేఖ ఇవ్వాలి. తమకు అనుకూలమైన వారు ఆలస్యంగా లేఖ ఇచ్చినా అనుమతించినట్లు తెలుస్తోంది. ఇలాంటి అడ్డగోలు వ్యవహారాలు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో ఎన్నో జరుగుతున్నాయని విశ్వసనీయ సమాచారం.

'లైబ్రరీసైన్స్ విభాగానికి చెందిన ఓ పరిశోధక విద్యార్థిని 2019లో ఎంఫిల్ పూర్తి చేసింది. నెల రోజుల్లో పీహెచ్‌డీ కోసం కన్వర్షన్ లేఖ సమర్పించాలి. ఆమె వ్యక్తిగత కారణాలతో లేఖను ఆలస్యంగా సమర్పించింది. కానీ మరో ఎంఫిల్ అభ్యర్థి 2014లో పూర్తి చేశాడు. ఆయనకు పీహెచ్‌డీ చేయడానికి అనుమతించారు. తమకు అనుకూలమైన వారికి పరిశోధనలకు అనుమతి ఇస్తున్నారని సంబంధిత అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.'

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగంలో ఓ ఆచార్యులు పదవి విరమణ చేశారు. ఆయన పర్యవేక్షణలో పరిశోధక విద్యార్థులున్నారు. పదవి విరమణ, ఇతర వ్యక్తిగత కారణాల వల్ల ఓ విద్యార్థికి పరిశోధన అంశాలపై పర్యవేక్షణ నిర్వహించలేదని సదరు ఆచార్యులు లేఖ ఇచ్చారు. దీంతో ఆ విద్యార్థి తన పరిశోధనకు ఆచార్యున్ని లేదా అధ్యాపకున్ని కేటాయించాలని అధికారులకు విన్నవించాడు. ఆ లేఖపై ఆర్ఏసీ బృందం చర్చించింది. జంతుశాస్త్ర విభాగంలోని పరిశోధక విద్యార్థికి సంబంధిత విభాగానికి చెందిన అధ్యాపకున్ని కాకుండా బయోకెమిస్ట్రీ విభాగానికి మార్చారు. ఇలా చేయడం ఎంతవరకూ సమంజసమని వర్సిటీలో విమర్శలు వెలువెత్తాయి.

**నిబంధనల ప్రకారం నిర్ణయాలు: ఆచార్య శోభాలత, పరిశోధన, అభివృద్ధి విభాగం, ఎస్కేయూ**ఎంఫిల్ పూర్తి చేసిన వారు నెలరోజుల్లో పీహెచ్‌డీ కన్వర్షన్ కోసం లేఖ సమర్పించాలి. నిర్ణీత గడువులోపు సమర్పించకపోతే తిరస్కరించి ఉంటాం. జంతుశాస్త్ర విభాగంలోని పీహెచ్‌డీ అభ్యర్థి గైడ్ కేటాయింపు ఆర్ఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకొన్నారు. నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకుంటున్నాం.

# పర్యాటకశాఖ కుంభకర్ణుడి నిద్ర



పెనుకొండ : అత్యంత వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చారిత్రక నగరం పెనుకొండను పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో 2002లో రూ.35 లక్షల వ్యయంతో కుంభకర్ణ ప్రాజెక్టు నిర్మించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో విగ్రహం కాలక్రమేణా శిథిలావస్థకు చేరింది. ప్రాజెక్టు నిర్వహణ పర్యాటకశాఖకు భారంగా మారడంతో పదేళ్ల కిందట అద్దెకిచ్చి చేతులు దులుపుకొన్నారు. అద్దెకు తీసుకున్న వారు లాభాపేక్షతో నిర్వహణ గాలికొదిలేయడంతో విగ్రహం నెర్రలు చీలి పోయింది. అనేక విగ్రహాలు శిథిలమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి పర్యాటకులు వస్తున్నా ఈ ప్రాజెక్టు వద్ద రాత్రిళ్లు మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. హోటల్ నిర్వాహకులు సైతం మద్యం తాగించేందుకు అనుమతించడం పట్ల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న పర్యాటక కేంద్రం పట్ల అధికారులు చొరవ చూపాల్సి ఉంది.

**20 ఏళ్లుగా రంగులు వేయించలేదు**

పడుకున్న కుంభకర్ణుడి విగ్రహం, చుట్టూ నిద్ర లేపుతున్న భటుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. 20 ఏళ్లలో కనీసం రంగులు కూడా మార్చకపోవడం శోచనీయం. ప్రాజెక్టులో నిర్మించిన ట్యాంకు చుట్టూ ఆకట్టుకునే విధంగా భారీ కూజా ఆకారంలో నిర్మించారు. అది కూడా శిథిలమైంది.

**పరిశీలించి చర్యలు చేపడతాం: నరసయ్య, పీడీ, డ్వామా, పర్యాటకశాఖ, జిల్లా ఇన్‌ఛార్జి**

కుంభకర్ణ ప్రాజెక్టు అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరవ్వగానే పనులు ప్రారంభిస్తాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తాం.

# అటవీ ఉత్పత్తులకు అందలం

చింతపల్లి : అటవీ ఉత్పత్తులకు అల్లూరి జిల్లా పెట్టింది పేరు. ప్రకృతి వైపరీత్యాలతో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నా గిరిజనులంతా ప్రత్యామ్నాయంగా అటవీ ఉత్పత్తులపైనే అధిక శాతం ఆధారపడే వారు. కాలానుగుణంగా అడవుల్లో సహజసిద్ధంగా లభించే చింతపండు, శీకాయ, అడవి తేనె, కరక్కాయలు, నల్లజీడి పిక్కలు, నరమామిడిచెక్క, కోవెల జిగురు, ఉసిరికాయలు ఇలా.. సుమారు 30 రకాల వరకు అటవీ ఉత్పత్తులను గిరిజనులు సేకరించి జీసీసీకి, వ్యాపారులకు విక్రయించేవారు. కొన్నేళ్లుగా ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు గిరిజనులెవరూ అటవీ ఉత్పత్తులపై ఆధారపడటం లేదు. వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుతోపాటు ఉపాధి పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఫలితంగా అటవీ ఉత్పత్తుల సేకరణ తగ్గింది. ఈ పరిస్థితిని నివారించి అటవీ ఉత్పత్తుల సేకరణ, లక్ష్యాలను పెంచాలని జీసీసీ ఎండీ కల్పనాకుమారి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని రకాల అటవీ ఉత్పత్తులపై జీసీసీకి గుత్యాధిపత్యం ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ఇటీవల ప్రకటించారు. ఇది అమలైతే గిరిజన సహకార సంస్థకు అటవీ ఉత్పత్తులపై పూర్తిస్థాయి అధికారాలు, హక్కులు సంక్రమిస్తాయి.

**తేనెలూరడం లేదు...** ఒకప్పుడు గిరిజన సహకార సంస్థ మొత్తం వ్యాపారంలో 30 శాతం వాటా తేనెపైనే ఆధారపడి ఉండేది. చిత్తూరు,



రాజమహేంద్రవరం కేంద్రాలుగా శుద్ధి చేసి వాటిని రిటైల్ మార్కెట్లో గిరిజన హనీ పేరుతో జీసీసీ విక్రయిస్తోంది. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో ఒకప్పుడు 500 నుంచి వెయ్యి టన్నుల వరకు తేనె దిగుబడులు వచ్చేవి. ఇప్పుడు 70 క్వింటాళ్లకు మించి రావడం లేదు.

**అడ్డాకులకు గడ్డుకాలం..**

అడ్డాకులకు మన్యంలో గడ్డుకాలం దాపురించింది. పోడు వ్యవసాయం వల్ల అడ్డాకుల దిగుబడి తగ్గింది. కొండ చీపుర్లకు చిరునామాగా గాలికొండ ఉండేది. ఇప్పటికీ గాలికొండ చీపుర్లకు గిరాకీ ఉంది. మొదట్లో ఈ చీపురు ధర రూ.5 నుంచి రూ.15 వరకు ఉండేది. కాలక్రమంలో కొరత ఏర్పడటంతో స్థానికంగానే ఒక్కో చీపురు ధర రూ.100 వరకు పలుకుతోంది. అంతరించిపోతున్న అటవీ ఉత్పత్తుల జాబితాలో నరమామిడి, కోవెల వనాలున్నాయి. జిగురు, చెక్క సేకరణ విధానాలు తెలియక ఈ వనాలు అంతరించిపోతున్నాయి.

**కాఫీ, మిరియాల సాగే అధికం**

అల్లూరి జిల్లాకు కాఫీ, మిరియాలు అతిథి పంటలుగా వచ్చాయి. మన్యంలో కాఫీ 2.25 లక్షల ఎకరాల్లో ప్రధాన పంటగా సాగవుతోంది. ఇందులో మిరియాలు 70 వేల ఎకరాల్లో అంతరపంటగా సాగవుతున్నాయి. వీటి సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతుండగా, అటవీ ఉత్పత్తులు క్రమేణా కనుమరుగవుతున్నాయి. అడవి తేనె, అడ్డాకులు, కోవెలజిగురు, కొండచీపుర్లు, ఉసిరికాయల జాడ కనిపించకుండా పోతోంది.

**లాభాల ఉ'సిరి'**

అడవుల్లో సహజసిద్ధంగా లభించే ఉసిరికాయలు ఒకప్పుడు నేలపాలయ్యేవి. వీటిని వ్యాపారులు మొదట్లో కేజీ రూ.5కు కొనుగోలు చేసి మైదాన ప్రాంతాల్లో విక్రయించే వారు. తదనంతర కాలంలో జీసీసీ ఎండిన ఉసిరి పప్పునకు అనూహ్యంగా ధర పెంచింది. కేజీ రూ.90 వరకు కొనుగోలు చేస్తోంది. మంచి ధర పలకడంతో ఉసిరికి డిమాండ్ పెరిగింది. ఎక్కువగా సేకరించాలన్న తాపత్రయంతో గిరిజనులు అడవుల్లో ఉసిరి చెట్ల కొమ్మలను నరికేయడంతో వీటి దిగుబడి క్రమేణా తగ్గిపోయింది.

**వృక్ష సంపదకు కాపాడాలి..** అంతరించిపోతున్న వృక్ష సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. కోవెల, నరమామిడి, ఉసిరి వనాలను అటవీ శాఖ ద్వారా నర్సరీలను అభివృద్ధి చేయాలి. జిగురు, తేనె, చెక్క సేకరణల్లో శాస్త్రీయ విధానాలపై గిరిజనులకు శిక్షణ ఇవ్వాలి. తేనె దిగుబడుల పెంపు దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలి. ఇందుకోసం పెట్టె తేనె అభివృద్ధిని ప్రోత్సహించాలి.
వెంకటేష్, జీసీసీ డివిజనల్ మేనేజరు

# నత్తకు నడక నేర్పేలా

అనకాపల్లి : లక్ష్మీదేవిపేటలో రైల్వే లైన్‌పై వంతెన నిర్మాణం అసంపూర్తిగా నిలిచి 15 ఏళ్లవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పనులు చేపట్టాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున వంతెన నిర్మాణానికి భూసేకరణ చేపట్టి పరిహారం అందించాల్సి ఉంది. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న కొణతాల రామకృష్ణ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అప్పట్లో రూ.12 కోట్లతో టెండర్లు పిలిచారు. 2014లో ఎంపీ హోదాలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు రైల్వే, ఆర్అండ్‌బీ అధికారులతో చర్చించి వంతెన నిర్మాణానికి రూట్ మ్యాప్ సిద్ధం చేయించారు. రైల్వే శాఖ తన పరిధిలో ఉన్న 150 మీటర్ల దూరం నిర్మాణ పనులకు సంబంధించి రూ.12 కోట్లు విడుదల చేసింది. రైల్వే పరిధిలో 90 శాతం పనులు



పూర్తయ్యాయి. వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి భీమునిగుమ్మం వరకు 2 కి.మీ. దూరం వంతెన నిర్మాణానికి నాటి ప్రభుత్వం రూ.53.8 కోట్లు మంజూరు చేసింది. 2018 డిసెంబరు 6న పైవంతెన నిర్మాణానికి మరోసారి శిలాఫలకం ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. 2019లో సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. నాటి నుంచి ఇప్పటివరకు అతీగతి లేదు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న కొణతాల రామకృష్ణఎంపీ సీఎం రమేశ్ చొరవ చూపి వంతెన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

# 55 ఏళ్ల ప్రాజెక్టు ప్రశ్నార్థకం!

తిరుపతి : తిరుపతిలోని అఖిల భారత పందుల పరిశోధన స్థానం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వైకాపా పాలనలో పరిశోధనలపై జరిగిన నిర్లక్ష్యాన్ని గుర్తించిన ఐసీఏఆర్ ఏదాది కిందట నిధులు నిలిపివేస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. అసలే ఆర్థికంగా కుదేలైన పశువైద్య వర్సిటీకి ఈ పరిశోధనా స్థానం నిర్వహణ అదనపు భారంగా పరిణమించింది. భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) దేశవ్యాప్తంగా పందుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు అఖిలభారత స్థాయిలో పరిశోధనా ప్రాజెక్టుల్ని 1970లో మంజూరు చేసింది. ఆ మేరకు 1971లో స్థానిక పశువైద్య కళాశాల ఆవరణలో పందుల పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించారు. యూకేకు చెందిన లార్జ్ వైట్ యార్క్‌షైర్ అనే తెల్లజాతి పందితో స్థానిక పందులను సంకరపరిచారు. ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో పోషణ, మేలుజాతి పందుల ఉత్పత్తి, దేశవాళీ జాతుల పరిరక్షణ వంటి అనేక అంశాల్లో ప్రగతి సాధించారు. తిరుపతి-17 జాతిని సైతం ఆవిష్కరించారు. ఏటా ఐసీఏఆర్ నుంచి రూ.30 లక్షల వరకు నిధులు అందడంతో పెద్ద నిర్వహణ, దాణా,



పరిశోధనలు, సిబ్బంది జీతభత్యాలకు ఎటువంటి ఢోకా ఉండేది కాదు. ప్రస్తుతం పరిశోధనా స్థానంలో 150 వరకు పందులు ఉండగా వాటికి అవసరమైన దాణా, సిబ్బంది జీతభత్యాలకు రూ.11 లక్షల వరకు విశ్వవిద్యాలయం భరిస్తోంది.

**ఏటా రూ.15 లక్షల వరకు ఆదాయం:** ఏటా 500 వరకు సంకరజాతి పిల్లల్ని ఔత్సాహిక రైతులకు విక్రయించేవారు. ఇలా కేంద్రానికి ఏటా రూ.15 లక్షల వరకు ఆదాయం వచ్చేది. వెయ్యిమంది వరకు ఔత్సాహికులకు పందుల పెంపకంలో శిక్షణ ఇచ్చేవారు. తిరుపతి, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఈ ప్రాజెక్టులు ఉండగా తిరుపతికి మాత్రమే నిధులు ఆపడం గమనార్హం. వైకాపా హయాంలో వర్సిటీ అధికారులు ప్రాజెక్టు ఫలితాలపై దృష్టి సారించకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురైనట్లు ఆరోపణలున్నాయి. ప్రాజెక్టుల జాబితా నుంచి తిరుపతి పేరు ఇంకా తొలగించలేదని, త్వరలో నిధులు సాధిస్తామని పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త కళ్యాణ చక్రవర్తి తెలిపారు.

# 'ఐదేళ్లు'.. గుండెల్లో గుబులు!

విశాఖపట్నం : వైద్యుల బదిలీలకు సంబంధించి... ఐదేళ్లు ఒకే చోట సర్వీసు పూర్తి చేసుకున్న వారికి స్థానచలనం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేసింది. ఈనెల 17వ తేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తవనుంది.

**ఏఎంసీ పరిధిలో... :** కొత్త నిబంధన ప్రకారం.. ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ) పరిధిలో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న వైద్యులు 59 మంది వరకు ఉన్నట్టు లెక్క కట్టారు. వారిలో 15 మంది ప్రొఫెసర్లు, 9 మంది సహ ప్రొఫెసర్లు, 35 మంది సహాయ ప్రొఫెసర్లు ఉన్నారు. ఏఎంసీ పరిధిలో కేజీహెచ్‌తో సహా ఏడు ఆసుపత్రులు ఉన్నాయి. ఆయా ఆసుపత్రుల్లో పని చేస్తున్న వైద్యుల సర్వీసును బట్టి, బదిలీలకు అర్హులుగా నిర్ణయించారు.

**ఓ ప్రొఫెసర్..** భిన్నవాదనలు: మెడిసిన్ విభాగంలో ఏళ్ల నుంచి ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఓ వైద్యుడి విషయంలో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆ వైద్యుడు కొవిడ్ సమయంలో దాదాపు ఏడాదిన్నర పాటు విజయవాడలో సేవలు అందించారు. నాటి ప్రభుత్వం దాన్ని బదిలీగా పరిగణించి, 2023లో జీఓ ఇచ్చింది. అయితే కేజీహెచ్‌లో వేతనం తీసుకుని, విజయవాడలో పని చేసినంత మాత్రాన.. అది బదిలీ కిందకు రాదని, కేవలం డిప్యుటేషనే అవుతుందని మిగిలిన వైద్యులు చెబుతున్నారు. ఇప్పుడు ఆయన బదిలీకి అర్హుడే అని వారు వాదిస్తున్నారు. కానీ, ప్రభుత్వం జీఓ జారీ చేసినందుకు ఆయన పని చేసిన కాలాన్ని డిప్యుటేషన్‌గా పరిగణించలేమని, అది బదిలీ కిందకే వస్తుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆ మేరకు ఆయన 2023 నుంచి ఏఎంసీ పరిధిలో కొనసాగుతున్నట్టు తేల్చి, బదిలీల జాబితాలో పేరు చేర్చలేదు.

**ఉరుకులు.. పరుగులు..**

బదిలీకి అవకాశం ఉన్న వైద్యులంతా ఇప్పుడు ప్రజా ప్రతినిధుల వద్దకు పరుగులు తీస్తున్నారు. తమను ఏదో విధంగా ఏఎంసీకి అనుబంధంగా ఉండే కేజీహెచ్, ఇతర ఆసుపత్రుల్లో కొనసాగించేలా చూడాలని విన్నవిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం బదిలీల విషయంలో ఎలాంటి మినహాయింపు ఇవ్వరాదని, జీఓ ప్రకారం బదిలీ చేయాల్సిందేనని తేల్చి చెబుతోంది. భార్యాభర్తలు ఒకే చోట పని చేస్తున్నా, దివ్యాంగులైనా, అనారోగ్య కారణాలతో బాధపడుతున్నా... అలాంటి వారికి కాస్త వెసులుబాటు ఇస్తున్నారు.

# బెత్త విత్తనాల పట్టివేత!

నర్సీపట్నం : తేదీలేని కాంపౌండింగ్ ఫండ్ రసీదుతో వ్యాన్‌లో తరలిస్తున్న బెత్త (రట్టన్) విత్తనాలను అటవీ అధికారులు గొలుగొండ మండలం చీడిగుమ్మల సమీపంలోని చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నారు. కొయ్యూరు మండలం అన్నవరం, కన్నవరం, నల్లబిల్లి, పెద అగ్రహారం, చీడిపల్లి గ్రామాల్లో సేకరించిన ఈ విత్తనాలను ఎస్.రాయవరం మండలం చినగుమ్ములూరుకు తీసుకు వెళ్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. బెత్త పిక్కలను మెడలో ధరించే



పూసలుగా తయారు చేసి విక్రయిస్తుంటామని నిందితులు అధికారులకు వివరించారు. ఈ విత్తనాలను మొక్కలుగా పెంచి ఒడిశాకు తరలిస్తుంటారని సమాచారం. ఈ చెట్ల నుంచి వచ్చే కలప ఎంతో నాణ్యమైందిగా చెబుతున్నారు. లాఠీలు, కేన్ ఫర్నీచర్ మాదిరి గృహోపకరణాలు తయారు చేయవచ్చుని, కొన్ని రకాల ఔషధాల్లోనూ వినియోగిస్తారని సమాచారం. పట్టుబడిన విత్తనాల విలువ రూ.40 వేల వరకు ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా. తేదీ లేకుండా పట్టుబడిన రసీదు అల్లూరి జిల్లాలోని ఓ రేంజ్ అధికారి పేరున ఉంది. కావాలని తేదీ వేయలేదా... ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అన్నది విచారణలో తేలాల్సి ఉంది. రాత్రి ఈ విత్తనాలు పట్టుబడగా, వ్యాన్‌ను నర్సీపట్నం కలప డిపోకు తరలించి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు రేంజ్ అధికారి లక్ష్మీనర్స్ వెల్లడించారు.

# చెరువును చెరబట్టారు!



అనంతపురం : ఆవు చేనులో మేస్తే దూడ గట్టున మేస్తుందనే సామెత ధర్మవరం వైకాపా నాయకులకు సరిగ్గా సరిపోతుంది. భూ కబ్జాలు, చెరువుల ఆక్రమణలో తమ నాయకుడు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి తామేం తక్కువ కాదని నిరూపిస్తున్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న కేతిరెడ్డి ధర్మవరానికి అవతలివైపు ఉన్న ఎర్రగుట్టతో పాటు చెరువును ఆక్రమించి విలాసవంతమైన ఫాంహౌస్ నిర్మించుకున్న విషయం తెలిసిందే. ఆయన్ను ఆదర్శంగా తీసుకున్న స్థానిక వైకాపా నాయకులు కొందరు పట్టణానికి ఆనుకొని ఉన్న చెరువును చెరబట్టారు. భవన నిర్మాణ వ్యర్థాలతో కొద్దికొద్దిగా పూడ్చుకుంటూ ఆక్రమిస్తున్నారు. కొన్నిచోట్ల భూమిని ఇళ్ల స్థలాలుగా మార్చేసి అమ్మేయగా.. మరికొన్ని చోట్ల ఏకంగా వాణిజ్య భవనాలు, బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. కళ్ల ముందే చెరువు కబ్జాకు గురవుతున్నా జలవనరులశాఖ అధికారులు మొద్దునిద్ర నటిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

**అధికారం అండతో..**

గతంలో వైకాపాలో కీలకంగా వ్యవహరించిన ఓ కౌన్సిలర్ భర్త భాజపాలో చేరి మున్సిపాలిటీని తన గుప్పిట్లో పెట్టుకున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని చెరువును మరింత చెరబడుతున్నారు. గతంలో కబ్జా చేసిన భూముల్లో భవనాలు నిర్మించుకునేందుకు సహకరిస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులను అటువైపు వెళ్లకుండా చూసుకుంటున్నారు. దీంతో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. చెరువు ఆక్రమణలపై గతంలోనే జలవనరులశాఖకు ఫిర్యాదులు అందాయి. విచారణ జరిపి 16 ఎకరాలు కబ్జాకు గురైనట్లు తేల్చారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమైనా రాజకీయ ఒత్తిళ్లతో వెనక్కి తగ్గారు. చెరువు ఆక్రమణలపై ఇరిగేషన్ డీఈ మహేశ్వరరెడ్డి వివరణ కోరగా.. కబ్జాలపై ఫిర్యాదులు ఉన్నాయి. త్వరలోనే బాధ్యులందరికీ నోటీసులు జారీ చేస్తాం. రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఇళ్ల పట్టాలు చెల్లవని స్పష్టం చేశారు.

**ఇళ్ల స్థలాలుగా మార్చి విక్రయం**

ధర్మవరానికి ఆనుకొని 661 సర్వే నంబరులో 1922 ఎకరాల్లో చిక్కవడియార్ చెరువు విస్తరించి ఉంది. దీని కింద రైతులు 2 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. పట్టణానికి ఆనుకుని ఉండటంతో ముందునుంచీ ఆక్రమణకు గురవుతూ వస్తోంది. గడిచిన ఐదేళ్లలో సుమారు 20 ఎకరాలకుపైగా కబ్జా చేశారు. ముఖ్యంగా వైకాపా కౌన్సిలర్లు అప్పట్లో రెవెన్యూ అధికారులను అడ్డు పెట్టుకొని చెరువు భూమికి నకిలీ ఇళ్ల పట్టాలు సృష్టించారు. సెంటు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అమ్మేశారు. జలవనరులశాఖ అధికారులు నోటీసులు ఇస్తే వాటిని అడ్డుగా చూపి తప్పించుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# పుస్తకాలు వచ్చేశాయ్!






పుట్టపర్తి : పాఠశాలల పునఃప్రారంభ సమయం దగ్గరపడింది. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తుగానే విద్యార్థులకు పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించేలా విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది. శ్రీసత్యసాయి జిల్లాలో 2,062 ప్రభుత్వ పాఠశాలలుండగా 1,36,933 మంది విద్యార్థులున్నారు. వీరికి పంచేందుకు సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో కిట్లు వచ్చేస్తున్నాయి. పాఠశాలలు తెరిచే నాటికి బ్యాగులు, దుస్తులు, బూట్లు, బెల్టులతో కూడిన కిట్లు విద్యార్థుల చేతిలో ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే పాఠ్యపుస్తకాలు, నిఘంటువులు, రాత పుస్తకాలు వచ్చేశాయి. బ్యాగులు, బూట్లు, బెల్టులు, ఏకరూప దుస్తులు సగం వచ్చేశాయి. ఈ నెలాఖరుకు అన్నీ రాగానే పంపిణీ ఆరంభిస్తారు.

**మండల కేంద్రాలకు చేరాయ్..**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పాఠ్య పుస్తకాలు చాలా ఆలస్యంగా పాఠశాలలకు వచ్చాయి. కొన్ని పుస్తకాల పంపిణీ ఊసేలేక విద్యార్థులు బయట కొనుక్కోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. కూటమి ప్రభుత్వం వేసవి సెలవుల్లోనే పాఠ్యపుస్తకాలు మండల కేంద్రాలకు చేరుస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 32 మండలాలోని 2,062 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు 5,53,317 పాఠ్యపుస్తకాలు, 1,19,037 వర్క్ బుక్కులు అవసరం కాగా.. ఇప్పటికే వంద శాతం పుస్తకాలు మండల కేంద్రాలకు చేరాయి.

**తగ్గనున్న సంచి బరువు..**

విద్యార్థుల పుస్తకాల బ్యాగు బరువు తగ్గించేలా విద్యాశాఖ ఈ ఏడాది అడుగులు వేసింది. ఏడాదికి రెండు సెమిస్టర్ల విధానానికి నాంది పలికింది. ఒకటి నుంచి పదో తరగతి వరకూ సెమిస్టర్ విధానంలోనే పాఠ్యపుస్తకాలు రూపొందించారు. అక్టోబరులో రెండో సెమిస్టర్ పుస్తకాలు అందిస్తారు. ఈ విధానం వల్ల పుస్తకాల సంచి బరువు భారీగా తగ్గనుంది. 1, 2 తరగతులు.. సెమిస్టర్‌కు రెండేసి పుస్తకాలుంటాయి. తెలుగు, ఆంగ్లం, గణితం కలిపి ఒకటి. మరొకటి వర్క్‌బుక్ ఉంటుంది. 3, 4, 5 తరగతులు.. తెలుగు, ఆంగ్లం కలిపి ఒకటి. గణితం, పరిసరాల విజ్ఞానం కలిపి మరొకటి ఉంటుంది. నీ 6, 7, 8, 9 తరగతులు.. తెలుగు, ఆంగ్లం, హిందీ కలిపి ఒకటి, జీవ, భౌతిక, రసాయన శాస్త్రాలను కలిపి ఒకటి, సాంఘికశాస్త్రంలో భౌగోళిక, చరిత్ర, ఆర్థిక, పౌరశాస్త్రాలు కలిపి ఒకటిగా ముద్రించారు. 10వ తరగతికి సెమిస్టర్ విధానం మేరకు పుస్తకాలు రూపకల్పన చేశారు.

**నిఘంటువులు సిద్ధం: క్రిష్టప్ప, డీఈఓ, పుట్టపర్తి**

విద్యామిత్ర కిట్లలో ఆరో తరగతి విద్యార్థులకు నిఘంటువులు ఇవ్వనున్నాం. 13,761వ మందికి ఇవ్వాల్సిన నిఘంటువులు, 82,22,660 రాత పుస్తకాలు ఇప్పటికే వచ్చేశాయి. 1,36,933 బ్యాగులు, 1,35,692 బూట్లు, 95,650 బెల్టులు, 1,36,933 ఏకరూప దుస్తుల్లో 50 శాతం వచ్చాయి. మిగిలినవి త్వరలో వస్తాయి.

# డీసీఎంఎస్‌కు శుభగడియలు



అనంతపురం : కమీషన్లకు కక్కుర్తిపడి పాలకవర్గం చేసిన ఓ తప్పు ఆ సొసైటీని దాదాపు 18 ఏళ్లు వెంటాడింది. అప్పటి వరకు లాభాల్లో ఉన్న సొసైటీ ఒక్కసారిగా నష్టాల ఊబిలో కూరుకుపోయింది. ఈ ఊబి నుంచి గట్టెక్కడానికి రెండు దశాబ్దాలు పట్టింది. ఈ ఏడాది ఊహించని విధంగా నష్టాల నుంచి లాభాల బాట పట్టింది. పాలకవర్గాలు చేసిన తప్పిదాలు, అవకతవకల వల్లే సొసైటీలు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాయని చెప్పడానికి ఇదో ప్రబల ఉదాహరణ. పాలకవర్గ సభ్యుల స్వార్థం, అవినీతి, వివేకహీనమైన నిర్ణయాల వల్లే సహకార సంఘాలన్నీ నష్టాల దిశగా పరుగులు పెడుతున్నాయి. దాదాపు రెండు దశాబ్దాల క్రితం తీసుకున్న ఒక నిర్ణయమే జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి శాపమైంది. దాని కథాకమామీషు ఏమిటో ఒకసారి తరచి చూద్దాం.

**అధికారుల పరిపాలనతోనే లాభాల బాట**

గతేడాది నుంచి సహకార బ్యాంకులు, సొసైటీల బాధ్యతలు అధికారులు తీసుకున్నారు. అధికారులు తీసుకున్న మంచి నిర్ణయాల వల్ల సొసైటీ నష్టాల నుంచి లాభాలబాట పట్టింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 24.71 కోట్ల ఎరువుల వ్యాపారం చేయడంతో డీసీఎంఎస్‌కు మంచి లాభాలు వచ్చాయి. దాదాపు రూ. 30 లక్షల నష్టాన్ని పూడ్చి నికరలాభం రూ.4 లక్షలు వచ్చింది. ఇది ఊహించని పరిణామమే. ప్రతి నెలా రూ. 7.5 లక్షలు ఉద్యోగులకు జీతాలు సొసైటీ చెల్లిస్తుంది. అయితే అద్దెల ద్వారా సొసైటీకి రూ. 9.5 లక్షల ఆదాయం వస్తుంది. వ్యాపారం ద్వారా ఆశించిన లాభాలు రావడంతో నష్టాలు పూడిపోయాయి. ఈసారి దాదాపు రూ. 40 లక్షల వరకు లాభం వచ్చింది. అన్ని ఖర్చులు పోను రూ.4 లక్షల నికర లాభం రావడంతో ఉద్యోగులు ఊపిరిపీల్చుకున్నారు. గతంలో ప్రైవేట్ ఆడిట్ చేయడం వల్ల సొసైటీకి కొంత నష్టం కలిగింది. ఈసారి సహకార శాఖ ద్వారానే ఆడిట్ చేయించారు. కూటమి ప్రభుత్వం మళ్లీ పాలకవర్గాలను నియమించింది. సొసైటీలో ఉన్న అవకతవకలను సరిచేసి ఆదాయం పెంచే నిర్ణయాలు తీసుకుంటే పదికాలాల పాటు మనుగడలో ఉంటుంది.

**కెపాసిటర్ల కుంభకోణమే అసలు కారణం**

జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ద్వారా అనేక వ్యాపారాలు నిర్వహిస్తారు. వినియోగదారులకు, రైతులకు సరసమైన ధరలకు నాణ్యమైన వస్తువులు విక్రయించడమే డీసీఎంఎస్ ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్తు ఆదా చేయాలన్న ఆశయంతో ప్రతిరైతు విద్యుత్తు పంపుసెట్టుకు ఒక కెపాసిటరు అమర్చాలని నిర్ణయించారు. అప్పట్లో కలెక్టర్ కూడా ఆదేశాలు జారీ చేయడంతో డీసీఎంఎస్ ముందుకొచ్చింది. కెపాసిటర్లు విద్యుత్తు పరికరాల ఉత్పత్తి సంస్థలతో కొనుగోలు చేసి రైతులకు నేరుగా అందిస్తామని అప్పటి పాలకవర్గ సభ్యులు హామీ ఇచ్చారు. ఒకేసారి దాదాపు రూ. 1.5 కోట్ల విలువైన కెపాసిటర్లు కొనుగోలు చేసి భారీ ఎత్తున కమీషన్లు తీసుకున్నారు. అప్పట్లో 'ఈనాడు'లో వరుస కథనాలు రావడంతో డీసీఎంఎస్ అధ్యక్షుడిగా ఉన్న రామిరెడ్డి రాజీనామా చేశారు. తర్వాత కెపాసిటర్లు డ్వాక్రా సంఘాలకు విక్రయించే బాధ్యతలు అప్పగించారు. కెపాసిటర్లు విక్రయించిన డ్వాక్రా సంఘాలు ఈ సొమ్ములను డీసీఎంఎస్‌కు వెనక్కి చెల్లించలేదు. దీంతో డీసీఎంఎస్‌కు ఒక్కసారిగా రూ.కోటి నష్టం వచ్చింది. ఆ తర్వాత వ్యాపారాలు తగ్గడం వల్ల సొసైటీకి కోలుకోలేని దెబ్బతగిలింది. తర్వాత వచ్చిన పాలకవర్గాలు కూడా పెద్దగా పట్టించుకోకపోవడం వల్ల నష్టాల నుంచి గట్టెక్కలేకపోయింది.

**ఆదాయం పెంచే మార్గాలు అన్వేషిస్తున్నాం**

దాదాపు 18 ఏళ్ల తర్వాత సొసైటీ నష్టాల నుంచి లాభాల్లోకి చేరడం చాలా సంతోషంగా ఉంది. గతంలో కెపాసిటర్లు కొనుగోలు చేయడం వల్ల భారీగా నష్టాలు చవిచూశాం. ఆ నష్టాన్ని పూరించడానికి చాలా సమయం పట్టింది. ఎరువుల వ్యాపారం కూడా పుంజుకోవడంతో సొసైటీకి లాభాలు ఆశించిన మేరకు వస్తున్నాయి. ప్రస్తుతం ఆదాయాన్ని పెంచే మార్గాలను కూడా ఆలోచిస్తున్నాం.
విజయభాస్కర్, డీసీఎంఎస్ మేనేజరు

# ఆనాటి మోత.. ఇప్పటికీ!!

విశాఖపట్నం : వైకాపా ప్రభుత్వ హయాంలో నగర ప్రజలపై పన్ను భారం మోపింది. ఏటా 15 శాతం పెంపుతో తెచ్చిన కొత్త ఆస్తి పన్ను విధానంతో జనంపై రూ.30 కోట్ల భారం వేసింది.

ఈ ఆస్తి పన్ను భారం తగ్గించాలని, పాత పద్ధతిలోనే పన్ను విధానం కొనసాగించాలన్న డిమాండ్లపై కూటమి సానుకూలంగా స్పందిస్తోంది. ఇప్పటికే వైకాపా హయాంలో ఆరంభించిన చెత్త పన్నును రద్దు చేసింది. ఫలితంగా ఏటా రూ.105 కోట్ల భారం నగరవాసులపై తగ్గించింది.

**వైకాపా తెచ్చిన పన్ను విధానం ఇదీ:** ఏటా 15 శాతం ఆస్తి పన్ను పెంచుకుంటూవెళ్లే విధానాన్ని నాడు వైకాపా ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. వార్షిక అద్దె ప్రాతిపదికన (ఏడాది భవనం అద్దెలో మూడ్నెళ్లకు వచ్చే అద్దె) ఆస్తి పన్ను విధించే విధానాన్ని రద్దు చేసి విలువ ఆధారిత ఆస్తి పన్ను విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ఒక భవనం ఉండే స్థలం, భవన నిర్మాణానికి అయ్యే వ్యయం లెక్కకట్టి, దానిలో 0.15శాతాన్ని ఆస్తి పన్నుగా విధించాలని, వాణిజ్య సముదాయాలకు 0.30 శాతాన్ని ఆస్తి పన్నుగా విధించేలా నిర్ణయించారు. దీనిపై వ్యతిరేకత రావడంతో నివాస భవనాలకు 0.13శాతాన్ని తీర్మానించారు. దీంతో ఒక్కసారిగా ఒక్కో భవనంపై రూ.10వేలు నుంచి రూ.40వేలు వరకు అదనపు భారం పడింది. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో అప్పటి వరకు ఉన్న పన్నుపై ప్రతి ఏటా 15శాతం పెంపుదల చేసేలా అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించింది.

**ఏటా రూ.30 కోట్ల భారం:** వైకాపా నిర్వాకంతో నగర ప్రజలపై ఏటా రూ.30 కోట్ల అదనపు భారం తప్పలేదు. జీవీఎంసీ పరిధిలో



6,42,234 అసెస్‌మెంట్లు ప్రస్తుతానికి ఉండగా, వాటన్నింటిపైనా భారం తప్పలేదు. కొత్తగా ఆస్తి పన్ను పరిధిలోకి వచ్చేవారికి మొత్తం విలువపై 0.13శాతాన్ని ఆస్తి పన్నుగా విధించగా, ప్రతి ఏటా పెరిగిన భూమి విలువ ఆధారంగా మళ్లీ పెంపుదల ఉండేది. నగరంలో 50 గజాల్లోపు ఇళ్లకు అర్ధ సంవత్సరానికి రూ.50 ఆస్తి పన్ను విధిస్తామని వైకాపా అంతకుముందు కల్లబొల్లి కబుర్లు చెప్పింది. నగరంలోని మురికివాడల్లో జీప్లస్-1 తరహా ఇళ్లు ఉండటంతో వాటికి రూ.50 ఆస్తి పన్ను వర్తించదు. దీంతో మురికివాడల్లో ఉన్నవారు సైతం వైకాపా పన్నుకు బలైపోయారు.

**ఎన్నికల హామీలో:** అధికారంలోకి వచ్చిన వెంటనే 'చెత్త పన్ను' రద్దు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం దానిని అమలు చేసింది. పాత ఆస్తి పన్ను విధానాన్ని అమలు చేస్తామని కూడా హామీ ఇవ్వగా, త్వరలో దానిని కూడా నెరవేర్చే కసరత్తు చేస్తోంది.

మంత్రి నారాయణ విశాఖలో ఇటీవల నిర్వహించిన సమీక్షలో... విలువ ఆధారిత ఆస్తి పన్ను విధానాన్ని రద్దు చేయాలని నగర ఎమ్మెల్యేలు కోరారు. అందుకు అనుగుణంగా కౌన్సిల్ తీర్మానం పంపించాలని కోరినట్లు కార్పొరేటర్లు చెబుతున్నారు. దీంతో ఈ నెల 6న జరిగే కౌన్సిల్‌లో విలువ ఆధారిత ఆస్తి పన్ను రద్దు చేయాలన్న అంశంపై చర్చించి, అనుకూలంగా తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

# అంతా అవినీతి.. కబ్జాపై ప్రీతి!

విశాఖపట్నం : నగర శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములకు రక్షణ కరవైంది. ఖాళీ స్థలం కనిపిస్తే రాజకీయ నాయకుల అనుచరులు కబ్జాలకు తెగబడుతున్నారు. రాత్రికి రాత్రి మందిరాల పేరిట అక్రమ నిర్మాణాలు కట్టేస్తున్నారు. కళ్ల ముందే ఇంత జరుగుతున్నా రెవెన్యూ శాఖ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. కబ్జాల వెనుక కొందరు ప్రజాప్రతినిధుల హస్తం ఉన్నందునే చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి.

**500 గజాల స్థలంపై కన్ను:** ఆరిలోవ నైపుణ్యాభివృద్ధి కేంద్రం భవనం నుంచి ఆఖరి బస్‌స్టాప్ మీదుగా ముడసర్లోవ గోల్ఫ్ క్లబ్ వెనుక నుంచి.. తిరిగి బీఆర్‌టీఎస్‌కు చేరుకునేందుకు 80 అడుగుల రహదారిని విస్తరించారు. దీనికిగాను కొండను తొలచగా వచ్చిన గ్రావెల్‌ను బీఆర్‌టీఎస్ రహదారికి, ఇతర అవసరాలకు వినియోగించారు. దీంతో కొండకు రహదారి మధ్యలో సుమారు 100 అడుగుల వెడల్పుతో ఖాళీ స్థలం ఏర్పడింది. సర్వే నెంబరు 27 స్థలంలోని కొంత భాగంలో ఓ మందిరం, సామాజిక భవనం, జీవీఎంసీ కల్యాణమండపం, ఆసుపత్రి నిర్మించారు. మిగిలిన ఖాళీ స్థలంపై రాజకీయ నాయకుల కళ్లు పడ్డాయి. అక్కడ మందిరాలు, సామాజికవర్గాల పేరిట ఆక్రమణ



లకు పాల్పడేందుకు రంగం సిద్ధం చేశారు.

ఇటీవల ఆసుపత్రి, దేవాలయానికి మధ్యలో సుమారు 500 గజాలకుపైగా ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేసి కబ్జా చేసేందుకు నేతలు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు.

ఒకరిని చూసి మరొకరు..: సర్వేనెంబరు 27లో సామాజిక భవనం దాటిన తర్వాత స్థానికంగా ఓ వ్యక్తి మేకల పెంపకం పేరిట కొంత స్థలాన్ని ఆక్రమించగా, దాని వెనుకనే ఉన్న స్థలంలో గతంలో వైకాపాలో ఉండి ప్రస్తుతం తెదేపా నేతగా చెప్పుకునే నాయకుడు రాత్రికి రాత్రి ఓ మందిరం నిర్మించేసి ఆక్రమించారు. దీనిపై ఫిర్యాదులు అందినా అధికారులు స్పందించలేదు. ఈ స్థలాన్ని దాటిన తరువాత కొందరు ఓ మందిరం నిర్మించేందుకు తవ్వి...పునాదుల నిర్మాణానికి సిద్ధమవుతున్నారు. వీరిని చూసి మరో వర్గం నాయకులు కూడా పక్కనే ఉన్న స్థలాన్ని దక్కించుకోవడానికి పావులు కదుపుతున్నారు.

రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతుంటే పరిరక్షించాల్సిన రెవెన్యూ శాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇప్పటికైనా స్పందించకపోతే ఆరిలోవ శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలకు రెక్కలు వస్తాయని, భవిష్యత్తులో ప్రభుత్వ అవసరాలకు భూములు దొరకని పరిస్థితి నెలకొంటుందని స్థానికులు చెబుతున్నారు.

చురకలు



## పుష్కరవనం.. ప్రగతి పథం..

రాజానగరం: దివాన్‌చెరువు రిజర్వ్‌ఫారెస్ట్ పరిధిలో ఆటోనగర్‌కు సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గోదావరి మహాపుష్కరవనాన్ని సుందరీకరించేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. 2027లో రానున్న గోదావరి నదీ పుష్కరాల సందర్భంగా దీన్ని అభివృద్ధి పరిచి అందరికీ ఆహ్లాదం పంచే విధంగా చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నారు. 2015 పుష్కరాల సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పుష్కరవనానికి శంకుస్థాపన చేశారు. నక్షత్రవనం, రాశివనం.. ఇలా అనేక పేర్లతో పలు రకాల మొక్కలు నాటించి వనాన్ని ఆకర్షణీయంగా, సందర్శకులకు ఆహ్లాదం కలిగించేలా తీర్చిదిద్దించారు.

**సందర్శకులకు కేఫ్‌టేరియా**

ఇక్కడికి వచ్చే సందర్శకులకు స్థానికంగా ఎటువంటి ఆహార పానీయాలు లభించడం లేదు. బయటి ప్రాంతాల నుంచి ప్లాస్టిక్ తాగునీటి సీసాలు తీసుకువచ్చి ఇక్కడ వదిలేసి వెళ్లిపోతుండటంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఈ సమస్యను తగ్గించే క్రమంలో పుష్కరవనాన్ని ప్లాస్టిక్ రహిత



ప్రదేశంగా తీర్చిదిద్దాలని అధికారులు నిర్ణయించుకున్నారు. సందర్శకులతో పాటు ప్లాస్టిక్ వస్తువులు అనుమతించడం లేదు. అలాగే, సందర్శకులకు తేనీరు, ఆహారం, స్నాక్స్, భోజనం అందుబాటులో ఉండేలా అరణ్య పేరుతో కేఫ్‌టేరియా సిద్ధం చేశారు.

**బటర్‌ఫ్లై పార్క్..**

గోదావరి పుష్కరవనంలో నూతనంగా బటర్‌ఫ్లై పార్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. వివిధ రకాల మొక్కలు ఇక్కడ అధికంగా ఉండటంతో సీతాకోకచిలుకలకు ఆవాసంగా మారింది. వాటన్నింటినీ ఒకచోటకు చేర్చే విధంగా సీతాకోకచిలుకల పార్క్‌ను ఏర్పాటు చేయనున్నారు

**కోరంగి మ్యూజియం**ప్రకృతి అధ్యయన కేంద్రం కోరంగి మ్యూజియం పునరుద్ధరించేందుకూ అడుగులు పడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో లభించే వివిధ అరుదైన జాతులకు సంబంధించిన జీవులను, పాపికొండల ప్రాంతంలో లభించే జంతు జాలాల అవశేషాలను ఈ మ్యూజియంలో ప్రదర్శనగా ఏర్పాటు చేయనున్నారు. 2027 పుష్కరాల నాటికి దీన్ని మరింత అధునాతనంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కసరత్తు జరుగుతోంది.

**పుష్కరాల నాటికి అధునికీకరణ**

గోదావరి నదికి 2027లో రానున్న పుష్కరాలను పురస్కరించుకుని గోదావరి పుష్కరవనాన్ని ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సందర్శకులను ఆకర్షించే విధంగా పలు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నాం. పూర్తిగా ప్లాస్టిక్ రహితంగా చేయాలని ప్రయత్నిస్తున్నాం.
– దావీదు రాజునాయుడు, ఫారెస్ట్‌రేంజ్ ఆఫీస

## అక్రమాలకు పూచీకత్తు

భీమవరం : పరిధిలోని గొల్లలకోడేరు, నర్సయ్య అగ్రహారంలో కొన్ని అపార్ట్‌మెంట్ల పూచీకత్తు విషయంలో పురపాలిక అధికారులు భారీగా ముడుపులు పోగేశారు. నిర్మాణాలు పూర్తి కాకుండానే రూ.కోట్ల విలువైన ఫ్లాట్ల పూచీకత్తు రిజిస్ట్రేషన్‌ను విడుదల చేశారు. ఆ పత్రాలతో నిర్మాణదారులు బ్యాంకుల్లో భారీగా రుణాలు తీసుకున్నారు.

జంగారెడ్డిగూడెంలో నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో నాలుగు ఫ్లాట్లు పూచీకత్తు రిజిస్ట్రేషన్ చేశారు. అక్రమంగా పూచీకత్తు ఒప్పందం విడుదల చేయకుండానే నిర్మాణదారులు రెండు ఫ్లాట్లు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించి..రూ.కోటికి అమ్మేశారు. ఒక ఫ్లాట్ మరో వ్యక్తికి తనఖా రిజిస్ట్రేషన్ చేసి రూ.30 లక్షలు మరో ఫ్లాట్‌ను బ్యాంకులో పెట్టి రూ.40 లక్షల వరకు అప్పు తీసుకున్నారు.

పురపాలికల్లో పూచీకత్తు మాటున అక్రమాలు జరుగుతున్నాయి. కొందరు నిర్మాణాలు పూర్తి కాకుండానే పుర అధికారులకు ముడుపులిచ్చి పూచీకత్తు రిజిస్ట్రేషన్ విడుదల చేయించుకుంటున్నారు. మరికొందరు పూచీకత్తు విడుదల చేయకుండానే రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు తాయిలాలు ముట్టజెప్పి ఈ తంతు కానిచేస్తున్నారు. అక్కడితో ఆగకుండా ఆ పత్రాలతో బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడంతోపాటు తనఖా రిజిస్ట్రేషన్లు చేసి సొమ్ముచేసుకుంటున్నారు.

**నిబంధనలు పట్టవా..** పట్టణ ప్రణాళిక నిబంధనల కట్టుదిట్టంగా అమలు చేసేందుకు మొత్తం ఆస్తి విలువలో 10 శాతం వరకు పురపాలిక పేరుతో మార్ట్‌గేజ్(పూచీకత్తు) రిజిస్ట్రేషన్ చేయాలి. నిర్మాణం పూర్తి చేసిన తర్వాత అన్ని నిబంధనలు సవ్యంగా ఉంటేనే మార్ట్‌గేజ్ రిలీజ్ చేస్తారు. కానీ కొందరు అసలు నిర్మాణం పూర్తి కాకుండానే పురపాలికల్లో పట్టణ ప్రణాళిక అధికారులకు భారీ ముట్టజెప్పి ఒప్పందం



విడుదల చేసుకుంటున్నారు. ఒక్కో అపార్ట్‌మెంట్‌కు పురపాలక అధికారులు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం.. ఇలా అన్ని పురపాలికల్లో ఈ తంతు సాగుతోంది. ఫలితంగా పట్టణ ప్రణాళిక అస్తవ్యస్తంగా ఉంది. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు.ఎన్నో సిత్రాలు..కొందరు నిర్మాణదారులు పురపాలక అధికారులతో కాకుండా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో బేరాలు కుదుర్చుకుని.. పురపాలక పేరుతో పూచీకత్తు రిజిస్ట్రేషన్ అయిన ఫ్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించి అమ్మేస్తున్నారు. ఆ పత్రాలు పెట్టి బ్యాంకుల్లో రుణాలు పొందుతున్నారు. తనఖా రిజిస్ట్రేషన్లు చేయించుకుని సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో అటు పురపాలికలను, ఇటు బ్యాంకులను, తనఖా పెట్టుకుని సొమ్ము అప్పు ఇచ్చిన వారిని అడ్డంగా మోసం చేస్తున్నారు. దీనిపై ఏలూరు, పశ్చిమ కలెక్టర్లు వెట్రిసెల్వి, నాగరాణి మాట్లాడుతూ విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పరిశ్రమల వ్యర్థాలు.. కాలుష్య కారకాలు



పెనుకొండ : పెనుకొండ మండలంలోని ఎర్రమంచిలోగల కియా ఇండియా, అనుబంధ పరిశ్రమల నుంచి నిత్యం వచ్చే వ్యర్థాలను ప్రైవేటు వ్యక్తుల నిర్వహణకు వదిలేయడంతో కాలుష్యం అధికమవుతోంది. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను మండలంలోని హరిపురం సమీపంలో హంద్రీనీవా కాలువ అవతలి వైపున కొండప్రాంతంలో పడేస్తున్నారు. ఇక్కడ వ్యర్థాలను విభజించి ఆదాయం రాని వాటిని వారానికోసారి నిప్పుపెట్టి దహనం చేస్తున్నారు. దీంతో వాయు కాలుష్యం పెరుగుతోంది.

**డంపింగ్‌యార్డు కోసం స్థలం కేటాయింపు**

గతంలో పెనుకొండ–పావగడ రహదారి పక్కన దాదాపు 25ఎకరాల స్థలాన్ని కియా డంపింగ్ యార్డు కోసం కేటాయించారు. ప్రత్యేకంగా పరిశ్రమల ఆవసరాల కోసం ఏపీఐఐసీ ద్వారా ఎకరం రూ.10.50లక్షలతో రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఈ ప్రాంతం పరిశ్రమలకు దూరంగా ఉండడంతో వినియోగించడం లేదు. దీంతో ఆ భూమిని ఏపీఐఐసీ నూతన ఎంఎస్‌ఎంఈలకు కేటాయించేలా ప్రతిపాదనలు తయారు చేసినట్లు జెడ్‌ఎం శువనాసోని తెలిపారు. కంపెనీలో వచ్చే వ్యర్థాలను ప్రైవేటుకు అప్పగించడంతో వారు ఇష్టానుసారంగా అటవీ ప్రాంతంలో వేస్తూ కాలుష్యానికి కారకులవుతున్నారు. ఇంత జరుగుతున్నా అటు అటవీశాఖ, పర్యావరణ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కాలుష్యంతో చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**పరిశీలించి చర్యలు చేపడతాం**

మునిప్రసాద్, ఈఈ, పొల్యుషన్ కంట్రోల్‌బోర్డు, శ్రీసత్యసాయిజిల్లా
పరిశ్రమల వ్యర్థాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతాం. కియా, అనుబంధ పరిశ్రమల వ్యర్థాల డంపింగ్ యార్డుపై సిబ్బందితో ఆరా తీసి, పర్యావరణానికి హాని కలిగించేలా ఉంటే నోటీసులు జారీ చేస్తాం.

## భూ ‘నిధి’...హతవిధీ!



కాకినాడ : జిల్లాలో పారిశ్రామిక అవసరాలకు భూముల కొరత వేధిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక.. పెద్ద సంఖ్యలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడానికి, ఎంఎస్‌ఎంఈ క్లస్టర్ల ఏర్పాటుకు భూబ్యాంకు సిద్ధం చేయాలని ఆదేశించింది. ఈ మేరకు కలెక్టరేట్, తహసీల్దారు కార్యాలయాల్లో దస్త్రాలను పరిశీలించి, సరిపోలుస్తున్నారు. ఈ ప్రక్రియలో 30 వేల ఎకరాలు ఉన్నట్లు లెక్కతేలింది. రౌతులపూడి, శంఖవరం, ప్రత్తిపాడు, జగ్గంపేట, కాజులూరు మండలాల్లో ఈ భూమిని గుర్తించారు. అందులో పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడేది ఉండగా, సింహభాగం కొండలు, గుట్టలే ఉన్నట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో మళ్లీ కసరత్తు మొదలుపెట్టారు. గత వైకాపా సర్కారులో ప్రభుత్వ భూములను జగనన్న కాలనీల పేరుతో లాగేశారు. గృహ నిర్మాణాలు మాత్రం సాకారం చేయలేదు. చాలాచోట్ల భూములు వృథాగా ఉన్నాయి. వీటిపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

**ఇతరాలకు సంబంధించి..**

జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ స్థలాల కొరత నేపథ్యంలో కేంద్ర ఆధీనంలోని భూములు, కొన్ని బోర్డులకు సంబంధించినవి, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందినవి గుర్తించి, వినియోగించేలా కూడా కసరత్తు జరుగుతోంది. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి వాటిని ఇప్పటికే గుర్తించారు. ః కరప, తాళ్లరేవు, కాకినాడ గ్రామీణ మండలాల పరిధిలో కేంద్ర ఆధీనంలో సుమారు 1,500 ఎకరాల ఉప్పు భూములు ఉన్నాయి. గత ప్రభుత్వంలో 150 ఎకరాలను జగనన్న కాలనీ కోసం తీసుకున్నారు. ఇంకా వందల ఎకరాలు ఉన్నాయి. ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు డిమాండ్ కూడా ఉంది. ః కాకినాడ అర్బన్ మండలంలో ఏపీఐఐసీకి చెందిన ఏడు ఎకరాలు ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాల వద్ద అందుబాటులో ఉంది. నగరంలో మరో 5 ఎకరాల భూమి ఒక బోర్డుకు సంబంధించినది ఉంది. వీటిపైనా అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. బోర్డుకు సంబంధించిన భూమిపై కొన్ని వివాదాలు నడుస్తున్నాయి. ః జగనన్న కాలనీలకు సేకరించిన భూముల్లో 16 లేఔట్లకు సంబంధించి సుమారు 200 ఎకరాలు అందుబాటులో ఉన్నాయి. వీటి స్వాధీనానికి రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

**నివేదిక సిద్ధం చేస్తున్నాం..**

జిల్లాలో ప్రభుత్వ భూములను గుర్తించారు. వీటి వినియోగంపై దృష్టి సారించాం. మరిన్ని భూములు సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. అన్ని కోణాల్లోనూ భూముల సేకరణ చర్యలు చేపట్టాం. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములకు సంబంధించి నివేదిక సిద్ధం చేస్తున్నాం.
– రాహుల్‌మీనా, సంయుక్త కలెక్టర్

## వెనక్కి బిల్లులు. ఎలా ఆ పనులు!



మండపేట : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గత రెండేళ్లలో 15వ ఆర్థిక సంఘం నిధులు, మున్సిపల్ సాధారణ నిధులతో పూర్తిచేసిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించేందుకు అనుమతి కోసం సీడీఎంఏకు పంపగా వెనక్కి రావడంతో భవిష్యత్తులో చేయబోయే పనులకు ఆటంకం ఏర్పడనుంది. 2024 ఆగస్టులో, 2025 జనవరిలో 50 శాతం వరకు చెల్లించి మిగిలిన బిల్లులు మాత్రం వెనక్కి పంపించారు. మండపేటలో చేపట్టిన పనులకు సంబంధించి రూ.12.65 కోట్ల బిల్లులు చెలించాల్సి ఉండగా రూ.6.88 కోట్లు చెల్లించారు. మిగిలిన రూ.5.77 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అమలాపురం మున్సిపాలిటీలో రూ.6 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉండగా 2024 ఆగస్టులో రూ.కోటి, 2025 జనవరిలో రూ.కోటి చెల్లించారు. ఇంకా రూ.4 కోట్లు చెల్లించాల్సి ఉంది. రామచంద్రపురం మున్సిపాలిటీలో రూ.6 కోట్లు పనులకు గాను రూ.4.5 కోట్లు చెల్లించగా రూ.1.5 కోట్లు బిల్లులు వెనక్కు వచ్చాయి. బిల్లులు వెనక్కి రావడంతో ఇప్పటికే ప్రారంభించిన పనులు అర్ధంతరంగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడనుంది. ఉదాహరణకు మండపేట పట్టణంలో నిర్మించే 100 పడకల ఆసుపత్రి భవనంలో మాతా శిశువిభాగం నిర్మాణానికి రూ.1.8 కోట్లు, సర్జికల్ వార్డు కోసం రూ.15.8లక్షలు, గొల్లపుంత కాలనీలో నిర్మించిన మహిళా స్వశక్తి భవనం ప్రహరీ నిర్మాణానికి రూ.26 లక్షలు, క్రిస్టియన్ కమ్యూనిటీహాలులో ప్రహరీ నిర్మాణానికి రూ.27లక్షలు, రజక కమ్యూనిటీహాలకు రూ.11లక్షలు, ఇవి కాకుండా సీసీ రహదారులు, మరమ్మతులు చేపట్టగా ఈ బిల్లులన్నీ వెనక్కు వచ్చాయి.

**కొత్త నిబంధనల అమలు**

సమయం అయిపోయిందని సిఎఫ్ఎంఎస్ క్లోజ్ చేశారు. ఫైనాన్స్ శాఖ నుంచి కొన్ని రకాల మార్గదర్శకాలు వచ్చాయి. దాని ప్రకారం పురపాలక సంఘాలు స్వయం సమృద్ధి సాధించి వారు చేసే పనులకు వారే చెల్లించేలా నిబంధనలున్నాయి. స్లమ్‌కి 40 శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఉమెన్, డిజైబుల్‌కి కొంత శాతం కేటాయించాలి. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే డీఎంఎ కార్యాలయం, ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యవేక్షణ ఉంటుంది. వీటితోపాటే మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 3 నెలలకు సరిపడా జీతాలు, విద్యుత్తు బిల్లులకు చెల్లించాల్సిన మొత్తం పక్కన పెట్టాలి. అప్పుడు మాత్రమే అభివృద్ధి పనులకు చెల్లింపులు జరపాల్సి ఉంది.
– నాగనరసింహారావు, మున్సిపల్ ఆర్డీ, రాజమహేంద్రవరం.

## చెరువులో రహదారి నిర్మాణం

రోలుగుంట : శరభవరం శివారు రాజన్నపేట సమీపంలోని నల్లరాతి క్వారీ నుంచి బండరాళ్ల తరలింపు వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. బండరాళ్లను తరలించే భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు దెబ్బతింటున్నాయి. బుచ్చెంపేటలో మరిడమ్మ ఆలయానికి వెళ్లే దారి అర్చి లారీలు ఢీకొని కుప్పకూలింది. దీంతో స్థానిక నవతరం యూత్ సభ్యులు, గ్రామస్థులు క్వారీ వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. క్వారీ యాజమాన్యం లారీలు బుచ్చెంపేట మీదుగా రాకుండా ప్రత్యామ్నాయ దారిని ఏర్పాటు చేసుకుంది. బుచ్చెంపేట, గొల్లపేట, వడ్డిప తదితర గ్రామాలకు చెందిన రైతుల భూములను ఏడాదిపాటు లీజు ప్రాతిపదికన తీసుకుని రోడ్డు నిర్మించింది. రాజన్నపేటలో క్వారీకి దగ్గరగా ఉన్న భూపతి చెరువును ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేపట్టడంపై రైతుల నుంచి అభ్యంతరం వ్యక్తమవుతోంది. సర్వే నంబరు 57/2లో 3.66 ఎకరాల విస్తీర్ణంలోని భూపతి చెరువును కొంతమేర కప్పేసి రోడ్డు వేశారని ఆరోపిస్తున్నారు. రాజన్నపేట రోడ్డు నుంచి వడ్డిప వరకు రైతుల భూముల్లో నిర్మించిన రోడ్డు మీదుగా లారీల రాకపోకలతో పక్కనున్న పొలాలు దెబ్బతింటాయని చెందుతున్నారు.

## తడారిన శివారు గొంతులు

ఆదోని : పట్టణ శివారు ప్ర‘జల’ గొంతెండుతోంది..బిందెడు నీటికి పడరాని పాట్లు పడుతున్నారు.. ఇంటింటికి కుళాయిలు లేకపోవడం.. కొన్నిచోట్ల పైపులైన్లు అస్తవ్యస్తంగా ఉండటం.. తరచూ లీకేజీలతో సమస్య ఎదురవుతోంది. ప్రస్తుత వేసవిలో చాలా కాలనీలకు రెండు మూడు రోజులకోసారే తక్కువ సమయం నీళ్లు వదులుతున్నారు.

**రోజుకు 135 లీటర్లు**

పురపాలికల లెక్కల ప్రకారం మనిషికి రోజుకు 135 లీటర్ల నీరివ్వాలి. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో 17–18 లక్షల జనాభా ఉంది. లక్ష మందికి 13 ఎం.ఎల్. నీరు అవసరం. అదే పది లక్షల మంది జనాభాకు 130 ఎం.ఎల్. ఈ లెక్కన మొత్తం పురపాలికల్లోని జనాభాకు 240 ఎం.ఎల్. నీరు అవసరం. 75 శాతం నీరు సరఫరా చేయడం లేదు. ఆదోనిలో 26 ఎం.ఎల్. (ఒక ఎం.ఎల్.=పది లక్షల లీటర్లు) నీరు ఇవ్వాల్సిన చోట 22 ఎం.ఎల్. మించడం లేదు.నీటి రవాణా విషయానికొస్తే కర్నూలు మహానగరానికి ఏడు ట్యాంకర్లున్నాయి. ఆదోని పురపాలికకు ఉన్న ఒకటి కూడా పనిచేయడం లేదు.

**వదిలేసిన వైకాపా**

కేంద్రం అమృత్ పథకంతో పాటు ప్రత్యేకంగా నిధులిచ్చేందుకు ముందుకొచ్చినా.. గత వైకాపా ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేకపోయింది. రాష్ట్ర వాటా నిధులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయి.



అమృత్ 2.0 కింద 2023లో కర్నూలు, నంద్యాల, ఆదోని పురపాలికల్లో గత కేంద్ర ప్రభుత్వం రూ.438 కోట్లతో నీటి ప్రాజెక్టులిచ్చింది. వైకాపా పాలనలో డీపీఆర్ దశ దాటించలేకపోయింది. ఫలితంగా మూడు పురపాలికల్లో నీటి సమస్యలు తలెత్తుతున్నాయి.

**నగరంలో నరకం**

కర్నూలు నగరంలోని 52 వార్డుల్లో సుమారు 6.5 లక్షల మంది నివసిస్తున్నారు. రోజూ 120 ఎంఎల్‌డీ నీటి సరఫరా అవసరం ఉండగా..ప్రస్తుతం 95 ఎంఎల్‌డీ మాత్రమే లభిస్తోంది. శివారు కాలనీలు, విలీన గ్రామాల్లో సగటున ఒక్కో కుటుంబం రోజూ రూ.40 వరకు నీటి కోసం ఖర్చు చేస్తున్నాయి.

విలీన గ్రామాలైన పందిపాడు, పెద్దపాడు, లక్ష్మీపురం, దూపాడులలోని గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న పైపులైన్ల ద్వారా సరఫరా అవుతున్న నీరే దిక్కవుతోంది. మంచినీటిని కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 20 లీటర్ల నీటి క్యానుకు రూ.20 వెచ్చిస్తున్నారు.

సరిపడా ట్యాంకర్లను నగరపాలక సంస్థ సరఫరా చేయడం లేదు. రోజూ 20 ట్యాంకుల కంటే ఎక్కువగా శివారు కాలనీలు, విలీన గ్రామాలకు పంపడం లేదని తెలిసింది. లెక్కల్లో మాత్రం ట్యాంకర్లను పంపిస్తున్నట్లు చూపుతున్నారని సమాచారం.

**రూ.కోట్ల వ్యాపారం**

ఉమ్మడి జిల్లాలో పది పురపాలికల్లో 321 వార్డులు.. సుమారు 18 లక్షల జనాభా ఉంది. ఇందులో పది శాతం జనాభా అంటే.. కుటుంబానికి నలుగురు చొప్పున లెక్కించినా 1.80 లక్షల జనాభాకు 25వేల కుటుంబాలు రోజు తాగునీటి కోసం రూ.20 చొప్పున డబ్బా కొనుగోలు చేసినా.. రోజు వారీ నీటికి వెచ్చిస్తున్న మొత్తం రూ.5 లక్షలు నెలకు రూ.1.50 కోట్లు వెచ్చిస్తున్నారు.

**ఆదోనిలో అవస్థలు**

శివారు కాలనీలు: 15

సమస్య ఉన్న కాలనీలు: క్రాంతినగర్, వైఎస్ఆర్.నగర్, కల్లుబావి, రాయనగర్, పైకొట్టాలు, దేవినగర్, తదితర ప్రాంతాలు.

ట్యాంకర్లు: ఆదోని పురపాలికల్లో ఒక ట్యాంకరే ఉంది. అదీ మరమ్మతుకు గురైంది.

పురపాలక సంఘం వారు రెండు.. మూడు రోజులకోసారి నీరు సరఫరా చేస్తున్నారు. వీటినే పొదుపుగా వినియోగిస్తున్నారు.

పరిష్కారం: శివారు కాలనీల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.130 కోట్లతో అమృత్ 2.0 కింద కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నగర్ ప్రాంతంలో నీటి నిల్వ ప్లాంట్ల నిర్మాణాలు చేపట్టాలని భావిస్తున్నారు.

చేనేతపురిలో కష్టాలు

శివారు కాలనీలు: 17

ఎన్ని కాలనీలకు పైపులైన్ ఉంది : 5

నీటి కష్టాలున్న కాలనీలు: హనుమాన్‌నగర్, సంజీవ్‌నగర్, శక్తినగర్, మహబూబ్‌నగర్‌కాలనీ, సాయినగర్, తిరుమల్‌నగర్, సాయిగణేశ్ కాలనీ, ఎల్లమ్మబీడు, చెన్నకేశవరెడ్డినగర్, కొత్త ఎస్సీ కాలనీ, శాంతినగర్, మునెప్పనగర్ ప్రాంతంప్రస్తుతం పురపాలక నుంచి ఎన్ని ట్యాంకర్లు పంపిస్తున్నారు : 2 ప్రతి కుటుంబం నీటికోసం రోజుకు ఎన్ని డబ్బులు వెచ్చిస్తున్నారు: రూ.70

## నాగలూటి

నందికొట్కూరు : నాగలూటి నాపరాతి గనుల్లో ఎర్రమట్టి దందా జోరుగా సాగుతోంది. గనుల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా మన్ను తోడి సొమ్ము చేసుకొంటున్నారు. మిడుతూరు మండలం నాగలూటి, పీరుసాహెబ్‌పేట, నందికొట్కూరు మండలం నాగటూరు గ్రామాల పరిధిలో నాపరాతి గనులు ఉన్నాయి. పైభాగంలో పెద్ద ఎత్తున ఎర్రమట్టి ఉంటుంది.. దానిని తోడి రాళ్లు తీస్తుంటారు.. ఈ క్రమంలో వచ్చే మన్నును గతంలో గుట్టలుగా పోసేశారు. ప్రస్తుతం మార్కెట్లో ఎర్రమట్టికి బాగా డిమాండ్ ఉండటంతో గనుల లీజుదారులు మట్టి దందా మొదలు పెట్టారు. నిబంధనల ప్రకారం లీజుదారులు కేవలం గనులే తవ్వాలి.. గనుల తవ్వకం పూర్తయిన తర్వాత మట్టితో గోతులు పూడ్చాలి.. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా ఆ మట్టిని విక్రయిస్తున్నారు.సోలార్ కంపెనీకి తరలింపు

నాగలూటి నాపరాతి గనుల నుంచి నిత్యం 50 టిప్పర్లు, 100 ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. నాగలూటి సమీపంలో గట్టుపై ఓ సోలార్ కంపెనీ పనులు చేపడుతోంది.. అక్కడ రహదారులకు అవసరమైన మట్టిని నాగలూటి నుంచి తీసుకెళ్తున్నారు. ఇందుకు గనుల యజమానులతో ముందస్తు ఒప్పందం చేసుకొన్నారు.. ఎకరం విస్తీర్ణంలో మట్టి తోడినందుకు రూ.2 లక్షలు చెల్లిస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా నందికొట్కూరు పట్టణ పరిధిలో వెంచర్లు వెలుస్తున్నాయి. అక్కడ ఏర్పాటు చేస్తున్న రహదారులకు నాగలూటి నుంచే మట్టిని తీసుకెళున్నారు. ఇందుకు ఒక ట్రాక్టర్‌కు రూ.1,200 తీసుకుంటున్నారు.

# సమాచారమిచ్చినా తీసుకెళ్లరే..!

రాజమహేంద్రవరం : వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో చేరుతున్న పార్సిళ్లలో కొన్ని డెలివరీ కావడం లేదు. సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించినా తీసుకెళ్లడం లేదు. మరికొన్నింటికి సంబంధించి ఆయా వ్యక్తుల చరవాణి నంబర్లు పనిచేయక.. అసలు అవి ఎవరివో కూడా తెలియని పరిస్థితి. ఇటువంటి వాటిని వారాలు, నెలల తరబడి భద్రపరచడానికి ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రైవేటు పార్సిల్ రవాణాతో పోలిస్తే ఆర్టీసీ లాజిస్టిక్స్‌లో పార్సిల్ రవాణా ఛార్జీ తక్కువ కావడం.. సురక్షితంగా అనుకున్న సమయానికి గమ్యస్థానికి చేరుతాయనే భరోసా, బీమా సౌకర్యం ఉండడంతో ఎక్కువ మంది ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలోని కార్గో పార్సిల్ కేంద్రాల ద్వారా రోజూ 1,600 వరకు బుకింగ్ జరుగుతుండగా, వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడి డెలివరీ కేంద్రాలకు 1,100 వరకు వస్తున్నాయి. పార్సిల్ రవాణా సేవల ద్వారా జిల్లా ఆర్టీసీకి ఏటా రూ.12 కోట్ల నుంచి రూ.14 కోట్ల



వరకు ఆదాయం సమకూరుతోంది. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ బయట ప్రాంతాల నుంచి వచ్చే కొన్ని పార్సిళ్లను సంబంధిత వ్యక్తులు తీసుకెళ్లకుండా వదిలేయడంతో డెలివరీ కేంద్రాలు నిండిపోతున్నాయి. వీటిలో ఎక్కువగా పాత పేపర్లు, పుస్తకాలు, వస్త్రాలు, ఔషధాలు, పాత ఎలక్ట్రికల్ వస్తువులు ఉంటున్నాయని ఆర్టీసీ కార్గో అధికారులు చెబుతున్నారు.

**48 గంటలు దాటితే అపరాధ రుసుము..**

వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ డెలివరీ కేంద్రాలకు చేరిన పార్సిళ్లను 48 గంటల వ్యవధిలో సంబంధిత వ్యక్తులు తీసుకెళ్లాలి. లేకుంటే ఒక్కొక్క దానికి రోజుకు రూ.5 చొప్పున అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. రెండు నెలలు దాటినా తీసుకెళ్లని వాటిని బహిరంగ వేలం ద్వారా విక్రయించే అధికారం ఆర్టీసీ అధికారులకు ఉండడంతో చివరకు అదే పని చేస్తున్నారు. ఇలా ఏడాది కాలంలో పేరుకుపోయిన 583 పార్సిళ్లకు వేలం నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు.

# పనులు దండి.. నాణ్యత తొండి

శ్రీశైల దేవస్థానంలో ఇంజినీరింగ్ విభాగం అక్రమాలకు అడ్డాగా మారుతోంది. అంచనాలు, ప్రణాళికలు రూపొందించి, టెండర్లు పిలిచిన తర్వాత చేయాల్సిన పని కాకుండా వేరొకటి చేస్తున్నారు. అనుమతులు తీసుకోవడానికి ఈ–ఫైల్ విధానాన్ని అనుసరించకుండా చేతిరాతతో దస్త్రాలు సిద్ధం చేస్తూ ఉన్నతాధికారులను బురిడీ కొట్టిస్తున్నారు. ఏఈ నుంచి ఈఈ స్థాయిలో పనిచేస్తున్న ఒక ఇంజినీరు పర్యవేక్షణలోనే పనులన్నీ సాగుతుండటం గమనార్హం. సుదీర్ఘకాలం నుంచి క్షేత్రంలో తిష్ఠవేసిన ఆయన బినామీలతో పనులు చేయిస్తూ నాణ్యతను పాతరేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత నాలుగేళ్లుగా శాశ్వత పనులను పక్కనబెట్టి మొక్కుబడిగా చేసే రూ.40 లక్షల అంచనా పనులకు ప్రాధాన్యమివ్వడం గమనార్హం. ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గణేశ్ సదన్ సీసీ రోడ్డు, నక్షత్రవనం, ఇతర పనులను తనిఖీ చేసి ఆరా తీశారు.

**చెప్పేదొకటి.. చేస్తున్నది మరొకటి**

రెండేళ్ల కిందట ఆలయ ముందుభాగంలోని గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు సుమారు రూ.80 లక్షల అంచనాతో బీటీ రోడ్డు నిర్మించడానికి అప్పటి ఈవో ఎస్.లవన్న, ఈఈ, డీఈలు భూమిపూజ చేశారు. తర్వాత నిర్ణయం మార్చుకుని ఆలయం వెనుక పశ్చిమ మాడవీధిలో గ్యాలరీ పనులు చేపట్టారు. గ్యాలరీ నిర్మాణాలకు సగం నిధులు చెల్లించినట్లు సమాచారం. అనుమతులు లేకుండా బీటీ రోడ్డు పనిని గ్యాలరీగా మార్చి చేస్తుండటంపై ఆడిట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఉమారామలింగేశ్వర ఆలయం వద్ద రథం కోసమని సుమారు రూ.35 లక్షలతో నిర్మించిన షెడ్డు నిరుపయోగంగా మారింది.

దేవస్థానం ఆసుపత్రి నుంచి అన్నదాన భవనం వరకు రహదారి విస్తరణ పనులు చేయాలని అధికారులు నిర్ణయించారు. బి.టి.రోడ్డుకు అటువైపు బాగున్న ఇంటర్‌లాకింగ్ టైల్స్ తొలగించి సీసీ రోడ్డు నిర్మించారు.



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మురుగు కాల్వపై ప్రీకాస్ట్ స్లాబ్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పనులు మొదలు పెట్టిన తర్వాత సీసీ రోడ్డు తరహాలో మందంగా రెండు స్లాబులు నిర్మించారు.

**గుత్తేదారులకు మద్దతు**

గణేశ్ సదన్‌కు పక్కన సుమారు రూ.కోటికి పైగా అంచనాలతో నక్షత్ర వనం పనులు మొదలు పెట్టారు. చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టి అర్ధంతరంగా వదిలివేశారు. ఇందులో గుత్తేదారు, ఇంజినీర్ల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు.

సిద్ధరామప్ప దుకాణ సముదాయంలో నిరుపయోగంగా ఉన్న గదులను అందుబాటులోకి తెచ్చేందుకు 2022లో అప్పటి ధర్మకర్తల మండలి, ఈవో నిర్ణయం తీసుకున్నారు. ఖాళీగా ఉన్న గదులను రూ.1.30 కోట్ల అంచనాతో 22 సూట్ రూమ్స్‌గా మార్చాలని టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టారు. గుత్తేదారు, ఇంజినీర్లు పనులను మూడేళ్లపాటు నత్తనడకన చేశారు. రెండు లిఫ్ట్‌ల ఏర్పాటులో తీవ్ర జాప్యం చేశారు. గదుల నిర్మాణ పనులు, వైరింగ్, లిఫ్ట్ పనులను ఒకే టెండర్ పిలిచి పనులు చేయాల్సి ఉండగా, మూడుగా విభజించి గుత్తేదారులకు లబ్ధి చేకూర్చారన్న విమర్శలు ఉన్నాయి. ఇంత వరకు సూట్ గదులు భక్తులకు అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

ఆగమ పాఠశాల వద్ద షెడ్ల నిర్మాణ పనులను గడువులోపు పూర్తి చేయకుండా సాలుకు చెబుతున్న గుత్తేదారులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేస్తున్నారు.

# నాడు శిథిలం.. నేడు పదిలం



అనంతపురం : అనంతపురం జిల్లా సాగునీటి రంగంలో ఎంతో కీలకమైన హెచ్చెల్సీ పునరుద్ధరణకు కూటమి సర్కారు నడుం బిగించింది. గతేడాది డిసెంబరులో సీఎం చంద్రబాబు నేమకల్లుకు వచ్చిన సందర్భంలో మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు హెచ్చెల్సీ దుస్థితిని వివరించారు. నిధులు మంజూరు చేయడంతో వంతెనల పునర్నిర్మాణంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా యూటీలు, లైనింగ్ పనులు చేపట్టారు.వంతెనలు పిల్లర్ల దశలో ఉన్నాయి11 పనులకు గాను తొమ్మిదింటిలో పనులు మొదలయ్యాయి.

**తీరనున్న వంతెన వెతలు**

హెచ్చెల్సీ కాలువపై మల్లికేతి, దర్గాహొన్నూరు, కణేకల్లు, మాల్యం, మీనహళ్లి, నాగేపల్లి గ్రామాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన వంతెనలు వైకాపా హయాంలో కూలిపోయాయి. దీంతో స్థానికులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చేది. 165వ కి.మీ. వద్ద రూ.1.59 కోట్లు, 169వ కి.మీ. వద్ద రూ.1.91 రూ.కోట్లు, ఉద్దేహాళ్–మల్లికేతి గ్రామాల మధ్య 115 కి.మీ. వద్ద రూ.1.66 కోట్లతో వంతెనల నిర్మాణం చేపట్టారు. 147 కి.మీ. వద్ద రూ.4.21 కోట్లతో ప్రధాన కాలువపై ఔట్‌పాల్ రెగ్యులేటర్, యర్రగుంట వద్ద 137.7 కి.మీ వద్ద రూ.4.1 కోట్లతో అండర్ టన్నెల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

**15 శాతం పూర్తి**

ప్రధాన కాలువలో 15 కిలోమీటర్ల లైనింగ్ పనులు మొదలుపెట్టారు. 115వ కి.మీ. నుంచి 130 కి.మీ. వరకు రూ.9 కోట్లతో లైనింగ్ చేయనున్నారు. ఇప్పటికే అన్ని పనులు కలిపి 15 శాతం వరకు పూర్తయ్యాయి. పునరుద్ధరణ పూర్తయితే చివరి ఆయకట్టులోని 2 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది.

**పూర్తిగా నిర్లక్ష్యం..**

వైకాపా ప్రభుత్వంలో హెచ్చెల్సీని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. 2019లో అధికారంలోకి రాగానే ఆధునికీకరణ పనులను రద్దు చేశారు. ఐదేళ్లపాటు అధికారులు పంపిన ప్రతిపాదనలను పక్కనపెట్టారు. వంతెనలు కూలిపోయినా పట్టించుకోలేదు. కాలువ బలహీనంగా ఉండటంతో తుంగభద్ర వాటా నీటిని వినియోగించుకోలేకపోయారు.

**పనులకు శ్రీకారం..**

కూటమి ప్రభుత్వం రాగానే హెచ్చెల్సీలో అత్యవసరంగా చేపట్టాల్సిన మరమ్మతులపై దృష్టి సారించింది. బడ్జెట్‌లో రూ.37 కోట్లు కేటాయించింది. రూ.28 కోట్లకు టెండర్లు పిలిచి పనులకు శ్రీకారం చుట్టారు. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి 0.5 టీఎంసీలు అదనంగా తీసుకొచ్చి పంటలను కాపాడారు.

# హంగుల ప్రదర్శనశాలలో అద్భుత ప్రాచీనం



ఎస్కేయూ : విజ్ఞాన విహార యాత్రలంటే విద్యార్థులకు సరదా. పర్యాటక ప్రదేశాలకు వెళ్లి అక్కడి వింతలు, విశేషాలు తెలుసుకోవాలనే ఉత్సుకత ఉంటుంది. అలాంటి విశేషాలు తెలిపే మ్యూజియం ఒకటి మన జిల్లా కేంద్రంలోనూ ఉంది. చారిత్రక, వారసత్వ విశేషాలు తెలపడంతోపాటు విజ్ఞానాన్ని పంచుతోంది. మన ప్రాచీన చరిత్ర, సమాజం, ఆచారాలు, సంప్రదాయాలు, ఉపయోగించిన వస్తువులు, ఆయుధాలు, నాణేలు, రచనలు, శిల్పాలతో ఈ మ్యూజియం అందరినీ ఆకట్టుకుంటోంది. జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు కల్లూరు సుబ్బారావు పేరిట 1992లో ఈ ప్రదర్శనశాల నిర్మించారు. అప్పట్లో పాత భవనంలోనే పురావస్తు ప్రదర్శనశాఖ ఉండేది. ఇటీవల హంగులతో కొత్త భవనాన్ని నిర్మించారు. 10-3-2024 నుంచి సందర్శకులకు అందుబాటులోకి వచ్చింది.

**వెళ్లాలంటే..** అనంతనగరం ఆదిమూర్తి నగర్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయం ఎదురుగా ఉన్న ఈ మ్యూజియం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకూ అందుబాటులో ఉంటుంది. శుక్రవారం ఈ ప్రదర్శనశాలకు సెలవు. ప్రవేశానికి పిల్లలకు రూ.20, పెద్దలకు రూ.30 టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. పాఠశాల తరఫున 25 మందిపైగా విద్యార్థులు ఒకేసారి వస్తే ఒక్కొక్కరికి రూ.10లు చెల్లిస్తే చాలు. విదేశీయులకు, ఫొటో, వీడియోలు చిత్రించాలంటే అదనంగా రుసుం ఉంటుంది.

**రాజుల కాలంలో ఉపయోగించిన ఆయుధాలు**

మొదటి అంతస్తులో ప్రాచీన యుగం, మధ్యయుగం, నవీనయుగం నాటి రాతి పనిముట్లు, హిందూ, జైన, బౌద్ధమతాలకు సంబంధించిన రాతి విగ్రహాలు. చెక్కపీఠాలు, వివిధ భంగిమల దేవతల విగ్రహాలు ఉంచారు. శిలాయుగం నాటి మానవుల రాతి గొడ్డళ్లు ఇతర ఆయుధాలు దర్శనమిస్తాయి.రెండో అంతస్తులో నవీన శిలాయుగం నాటి మట్టిపాత్రలు, బృహత్ శిలాయుగపు కుండలు, బూడిద ముద్దలు, ఇనుప పనిముట్లు, ఏనుగు ఆకారపు సార్కోఫోగస్, టెర్రకోట బొమ్మలు, దాల్కో లిథిక్ కాలానికి చెందిన కత్తులు, ఇటుకలు, సున్నపు బొమ్మలు, కాంస్య ప్రతిమలు, నాణేలు, చైనా పింగాణి పాత్రలు ఎముకలతో చేసిన వస్తువులు ఉన్నాయి. శాతవాహనులు, ఇక్ష్వాకులు, కాకతీయులు, విజయనగరరాజుల కాలం నాటి నాణేలు, ఇటుకలు చూడొచ్చు. మూడో అంతుస్తులో పురాతన ఖడ్గాలు, బాణాలు, తామ్ర పత్ర గ్రంథాలు, తాళపత్రాలు ఆకట్టుకుంటున్నాయి.

# బడిగంటకు ముందే సరికొత్త హంగులు




అచ్యుతాపురం : ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఒక వైపు విద్యావిధానంలో మార్పులను తీసుకొస్తూ.. మరోవైపు పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పన దిశగా అడుగులు వేస్తోంది. వేసవి సెలవులు ముగిసి.. బడులు తెరిచేలోగా అవసరమైన పనులు పూర్తి చేసి అదనపు తరగతి గదులు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోంది.

జిల్లావ్యాప్తంగా 1,396 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో కొన్నింటి అభివృద్ధికి గత వైకాపా ప్రభుత్వం నాడు–నేడు పేరుతో నిధులు కేటాయించింది. మొదటివిడత మంజూరైన నిధుల్లో సింహభాగం వైకాపా నాయకుల జేబుల్లోకి పోగా, బడుల్లో మౌలిక వసతుల కల్పన రంగులకే పరిమితమైంది. రెండో దశలోనూ అవినీతి మరకలు లేకుండా పాఠశాలలు బాగు చేయడానికి ముందుకు రాకపోవడం, వైకాపా నాయకులు ఒత్తిడి పెరిగిపోవడంతో చాలా పాఠశాలల్లో పనులు చేయించడానికి ప్రధానోపాధ్యాయులు ముందుకురాని పరిస్థితి ఏర్పడింది. ఈలోగా ఎన్నికలు రావడంతో రెండవ దశ పనులు అటకెక్కించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడుల్లో పూర్తిస్థాయి వసతుల కల్పనపై దృష్టి పెట్టింది. మన బడి–మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో రూ. 8.55 కోట్లతో అదనపు గదుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ నెలాఖరుకు వీటిని పూర్తి చేసేలా ప్రణాళిక పెట్టుకొని సమగ్ర శిక్షా అధికారులు పనిచేస్తున్నారు. దీంతోపాటు 20 కస్తూర్బా విద్యాలయాల్లో 30 అదనపు తరగతి నిర్మాణాలు చేపట్టారు. బడిగంట మోగేలోగా అన్నిచోట్లా పనులు పూర్తిచేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం పనిచేస్తోంది. వరండాలో తరగతులు నిర్వహించే పరిస్థితి ఉండకూడదని ఇప్పటికే అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**వసతుల కల్పనకు పెద్దపీట**

పీఎంశ్రీ పథకం కింద రూ. 2.33 కోట్లతో 15 రసాయన ప్రయోగశాలల నిర్మాణం జరుగుతోంది. 36 పాఠశాలల్లో రూ.1.75 కోట్లతో క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తున్నారు.

18 బడుల్లో రూ. 2.2 కోట్లతో రెయిలింగ్ పనులు, 20 పాఠశాలల్లో రూ. 30 లక్షలతో కిచెన్ గార్డెన్లు తయారుచేశారు.

భూగర్భజలాలను పరిరక్షించడానికి 21 బడుల్లో రూ. 21 లక్షలతో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. రూ. 69 లక్షలతో గ్రంథాలయాల గదులు, 10 చోట్ల రూ. 1.85 కోట్లతో కంప్యూటర్ గదులు నిర్మిస్తున్నారు.

**జూన్ నాటికి పూర్తి చేస్తాం– ఆర్.జయప్రకాశ్, సమగ్ర శిక్షా జిల్లా అదనపు పథ సమన్వయకర్త**


పాఠశాలలు ప్రారంభించే సమయానికి నిర్మాణంలో ఉన్న గదులను పూర్తి చేయించడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాం. కస్తూర్బా విద్యాలయాల్లో ఎక్కువ అదనపు గదులు నిర్మాణంలో ఉన్నాయి. వీటితోపాటు రక్షణ గోడలు, గ్రంథాలయాలు, కిచెన్ గార్డెన్లు, రసాయన ప్రయోగశాలలు.. ఇలా పాఠశాల అనుబంధంగా జరుగుతున్న అన్ని పనులను సకాలంలో పూర్తిచేయించి అందుబాటులోకి తీసుకొస్తాం. జరుగుతున్న పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం.

# చుక్కల భూమికి రెక్కలు

కర్నూలు : కల్లూరు మండలం ఉలిందకొండలో సర్వే నంబరు–652లో 3.40 ఎకరాలు, సర్వే నంబరు–653లో 4.48 ఎకరాల చుక్కల భూమిని వైఎస్సార్ జిల్లాకు చెందిన ఎస్.ఆశాబి పేరుపై ఆన్‌లైన్ చేశారు. వీటిని నిషేధిత జాబితా నుంచి తొలగించకుండా దస్త్రాలు మార్చి ఆమె పేరు చేర్చారు.. కొన్నాళ్లకు ఆ మహిళ కర్నూలు నగరానికి చెందిన ఓ రాజకీయ నాయకుడు, స్థిరాస్తి వ్యాపారికి 2021లో రిజిస్ట్రేషన్ చేశారు. 2023లో జరిగిన రీసర్వేలో ఎల్‌పీఎం నంబర్లు కేటాయించారు.

**'క్షేత్రం' తక్కువ.. నమోదు ఎక్కువ**

కర్నూలు గ్రామీణ మండలం బి.తాండ్రపాడుకు చెందిన బోయ భూలక్ష్మికి ఉలిందకొండలో ఖాతా నంబరు 2334, పాత సర్వే నంబరు 635లో 10.15 ఎకరాలు చూపుతూ.., అదే గ్రామ పరిధిలో 634 సర్వే నంబరులో 4.097 ఎకరాల భూమిని ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదు చేశారు. 635లో మంగమ్మకు 7.07 ఎకరాలు, భూలక్ష్మికి 3.01 ఎకరాల భూమిని ఆన్‌లైన్ అడంగల్‌లో చేర్చారు. ఆన్‌లైన్‌లో



నమోదు చేసినదానికంటే ఎక్కువగా 5912/2024 డాక్యుమెంట్ నంబరుతో 2024 మార్చి 7న 4.06 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. అదే సర్వే నంబరు పేరుతో 0.94 సెంట్ల భూమిని డాక్యుమెంట్ నంబరు 6193/2024లో మరో రిజిస్ట్రేషన్ చేశారు. బోయ భూలక్ష్మికి ఏకంగా 7.10 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేశారు. ఆ వెంటనే స్థిరాస్తి వ్యాపారికి భూమిని విక్రయించేసి సొమ్ము చేసుకున్నారు.

**పట్టా భూములు మార్చేశారు**

హాలహర్వి మండలం జె.హొసళ్లిలో సర్వే నంబరు–51బీలో 17.82 ఎకరాలు పూర్వీకుల నుంచి సంక్రమించిన పట్టాభూమి ఉంది. ఆర్‌హెచ్ నకలు, ఇతర రెవెన్యూ దస్త్రాలు ఉన్నాయి. కుటుంబ సభ్యులు ఏడుగురు భాగపరిష్కారాలు చేసుకోవాల్సి ఉంది. 3.53 ఎకరాల భూమే వారి పేరున ఆన్‌లైన్‌లో ఉంది. మిగిలిన 14.29 ఎకరాలను 2022లో జులైలో 11 మందికి కట్టబెట్టారు. తహసీల్దారు, గ్రామ వీఆర్వో భారీగా ముడుపులు తీసుకొని ఇతరులకు రాసిచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుడు అయ్యప్పగారి వెంకటేష్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ డా.బి నవ్యకు మొర పెట్టుకున్నారు.

**ఎన్నికల ముందు కట్టబెట్టారు**

ఉలిందకొండకు చెందిన బెస్త మంగమ్మకు ఖాతా నంబరు–2335, సర్వే నంబరు–653లో 7.07 ఎకరాల చుక్కల భూమిని 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదు చేశారు. ఈ–పాసు పుస్తకం రాకముందే పథకం ప్రకారం 24-01-2024లో 1050/24 డాక్యుమెంట్ నంబరుతో ఓ రియల్టర్‌కు రిజిస్ట్రేషన్ చేశారు. ఆ ప్రభుత్వ భూమి కాదు.. పూర్వీకుల నుంచి సంక్రమించినట్లు పత్రాల్లో రాసుకోవడం గమనార్హం.

**దస్త్రాలు మార్చేసిన అధికారులు**

పేదల భూములు పెద్దలకు కట్టబెడుతున్నారు.. ప్రభుత్వ భూములు రాసిచ్చేస్తున్నారు. ఎసైన్‌మెంట్ కమిటీ నిబంధనలు అతిక్రమించి చుక్కల భూములు ఓ స్థిరాస్తి వ్యాపారికి కట్టబెట్టిన అంశం తాజాగా వెలుగులోకి వచ్చింది. నగరంలో ఉంటున్న ఆయన కొంతమంది రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకొని అనధికారిక వ్యక్తులు, స్థానికేతరుల పేరిట ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదు చేయిస్తున్నారు. భూములు ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదు చేసినందుకు ఓ వీఆర్వోకు సదరు స్థిరాస్తి వ్యాపారి తన వెంచర్‌లో రూ.20–30 లక్షల విలువ చేసే ఓ ఇంటిని బహుమతిగా ఇచ్చారనే ప్రచారం సాగుతోంది. తహసీల్దారు చేతుల్లో ఉండాల్సిన 'డిజిటల్ కీ' పొరుగుసేవల సిబ్బంది చేతిలో ఉండటంతో వారు ఇష్టానుసారంగా భూరికార్డులను మార్చేస్తున్నారు.

# రక్త గ్రహీత.. విధిపై విజేత!

ఏలూరు : సమస్యల్ని అధిగమించినప్పుడు.. సవాళ్లు స్వీకరించినప్పుడు.. వైకల్యాలు, వైఫల్యాలు చిన్నబోతాయి. భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తాయి. ఇందుకు తలసీమియా బాధిత పిల్లలే నిదర్శనం. బతుకుపై నిత్య పోరాటం చేస్తూ.. అనారోగ్య ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆరోగ్యకర జీవనం వైపు అడుగులేస్తున్నారు. వారికి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులే కొండంత అండగా నిలుస్తూ.. ఆత్మస్థైర్యం నింపుతున్నారు. గురువారం అంతర్జాతీయ తలసీమియా నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

**అయినా ఎదిరించి.. ఉన్నత విద్యనభ్యసించి!**

ఏలూరు నగరానికి చెందిన ఓ యువతి ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నారు. తల్లిదండ్రులు ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తుండగా.. ఒక్కరే కుమార్తె. ఈమె ఆర్నెల్ల వయసులోనే తలసీమియా బారిన పడ్డారు. దీర్ఘకాలిక వ్యాధిని, కష్టాలను అధిగమిస్తూ చదువులో దూసుకెళ్తున్నారు. పదో తరగతిలో 9.6 జీపీఏ, ఇంటర్‌లో 968 మార్కులు సాధించి, ఎంబీబీఎస్‌లో ఉచిత సీటు పొందారు. ప్రస్తుతం నెలకు రెండుసార్లు రక్త మార్పిడి చేయించుకుంటున్నారు. నీట్ రాసే సమయంలో ప్లేట్‌లెట్లు పడిపోవటంతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. తల్లిదండ్రులు ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్సనందించడంతో కోలుకున్నారు. **అధైర్యపడకుండా ముందుకు..**

కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడేనికి చెందిన దంపతులు కూలీలు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. తమకు ఉన్నంతలో కుమార్తె, కుమారుడిని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. కుమారుడికి నాలుగో నెలలోనే తలసీమియా సోకింది. ప్రస్తుతం బాలుడి వయసు తొమ్మిదేళ్లు కాగా, మూడో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ప్రతినెలా రెండుసార్లు ఏలూరు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తలసీమియా చికిత్సా భవనంలో రక్తమార్పిడి చేయిస్తున్నారు. తమ కుమారుడికి వ్యాధి సోకిందని ఎప్పుడూ బాధపడలేదని.. దాన్ని అధిగమిస్తూ అతడి భవిష్యత్‌పై దృష్టి సారించామని తల్లిదండ్రులు చెబుతున్నారు.ఏలూరు తలసీమియా భవనంలో మొత్తం 350 మంది బాధితులు రక్తమార్పిడి చేయించుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాల బాధితులు ఏలూరొచ్చి సేవలు పొందుతున్నారు. ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, పోలవరం మండలాల నుంచి ఎక్కువ మంది వస్తుంటారు. వీరికి ప్రతి నెలా 1000 యూనిట్లు అవసరం కాగా, కొన్నాళ్లుగా రక్త నిల్వలు లేకపోవడంతో 700 నుంచి 800 యూనిట్లు మాత్రమే సమకూరుస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో సమస్య ఎదురవుతోంది. కొన్ని సందర్భాల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో బాధిత పిల్లలు ఒక్కో విడతకు రూ.4 వేల నుంచి రూ.5 వేలు వెచ్చించి రక్తమార్పిడి చేయించుకుంటున్నారు.




## మహానటి ఇక్కడ నిల్.. అక్కడ బిజీ

'మహానటి' సినిమాతో టాలీవుడ్‌తో పాటు పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు దక్కించుకున్న హీరోయిన్ కీర్తి సురేష్. మహానటి తర్వాత టాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసిన కీర్తి సురేష్ గత రెండేళ్లుగా కొత్త సినిమాలు చేయడం లేదు. ఈమె తెలుగులో చివరగా దసరా సినిమాలో హీరోయిన్‌గా నటించింది. నానితో కలిసి నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అయినా కూడా కీర్తి సురేష్‌కి టాలీవుడ్ నుంచి స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు దక్కడం లేదు. ఒకటి రెండు చిన్న సినిమాల్లో ఛాన్స్ వచ్చినా వాటిని కీర్తి సున్నితంగా తిరస్కరించిందని తెలుస్తోంది. స్టార్ హీరోలు కీర్తి సురేష్‌ను హీరోయిన్‌గా పరిగణలోకి తీసుకోవడం లేదు అనేది సినీ విశ్లేషకుల మాట. టాలీవుడ్‌లో పెద్దగా సినిమాల్లో అవకాశాలు లేకపోయినా కోలీవుడ్, బాలీవుడ్‌లో కీర్తి సురేష్ వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. కోలీవుడ్‌లో ప్రస్తుతం ఈమె రెండు సినిమాలు చేస్తోంది. మరో రెండు సినిమాలకు సంబంధించిన



చర్చలు జరుగుతున్నాయని సమాచారం అందుతోంది. పెళ్లి తర్వాత కూడా కోలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా కొనసాగుతోంది. తమిళ్ స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలను ఈ అమ్మడు సొంతం చేసుకుంటుంది. తెలుగులో మాత్రం ఈమెకు స్టార్ హీరోల నుంచి పిలుపు రావడం లేదు. మరో వైపు బాలీవుడ్‌లోనూ ఈమె వరుసగా సినిమాల్లో నటించేందుకు రెడీ అవుతోంది. ఈ అమ్మడు బాలీవుడ్‌లో బేబీ జాన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. తమిళ్ సూపర్ హిట్ సినిమాకు రీమేక్‌గా వచ్చిన 'బేబీ జాన్' సినిమా బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడింది. దాంతో బాలీవుడ్‌లో ఈమెకు ఆఫర్లు రాకపోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అయింది. కానీ బేబీ జాన్ ఫలితంతో సంబంధం లేకుండా వెంటనే అక్క అనే వెబ్ సిరీస్‌లో రాధిక ఆప్టేతో కలిసి నటించే అవకాశంను సొంతం చేసుకుంది. త్వరలోనే అక్క వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతుంది. మరో వైపు రివాల్వర్ రీటా గాను కీర్తి సురేష్ కనిపించబోతుంది. బాలీవుడ్‌లో సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తున్న కీర్తి సురేష్‌కి ఏకంగా రణబీర్ కపూర్‌కి జోడీగా నటించే అవకాశాలు దక్కాయనే వార్తలు వస్తున్నాయి. బాలీవుడ్ మీడియాలో ఈ విషయమై ప్రముఖంగా కథనా లు వస్తున్నాయి. కీర్తి సురేష్ హిందీ కమర్షియల్‌కి సెట్ కాకపోవచ్చు అనే అభిప్రాయంను మొదట్లో చాలా మంది వ్యక్తం చేశారు. నార్త్ హీరోయిన్స్ మాదిరిగా ఈ అమ్మడు పెద్దగా స్కిన్ షో చేయదు. పైగా రొమాంటిక్ సీన్స్‌లో నటించదు. కనుక బాలీవుడ్ సినిమాల్లోనే కాకుండా సౌత్ సినిమా ఇండస్ట్రీలోనూ ఎక్కువ కాలం కొనసాగడం కష్టం అనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేశారు. కానీ కీర్తి సురేష్ జోరు చూస్తూ ఉంటే బాలీవుడ్‌లో రాబోయే రోజుల్లో వరుసగా సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి. రణబీర్ కపూర్‌తో సినిమా కన్ఫర్మ్ అయిందనే వార్తలు వస్తున్న నేపథ్యంలో రాబోయే రెండేళ్లలో కీర్తి సురేష్ హిందీ సినిమా ఇండస్ట్రీలో అర డజనుకు పైగా సినిమాలకు కమిట్ అయ్యే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. టాలీవుడ్‌లో ఆఫర్లు లేని ఈ రీల్ మహానటికి బాలీవుడ్, కోలీవుడ్‌లో ఫుల్ బిజీగా ఆఫర్లు చేతిలో ఉన్నాయి. రాబోయే రోజుల్లోనూ అక్కడ బిజీ బిజీగా సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి.


## నేషనల్ క్రష్ ఆస్తి ఎన్నికోట్లు అంటే?

నేషనల్ క్రష్ రష్మికా మందన్నా రేంజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు పట్టిందల్లా బంగారమే అవుతుంది. యానిమల్ , పుష్ప-2, ఛావా ఇలా వరుస సినిమాలతో పాన్ ఇండియాలోనే సంచలనంగా మారిన బ్యూటీ. బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లతో అమ్మడి రేంజ్ అంతకంతకు రెట్టింపు అవుతుంది. నటిగా అన్ని భాషల్లోనూ అవకాశాలు వస్తున్నాయి. కోట్ల రూపాయలు పారితోషికం తీసుకుంటుంది. రెండేళ్ల తర్వాత చేసే సినిమాకు ఇప్పటి నుంచి అడ్వాన్సులు ఇవ్వడానికి నిర్మాతలు క్యూలో ఉన్నారు. సొగసరి తో



లేడీ ఓరియేంటెడ్ చిత్రాలు తీయడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం రష్మిక మాత్రం బాలీవుడ్ కెరీర్ పైనే దృష్టి పెట్టి సినిమాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా రష్మిక ఆస్తుల చిట్టా బయటకు వచ్చింది. ప్రఖ్యాత పోర్బ్స్ నివేదిక బయటపెట్టింది. అమ్మడి వయసు 28. కానీ ఆస్తి మాత్రం 66 కోట్ల వరకూ సంపాదించింది. ఒక్కో సినిమాకు 4 నుంచి 8 కోట్ల మధ్యలో పారితోషికం రూపంలో అందుకుం టుంది. అతి త్వరలోనే ఆమె ఆస్తి విలువ 100 కోట్లకు చేరుతుందని పోర్బ్స్ అంచనా వేస్తోంది. హీరోయిన్ గా నటిస్తూనే రష్మిక బ్రాండ్ అంబాసిడర్ గాను కొనసాగుతుంది. వాణిజ్య ప్రకటనల్లో నటించే అవకాశం వచ్చిందంటే కాదనకుండా లాక్ చేస్తుంది. అది చిన్నదైనా... పెద్దతైనా చేయి దాటిపోకుండా డీల్ కుదుర్చుకుని క్లోజ్ చేస్తుంది. యానిమల్ విజయం దగ్గర నుంచి ఈ రకమైన స్పీడ్ బాగా పెంచింది. ఫాంలో ఉన్నంత కాలమే దున్నుకోవాలి అన్న చందంగా రష్మిక బ్రాండింగ్స్ చేస్తుంది. ఇదంతా కేవలం రష్మిక కష్టార్జితం. నటిగా ప్రయాణం మొదలైన దగ్గర నుంచి తాను సంపాదించిందే ఇదంతా. కన్నడ చిత్రంతో పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

## 'సర్దార్ 2' అప్డేట్.. కార్తీ నట విశ్వరూపం!




కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ ప్రస్తుతం సర్దార్ 2 మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. బ్లాక్ బస్టర్ హిట్ మూవీ సర్దార్ కు సీక్వెల్ గా వస్తున్న ఆ సినిమాకు పీ ఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మాత ఎస్. లక్ష్మణ్ కుమార్ భారీ బడ్జెట్ తో సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే సర్దార్-2 పై భారీ బజ్ క్రియేట్ అయింది. రీసెంట్ గా మేకర్స్.. సినిమా నుంచి కార్తీ ఫస్ట్ లుక్ తో పాటు ప్రోలాగ్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ అదిరిపోగా.. సీక్రెట్ ఏజెంట్ గా కార్తీ సినిమాలో కనిపించనున్నారని క్లియర్ గా తెలుస్తోంది. ప్రస్తుతం ప్రోలాగ్ వీడియో సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. మూవీ లవర్స్ నుంచి మంచి రెస్పాన్స్ అందుకుం టోంది. అయితే వేరే లెవెల్ ఫైట్ సీక్వెన్స్ తో ప్రోలాగ్ వీడియో స్టార్ట్ అవ్వగా.. సర్దార్ పై దాడి చేసేందుకు కొందరు వస్తారు. అప్పుడు దేశం ప్రమాదంలో ఉందని గ్రహిస్తాడు. ఆ తర్వాత బ్లాక్ డాగ్గర్ ప్రళయం క్రియేట్ చేసేందుకు ట్రై చేస్తున్నాడని చెబుతాడు. పోరాడేందుకు సిద్ధపడతాడు. కోలీవుడ్ స్టార్ నటుడు ఎస్ జే సూర్య నెగిటివ్ రోల్ లో కనిపిస్తారు. అసలు దేశాన్ని నాశనం చేసేందుకు ఎస్ జే సూర్య ఏం చేశాడు? కార్తీ దాన్ని ఎలా ఛేజ్ చేశాడు? అన్నది సినిమాగా తెలుస్తోంది. మొత్తానికి ప్రోలాగ్ వీడియోలోని కార్తీ డైలాగ్స్.. మూవీపై మంచి అంచనాలు నెలకొల్పాయి. ఆయన గెటప్ అండ్ యాక్టింగ్.. అదిరిపోయిందని నెటిజన్లు, మూవీ లవర్స్ కొనియాడుతున్నారు. కార్తీ నట విశ్వరూపం అని కామెంట్లు పెడుతున్నారు. ఇక సినిమా విషయానికొస్తే.. ఆషిక రంగనాథ్, మాళవిక మోహనన్ హీరోయిన్లు గా నటిస్తున్నారు. ఎస్ జే సూర్య విలన్ గా కనిపించనున్నారు. యువన్ శంకర్ రాజా మ్యూజిక్ అందిస్తున్నారు. జార్జ్ సి.విలియమ్స్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే మూవీ షూటింగ్ పూర్తి కాగా.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలోనే రిలీజ్ కానుంది. అయితే 2022లో రిలీజ్ అయిన సర్దార్ భారీ విజయం సొంతం చేసుకుంది. దీంతో ఇప్పుడు అంతకు మించి ఫ్యాన్స్ ఎక్స్పెక్ట్ చేస్తున్నారు. మరి సర్దార్ 2 ఎలా ఉంటుందో.. ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

## బాలీవుడ్ తారల కొత్త ట్రెండ్



ఫిల్మ్ ఇండస్ట్రీలో ఏదీ జరిగే వరకు నమ్మలేం. ఒకరితో మొదలుపెట్టిన ప్రాజెక్టు మరొకరి చేతిలోకి వెళ్లడం, అనౌన్స్ చేసిన సినిమా నుంచి నటీనటులు తప్పుకోవడం, కొన్నిసార్లైతే ఏకంగా ఆ ప్రాజెక్టు ఆగిపోవడం కూడా జరుగుతాయి. బాలీవుడ్ లో ఈ మధ్య ఇలాంటి వింత ధోరణి ఒకటి రెగ్యులర్ గా జరుగుతూ వస్తుంది. ఆల్రెడీ కమిట్ అయిన భారీ బడ్జెట్ సినిమాల నుంచి కొంత మంది బాలీవుడ్ నటీనటులు తప్పుకోవడం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. అందులో కొందరు తప్పని పరిస్థితుల్లో తప్పుకుంటుంటే మరికొందరు అనవసర విషయాల వల్ల ఆ ప్రాజెక్టులను వదులుకుంటున్నారు. ఈ విషయం అటు ఫ్యాన్స్‌నీ, ఇటు దర్శకనిర్మాతలను తీవ్రంగా నిరాశ పరుస్తుంది. అలా భారీ ప్రాజెక్టుల్లో అవకాశాలను మిస్ చేసుకున్న సెలబ్రిటీలు బాలీవుడ్ లో చాలా మందే ఉన్నారు. వారిలో పరేల్ రావల్ ఒకరు. హేరా ఫేరి3 నుంచి అతను తప్పుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. హేరా ఫేరిలో ఐకానిక్ బాబూరావ్ ఆప్టే పాత్రలో నటించి అందరినీ మెప్పించిన ఆయన హేరా ఫేరి3 నుంచి తప్పుకోవడం ఇండస్ట్రీలో పెద్ద సంచలనమే సృష్టించింది. దీంతో పరేల్ రావల్ పై అక్షయ్ కుమార్ రూ. 25 కోట్ల పరిహారం డిమాండ్ చేస్తూ కేసు కూడా పెట్టాడని బాలీవుడ్ లో వార్తలు వినిపిస్తున్నాయి. అందరూ ఎంతో ఎదురుచూస్తున్న బాలీవుడ్ ప్రిస్టీజియస్ ప్రాజెక్టు రామాయణం సినిమాలో రణ్‌బీర్ కపూర్ సరసన సీతగా నటించడానికి మొదట్లో ఆలియా భట్ సైన్ చేసింది కానీ తర్వాత తన ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్ వల్ల ఆ సినిమా నుంచి తప్పుకోవడంతో ఆ పాత్రను ఇప్పుడు సాయి పల్లవి చేస్తోంది. ఇక సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ చేయబోయే స్పిరిట్ సినిమాలో దీపికా ప్లేస్ లో త్రిప్తి డిమ్రీని తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని డైరెక్టర్ సందీప్ ఓపెన్ గా చెప్పాడు. తనకు వెన్నుపోటు పొడిచి కథను లీక్ చేశారని ఫైర్ అవుతూ సందీప్ ఈ విషయమై ట్వీట్ కూడా చేశాడు. యష్ నటిస్తున్న టాక్సిక్ సినిమాలో కరీనా కపూర్ ఖాన్ కూడా నటించాల్సింది కానీ ఆమె షెడ్యూల్స్ కుదరకపోవడంతో టాక్సిక్ నుంచి ఆమె తప్పుకుంది. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ చేయాల్సిన రాక్షస్ సినిమా సెట్స్ పైకి వెళ్లడమే లేట్ అనుకునే టైమ్ లో ఆగిపోయింది. ఇద్దరికీ మధ్య క్రియేటివ్ డిఫరెన్స్ రావడంతో ఆ సినిమా ఆగిపోయిందని సమాచారం. ఇప్పుడదే ప్రాజెక్టు ను ప్రశాంత్ వర్మ ప్రభాస్ తో చేయడానికి చూస్తున్నాడని తెలుస్తోంది. అయితే బాలీవుడ్ లో గత కొన్నాళ్లుగా నడుస్తున్న ఈ ట్రెండ్ ఇప్పుడు ఫ్యాన్స్ ను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. మంచి మంచి ప్రాజెక్టుల్లో ఆఫర్లు రావడం, వారు ప్రాజెక్టుల్లో చేరడం వల్ల సినిమాపై హైప్ పెరగడం, ఆ తర్వాత ఆ ప్రాజెక్టు నుంచి వారు తప్పుకోవడంతో ఫ్యాన్స్ నిరాశ పడుతున్నారు.

## దేవకన్యలా.. మిత్రవిందగా.. బేబీ లుక్కు అదిరింది..!

షార్ట్ ఫిలిమ్స్ తో కెరీర్ మొదలు పెట్టి ఆ తర్వాత సినిమాల్లో సైడ్ రోల్స్ చేస్తూ బేబీతో హీరోయిన్ గా సూపర్ హిట్ అందుకున్న భామ వైష్ణవి చైతన్య. అమ్మడు హీరోయిన్ గా నటించిన ఫస్ట్ సినిమానే సూపర్ హిట్ అందుకుంది. ఐతే సెకండ్ మూవీగా చేసిన లవ్ మీ సినిమా మాత్రం ఫెయిల్ అయ్యింది. అయినా సరే అమ్మడు ఏమాత్రం జోష్ తగ్గకుండా సినిమాలు చేస్తుంది. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ తో జాక్ సినిమా చేస్తుంది వైష్ణవి చైతన్య. ఆ సినిమాలో సిద్ధు తో మంచి రొమాంటిక్ ఎంటర్టైనర్ గా సినిమా చేస్తున్నట్టుగా ఉంది. బొమ్మరిల్లు భాస్కర్ డైరెక్షన్ లో వస్తున్న సినిమా కాబట్టి వైష్ణవి చైతన్య లక్కీగా ఫీల్ అవుతుంది. ఇక సినిమాలతో పాటు సోషల్ మీడియాలో తన ఫోటో షూట్స్ తో అలరిస్తుంది వైష్ణవి చైతన్య. రకరకాల ఫోటో షూట్స్ తో ఫ్యాన్స్ ని మెప్పిస్తుంది. లేటెస్ట్ గా అమ్మడు దేవకన్యగా మారి



ఫోటో షూట్ చేసింది. పండగ వైబ్ ని మరింత పెంచేలా వైష్ణవి లుక్ ఉంది. ముఖ్యంగా ఒక మహారాణి లుక్ తో కనిపిస్తుంది వైష్ణవి చైతన్య. ఈ ఫోటోలు చూసిన చాలామంది మగధీరలో మిత్రవిందకు ఏమాత్రం తీసిపోదనేలా ఉందని కామెంట్స్ చేస్తున్నారు. నిజమే అమ్మడి ఫోటో షూట్ ప్లానింగ్స్ ఎవరు ఇస్తున్నారో కానీ యువరాణి గెటప్ లో వైష్ణవి నిజంగానే దేవకన్యలానే కనిపిస్తుంది. జాక్ సినిమా హిట్ పడితే అమ్మడి కెరీర్ కు కాస్త బూస్టింగ్ వస్తుంది. ఐతే సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో హంగామా చేస్తుంది వైష్ణవి చైతన్య. సో అందుకే ఆమె ఫోటో షూట్స్ కి స్పెషల్ క్రేజ్ ఏర్పడుతుంది. అంతేకాదు తన టీం కూడా వైష్ణవిని సోషల్ మీడియాలో బాగా బూస్ట్ చేస్తుంది. తప్పకుండా వైష్ణవికి ఇదంతా కలిసి వచ్చేలా ఉందని చెప్పొచ్చు. జాక్ సినిమా రిజల్ట్ ఏదైనా సరే వైష్ణవి తన ఫోటో షూట్స్ తో ప్రత్యేకమైన క్రేజ్ తెచ్చుకోవాలని చూస్తుంది. అందుకే ఆమె ఇలా ఫోటోస్ షేర్ చేయగానే అలా వైరల్ అవుతున్నాయి. తెలుగు అమ్మాయికి ఇక్కడ మంచి అవకాశాలు వస్తే మరికొంతమంది సినిమాల్లోకి వచ్చే ఛాన్స్ ఉంటుంది. అందుకే వారిలో కాన్ఫిడెన్స్ నింపేందుకు వైష్ణవి తన కెరీర్ బిల్డ్ చేసుకుంటుంది.

## 100కోట్ల డిజాస్టర్ తరువాత మరో లక్కీ ఛాన్స్?

సౌత్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటిగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్‌కు బాలీవుడ్ ఎంట్రీ పెద్ద నిరాశను మిగిల్చింది. అట్లీ దర్శకత్వం వహించిన తమిళ బ్లాక్‌బస్టర్ 'తెరి' ఆధారంగా తెరకెక్కించిన హిందీ చిత్రం బేబీ జాన్. అయితే ఈ సినిమా ద్వారా ఆమె హిందీ పరిశ్రమలోకి అడుగుపెట్టింది. ఇందులో ఆమెకు వన్ ఆఫ్ ది లీడ్ పాత్రే అయినా, సినిమా ఫెయిల్యూర్‌తో పాటు ఆమె నటన కూడా విమర్శలు ఎదుర్కొంది. వరుణ్ ధవన్, జాకీ ష్రాఫ్ లాంటి స్టార్‌లతో కూడిన భారీ బడ్జెట్ మూవీ అయినా, కేవలం రూ. 39.28 కోట్లే వసూలు చేయడం అందరికి షాక్ ఇచ్చింది. ఇక దాదాపు రూ. 160 కోట్ల బడ్జెట్ ఉన్న ఈ చిత్రానికి భయంకరమైన లాస్ కలిగించింది. ముఖ్యంగా కీర్తి సురేష్ పోషించిన డాక్టర్ మీర వర్మ పాత్ర ప్రేక్షకులలో ఎమోషనల్ కనెక్షన్ రాకపోవడం గమనార్హం. ఆమె నటనపై కూడా విమర్శలు వచ్చాయి. మహానటితో మెప్పించిన ఆమె ఈ సినిమాలో మెరుగ్గా కనిపించలేదన్న అభిప్రాయం స్పష్టంగా వ్యక్తమైంది. ఈ నేపథ్యం చూస్తే, బాలీవుడ్‌లో ఆమె ప్రయాణం ప్రారంభమవకముందే ముగిసినట్టేనా అనే అనుమానాలు కలుగడం సహజం. గతంలో కొంతమంది సౌత్ బ్యూటీలు బాలీవుడ్ లో క్లిక్కయిన కూడా ఎక్కువ



కాలం నిలవలేదు. అలాంటిది ఫస్ట్ సినిమాకే 100 కోట్లు నష్టాలు రావడంతో అమ్మడిపై ఎవరు ఫోకస్ చేయరని కథనాలు వచ్చేశాయి. కానీ తాజాగా వస్తున్న ఓ వార్త మాత్రం ఆమె కెరీర్ పై కొత్త ఆసక్తిని రేకెత్తిస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్‌తో కీర్తి కలిసి నటించే అవకాశం ఉందట. ఇది తుది అఫీషియల్ కాకపోయినా, ఇందుకు సంబంధించి బాలీవుడ్ వర్గాల్లో చర్చ సాగుతోందని సమాచారం. రణబీర్ కపూర్ ప్రస్తుతం లవ్ అండ్ వార్, రామాయణం, ధూమ్ 4 వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నా, ఒక కొత్త ఎమోషనల్ లవ్ స్టోరీ కోసం నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారని టాక్. ఆ ప్రాజెక్ట్‌కి కీర్తి ఎంపిక కావడం జరిగితే, ఆమెకు బాలీవుడ్‌లో రెండో అవకాశం లభించనుంది. ఈసారి మాత్రం బలమైన స్క్రిప్ట్, మల్టీ లేయర్డ్ పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశముంది. దక్షిణాదిలో తన ప్రూవన్ స్కిల్స్ ఉన్నప్పటికీ, బాలీవుడ్ ప్రేక్షకులకు కీర్తి సురేష్ నటన సరైన కాన్వాస్‌లో చూపించాల్సిన అవసరం ఉంది. రణబీర్ లాంటి వెర్సటైల్ నటుడితో కలిసి నటించడం ఆమె కెరీర్‌కు మళ్లీ ఊపునిస్తే ఆశ్చర్యం లేదు. ఇక బాలీవుడ్‌లో ఆమె మళ్లీ బౌన్స్ బ్యాక్ అవుతుందో లేదో చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536